తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 30.07.2026 | సంపుటి :13 సంచిక : 10 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్



ప్రకటనల కోసం సంప్రదించండి

98483 28698







## విద్యార్థులపై పోలీస్ కాల్పులకు

# అనుమతెవరిచ్చారు?

### అమిత్‌షా సమాధానం చెప్పాలి

- ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదు... భావ వ్యక్తీకరణ
- పేపర్ లీక్‌పై బీజేపీ ఎంపీల పిల్లలనే అడగండి చెబుతారు
- లోక్‌సభలో నిలదీసిన రాహుల్ గాంధీ, ప్రియాంక,

**జులై 25న కొన్ని ప్రశ్నలు సంధిస్తూ హోంమంత్రి అమిత్‌షాకు నేను లేఖ రాశా. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ వాడకపోతే ఎవరు ఆ పని చేశారని అడిగా. విద్యార్థులపై దాడికి అమిత్‌షా బాధ్యులని నేను చెప్పా. దేశానికి ఉపయుక్తమైన అంశాలపై మాట్లాడడం విపక్ష నేతగా నా హక్కు. అయితే, ఈ అంశంపై కేంద్రాన్ని ప్రశ్నిస్తే దిల్లీ వీధుల్లో విద్యార్థులపై దారుణంగా దాడి చేశారు. పెల్లెట్ గన్ తగిలి ఒక యువకుడి కన్ను కోల్పోవాల్సి వచ్చింది. పెల్లెట్ గన్ తగిలి గాయమైనట్లు ఎయిమ్స్ మెడికల్ సర్టిఫికెట్ చూశా. అత్యంత దారుణంగా ముళ్ల లాఠీలతో మహిళలు, మైనర్లపై దాడులు చేశారు." - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ**



**న్యూఢిల్లీ,జూలై29(జనంసాక్షి):** యువత సెంటిమెంట్‌ను అందరం గౌరవించాల్సిన అవసరం ఉందని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. తీవ్ర వేదన తర్వాతే దిల్లీ జంతర్ మంతర్ వేదికగా విద్యార్థులు ఆందోళనకు దిగారని చెప్పారు. నీట్-యూజీ 2026 పేపర్ లీక్‌పై విద్యార్థులు చేస్తున్న నిరసనలు కోపం లేదా హింస కాదని, అవి భారతదేశ భవిష్యత్ తరాల ఆకాంక్షలు, ఆందోళనలకు ప్రతిబింబమని పేర్కొన్నారు. యాంటీ పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో రెండోరోజు చర్చను ప్రారంభించిన రాహుల్‌గాంధీ, ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ ఘటనలతో ఆందోళనకు గురయ్యారని చెప్పారు. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు తనతో చెప్పారని రాహుల్ పేర్కొన్నారు. రాహుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై అధికారపక్ష మిగతా 2లో..



## యాంటీ పేపర్ లీక్ బిల్లుకు

# లోక్‌సభ ఆమోదం

### వాడీవేడీ చర్చ అనంతరం మూజువాణి ఓటుతో ఆమోదం

- విపక్షాల సవరణలను తిరస్కరించిన ప్రభుత్వం
- బిల్లు ఆమోదంతో లోక్‌సభ నేటికి వాయిదా

2లో..

## వందేమాతరం బిల్లుకు

# రాజ్యసభ ఆమోదం

అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్

2లో..




## హోంశాఖ ఆదేశాలతోనే

# విద్యార్థులపై కాల్పులు

- ఆ శాఖను నిర్వహిస్తున్న అమిత్ షాపై చర్యలు తీసుకోవాలి
- జరిగిన దాడులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలి
- భాజపా, ఆర్ఎస్ఎస్‌లకు ఎప్పటికీ క్షమాపణ చెప్పను
- విలేకరుల సమావేశంలో రాహుల్ గాంధీ విమర్శ

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** దిల్లీలో ఇటీవల విద్యార్థులపై జరిగిన దాడికి కేంద్ర హోం శాఖ మంత్రి కారణమని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఆ శాఖను నిర్వహిస్తున్న అమిత్ షాపై చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీకి విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా, విద్యార్థులపై జరిగిన దాడులపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన.. లోక్‌సభలో మాట్లాడేందుకు తనకు అవకాశం ఇవ్వలేదన్నారు. తాను మాట్లాడేందుకు ప్రయత్నించిన ప్రతిసారి మిగతా 2లో..



## రాష్ట్రవ్యాప్తంగా

# భారీ వర్షాలు

### నిండుకుండలా జలాశయాలు • ఓసీల్లో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్

- భారీ వర్షాల కారణంగా సింగరేణి ప్రాంతాల్లో అంతరాయం
- బొగ్గు ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలు తాత్కాలికంగా నిలిపివేత
- మంచిర్యాల జిల్లాలో 32 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం
- భూపాలపల్లి జిల్లాలోనూ ఆగిన ఓవర్ బర్డెన్ పనులు





**మంచిర్యాల/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధులు/రామకృష్ణాపూర్/మల్హార్‌రావు(జనంసాక్షి):** ఎడతెరిపి లేని వర్షాల కారణంగా భూపాలపల్లి, మంచిర్యాల జిల్లాల్లోని సింగరేణి ఏరియాల్లో ఓపెన్ కాస్ట్ గనుల్లోకి నీరు చేరింది. భద్రతా కారణాల దృష్ట్యా అధికారులు బొగ్గు ఉత్పత్తి, రవాణా కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేశారు. గనుల్లో పనిచేస్తున్న డంపర్లు, భారీ యంత్రాలను సురక్షిత ప్రాంతాలకు తరలించి ఒకేచోట నిలిపివేశారు. విధుల్లో ఉన్న కార్మికులను వెంటనే ఇళ్లకు పంపించారు. వర్షం తగ్గి పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చిన తర్వాతే తవ్వకాలు, బొగ్గు రవాణా పనులు పునఃప్రారంభిస్తామని సింగరేణి అధికారులు తెలిపారు. గనుల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.మంచిర్యాల జిల్లాలో నిన్నటి నుండి కురుస్తున్న భారీ వర్షాలకు భూగర్భ గనులు మినహా ఉపరితల గనులలోకి వరద నీరు చేరి బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుంది. అల్పపీడనం తుఫాన్ మూలంగా నిన్న రెండవ బదిలీ నుండి ఓపెన్ కాస్ట్ బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. మిగతా 2లో..

## పోలీస్ శాఖలో

# కొలువుల జాతర

### 7,437 పోస్టులకు నోటిఫికేషన్లు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం




**హైదరాబాద్(జనంసాక్షి):** తెలంగాణ పోలీసు శాఖలో భారీగా ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్లు విడుదల చేసింది. మొత్తం 7,437 ఉద్యోగాల భర్తీ చేయనున్నట్లు తెలంగాణ పోలీసు నియామక మండలి వెల్లడించింది. ఈ మేరకు నాలుగు నోటిఫికేషన్లను విడుదల చేసింది. సివిల్, ఏఆర్, స్పెషల్ పోలీసు, జైళ్లు, ఫైర్ విభాగాల్లో ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. కానిస్టేబుల్ (సివిల్) 3,697, కానిస్టేబుల్ (ఏఆర్) 1,052 పోస్టులు భర్తీ చేయనున్నారు. స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్‌లో ఎస్సై 44, కానిస్టేబుల్ 1,380 పోస్టులున్నాయి. ఫైర్ విభాగంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ 39, ఫైర్ ఫైటర్ 751 పోస్టులు భర్తీ చేయనున్నారు. జైళ్ల శాఖలో 223 పోస్టులు భర్తీ చేయనున్నట్లు పోలీసు నియామక మండలి తెలిపింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని.. దానికి సంబంధించిన తేదీలను త్వరలో వెల్లడిస్తామని పేర్కొంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ సందర్శించాలని సూచించింది.

## దేవాదాయ శాఖలో మరోసారి

# పదోన్నతుల పండుగ

48 మంది ఉద్యోగులకు ఈవో హోదా

వార్త 9 లో

## కాళేశ్వరంపై కేటీఆర్ వ్యాఖ్యలు

# సిగ్గుచేటు

- ప్రాజెక్టు వారి హయాంలోనే కట్టడం..కూలడం చూశాం
- దీనిపై ఇంకా సమర్థించుకోవడం సరికాదు
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నాం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**న్యూఢిల్లీ,జూలై29(జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కేటీఆర్ మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి విమర్శించారు. నాణ్యత లోపాలతోనే కాళేశ్వరం కట్టారని అన్నారు. వారి హయాంలోనే కట్టడం, కూలడం రెండూ జరిగాయని అన్నారు. దీనిపై ఇంకా సమర్థించుకునే చర్యలు సిగ్గుచేటని అన్నారు. వారు సరిగా కట్టి ఉంటే ఈ సమస్య వచ్చేది కాదని మండిపడ్డారు. బ్యారేజీలో 2..3 టీఎంసీలు నిల్వ చేయమంటే 10 టీఎంసీలు ఎందుకు స్టోర్ చేశారని ప్రశ్నించారు. దిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతులకు నీళ్లు ఇచ్చేందుకు ఉన్న అన్ని అవకాశాలను ఉపయోగించుకుంటామని స్పష్టం చేశారు. ఎన్‌డీఎస్ఏ నివేదిక మేరకు చర్యలు తీసుకుంటున్నా మన్నారు. నిపుణుల సాయంతో వీలైనంత త్వరగా బ్యారేజీ మరమ్మతు పనులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరంపై అంతర్జాతీయ నిపుణులతో, ఎన్డీఎస్ఏ అధికారులతో చర్చిస్తున్నామని మంత్రి ఉత్తమ్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు. మూడు బ్యారేజ్‌లను టెస్టింగ్ చేస్తున్నామని చెప్పుకొచ్చారు. ఐఐటీ బాంబే, ఆఫ్రో ఇండియాతో రిహాబిలిటేషన్ డిజైన్స్ వర్క్ పూర్తి చేస్తామని వెల్లడించారు. వీలైనంత త్వరగా మరమ్మతులు చేపడతామని తెలిపారు. రైతులకు నీళ్లు ఇవ్వడానికి తాము అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని వివరించారు. కాళేశ్వరాన్ని కేసీఆర్ ప్రభుత్వం సరిగ్గా కడితే ఈ సమస్య వచ్చేది కాదని మంత్రి ఉత్తమ్ అన్నారు. కాళేశ్వరం కూలిపోవడానికి ప్రధాన కారణం నాసిరకం డిజైన్, నాసిరకం నిర్మాణమేనని వెల్లడించారు. మాజీ మంత్రి కేటీఆర్ కంటే తెలివైన మేధావులు తమకు సలహాలు ఇస్తున్నారని చెప్పారు. కాళేశ్వరంపై ఇప్పుడు బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం సిగ్గుచేటని విమర్శించారు. తమకు ఎలాంటి మిగతా 2లో..

## తెలంగాణ ప్రాజెక్టులకు

# భారీ ఊరట

### పర్యావరణ అనుమతులు చెల్లుబాటు

### సుప్రీంకోర్టులో ఉపశమనం

**న్యూఢిల్లీ,జూలై29(జనంసాక్షి):** తెలంగాణలోని పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు సుప్రీంకోర్టు భారీ ఉపశమనం కల్పించింది. కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ 2021లో జారీ చేసిన ఆఫీస్ మెమోరాండంను సుప్రీంకోర్టు కొట్టివేసినా.. ఆ ఉత్తర్వు ఆధారంగా ఇప్పటికే మంజూరైన పర్యావరణ అనుమతులన్నీ పూర్తిగా చెల్లుబాటులోనే ఉంటాయని స్పష్టం చేసింది. ఈ తీర్పు భవిష్యత్తుకు మాత్రమే వర్తిస్తుందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలోని ధర్మాసనం పేర్కొంది. దీంతో తెలంగాణలో కొనసాగుతున్న ఈ కీలక సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాలకు ఎలాంటి చట్టపరమైన ఆటంకం ఉండదని స్పష్టత వచ్చింది. అదే సమయంలో భవిష్యత్తులో చేపట్టే కొత్త ప్రాజెక్టులకు ముందస్తు పర్యావరణ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని న్యాయస్థానం పేర్కొంది. కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా చట్టాలను భర్తీ చేయడం సాధ్యం కాదని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అత్యవసర పరిస్థితుల్లో మినహాయింపులు ఇవ్వాలంటే కేంద్రప్రభుత్వం చట్టబద్ధమైన నోటిఫికేషన్ మిగతా 2లో..





## ఉప్పొంగిన గోదారి

భారీ వర్షాలతో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు చేరుతుండటంతో నందిమేడారం నందిపంప్ హౌస్ నుంచి గోదావరి జలాల ఎత్తిపోతలు ప్రారంభమయ్యాయి. ఈ నీటిని రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రి పంప్ హౌస్ నుంచి ఎత్తిపోతలు పునఃప్రారంభించారు. మూడు బాహుబలి పంపులతో సుమారు 10,500 క్యూసెక్కుల జలాలను ఎత్తిపోస్తున్నారు. ఇక్కడి నుంచి ఎస్సారెస్పీ వరద కాలువ ద్వారా నేరుగా మధ్య మానేరులోకి జలాలను తరలిస్తున్నారు.




## ఉదయ్‌కృష్ణారెడ్డి లైంగిక వేధింపులకు

# ఆధారాలున్నాయి




ప్రేమించి.. బెదిరింపులకు గురిచేశాడు :సీపీ సజ్జనర్

ట్రైనీ ఐపీఎస్‌కు 14రోజుల రిమాండ్

చంచల్‌గూడ జైలుకు తరలించిన పోలీసులు

2లో..




# హోంశాఖ ఆదేశాలతోనే విద్యార్థులపై కాల్పులు

మైక్‌ను కట్ చేశారని అన్నారు. "విద్యార్థులపై దాడికి అమిత్ షా బాధ్యులని మాత్రమే చెప్పాను. మాట్లాడే అవకాశం ఇస్తే కదా క్షమాపణ చెప్పే అవకాశం వస్తుంది. అయినా.. ఎప్పటికీ భాజపా, ఆర్ఎస్ఎస్‌కు క్షమాపణ చెప్పను. దేశానికి ఉపయుక్తమైన అంశాలపై మాట్లాడడం విపక్ష నేతగా నా హక్కు. కేంద్రాన్ని ప్రశ్నిస్తే విద్యార్థులపై దారుణంగా దాడి చేశారు. పెల్లెట్ తగిలి ఓ యువకుడు కన్ను కోల్పోవాల్సి వచ్చింది. ముళ్ల లాఠీలతో మహిళలు, మైనర్లపై దాడులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలతోనే ఢిల్లీ పోలీసులు దాడులకు పాల్పడ్డారు. బాధిత విద్యార్థులకు న్యాయం జరగాలి. హోంశాఖ మంత్రిపై చర్యలు తీసుకోవాలని ప్రధానికి విజ్ఞప్తి చేస్తున్నా" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

# కాళేశ్వరంపై కేటీఆర్ వ్యాఖ్యలు సిగ్గుచేటు

రాజకీయాలు చేయాల్సిన అవసరం లేదని చెప్పుకొచ్చారు. గేట్లు ఎత్తిపెట్టి ఫ్రీ ఉండాలనే విషయాన్ని ఎన్డీఎస్ఏ అధికారులు స్పష్టం చేశారని అన్నారు. కాపర్ డ్యాం కట్టాలా, వద్దా అని ఎన్డీఎస్ఏ అధికారుల సలహా ప్రకారమే నడుచుకుంటామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. కాళేశ్వరంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) సమావేశం ఈనెల 31వ తేదీన నిర్వహిస్తామని పేర్కొన్నారు. సీడబ్ల్యూసీ, తెలంగాణ ప్రభుత్వంతో ఈ సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. కాళేశ్వరంపై ఎలా ముందుకెళ్లాలనే విషయంపై ఈ సమావేశంలో చర్చిస్తామని అన్నారు. ఎన్డీఎస్ఏ అధికారులు లిఖితపూర్వకంగా ఇచ్చే సూచనల ప్రకారం ముందుకెళ్తామని స్పష్టం చేశారు. హైడ్రాపై ఉత్తమ్ కుమార్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గర ఉన్న శాఖనని.. వారే దానిపై నిర్ణయం తీసుకుంటారని తెలిపారు. హైడ్రాపై ముఖ్యమంత్రి మాట్లాడిన తర్వాత తాను మాట్లాడటం సబబు కాదని చెప్పుకొచ్చారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని, ఆయనే నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేశారు.

# తెలంగాణ ప్రాజెక్టులకు భారీ ఊరట

జారీ చేయాల్సిందేనని సూచించింది. ఇప్పటికే పూర్తయిన లేదా నిర్మాణంలో ఉన్న కీలక ప్రాజెక్ట్ పనులకు ఎలాంటి అంతరాయం ఉండదని న్యాయస్థానం పేర్కొనడంతో తెలంగాణ ప్రభుత్వం, సాగునీటి ప్రాజెక్టులకు ఇది కీలక ఊరటనిచ్చిన తీర్పుగా భావిస్తున్నారు.

# సర్ ప్రక్రియలో చురుకుగా పాల్గొనండి

### కాంగ్రెస్ బీఎల్ఏలకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

**న్యూఢిల్లీ(జనంసాక్షి):** ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను కాంగ్రెస్ బీఎల్ఏలు వేగవంతం చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజలకు చేరువ చేసేందుకు యాక్షన్ ఎ÷-లాన్ సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ఎమ్మెల్సీ గ్రాడ్యుయేషన్ ఎలక్షన్‌పై జిల్లా ఇన్‌చార్జ్, జిల్లా పీసీసీలతో చర్చించి ముగ్గురు సభ్యులతో ప్యానల్ ఏర్పాటు చేసి నివేదిక అందించాల్సి ఉంటుందని తెలిపారు. పౌరులుగా హక్కు ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని సూచించారు. బీఎల్ఏలు బాగా పనిచేస్తున్నారని అభినందించారు. ఏఐసీసీ కార్యాలయంలో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం ఈరోజు జరిగిందని మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సర్‌పై రివ్యూ చేశామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. 36 వేల మంది బీఎల్ఏలను నియమించినట్లు చెప్పారు. 50-60 శాతం ఈ ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. రెండు, మూడు రోజుల్లో 100 శాతం పూర్తవుతుందని వివరించారు. అర్హతగల ఓటర్ల ఓటు హక్కు కాపాడటం తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. ఈసారి ÷ూఎఖీ ప్రక్రియ దురుద్దేశంతో జరుగుతుందని చెప్పారు. ఓట్లను కాపాడే ఉద్దేశంతో ఈ సమావేశంలో చర్చించామని తెలిపారు. సంస్థాగత బలోపేతం, పార్టీ ప్రభుత్వ సమన్వయంపై మాట్లాడామని మహేశ్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా, ఢిల్లీ ఇందిరా భవన్‌లో తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం బుధవారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ , మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి , సీతక్క , సీడబ్ల్యూసీ సభ్యులు మంత్రి దామోదర్ రాజానర్సింహ, వంశీచంద్ పాల్గొన్నారు. ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియ, పార్టీ - ప్రభుత్వం మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రధానంగా చర్చిం చారు.

# అమెరికాలో రష్యాపై ఆంక్షల బిల్లు..

### భారత్‌పై 100 శాతం టారిఫ్‌ల ఎఫెక్ట్..?

**వాషింగ్టన్(జనంసాక్షి):** ఇంధన ఎగుమతులతో రష్యా ఆర్జిస్తోన్న ఆదాయాన్ని కట్టడిచేసేలా అమెరికా మరిన్ని ఆంక్షలకు సిద్ధమైంది ఆ ఆంక్షల బిల్లును పరిశీలించేందుకు సెనెట్ సభ్యులు అంగీకరించారు. అది చట్టరూపం దాల్చితే రష్యా చమురును దిగుమతి చేసుకుంటున్న భారత్ వంటి దేశాలపై టారిఫ్‌ల ఎఫెక్ట్ పడనుంది. ఈ ఆంక్షల బిల్లు ఆమోదానికి సెనెట్‌లో ప్రక్రియ ప్రారంభమైంది. దానిని పరిశీలించేందుకు 86-12 తేడాతో సభ్యులు అంగీకరించారు. సెనెట్‌తో పాటు ప్రతినిధుల సభలోనూ దీనికి ఆమోదం లభించాల్సి ఉంది. ఈ దశలు దాటిన తర్వాత అది చట్టరూపం దాల్చుతుంది. అదే జరిగితే.. భారత్, చైనా వంటి దేశాలు 100 శాతం టారిఫ్‌ను ఎదుర్కోవాల్సి ఉంటుంది. రష్యా చమురు, గ్యాస్ కొనుగోలు చేస్తోన్న దేశాల నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై ఈ టారిఫ్‌లను విధించే వెసులుబాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు లభించనుంది. 2022 నుంచి ఉక్రెయిన్-రష్యా మధ్య యుద్ధం నడుస్తోంది ఉక్రెయిన్‌కు ఐరోపా, అమెరికా నుంచి సహాయం అందుతున్నా.. రష్యాను సైనికంగా, ఆర్థికంగా దెబ్బతీయలేకపోయాయి. అందుకే ఇంధన ఎగుమతులతో పుతిన్ ప్రభుత్వం ఆర్జిస్తున్న ఆదాయాన్ని టార్గెట్ చేసేందుకు అమెరికా ప్రయత్నిస్తోంది.

**సౌతర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్**
6-1-50,కార్పొరేట్ ఆఫీస్, మింట్ కాంపౌండ్, హైదరాబాద్-500063

ఈ-టెండర్ షార్ట్ నోటీస్

టెండర్ నోటీస్ నం.03/2026-27 ఆఫ్ సీఈ/ప్రాజెక్ట్స్/ఎస్ఈ/సివిల్/కార్పొరేట్ ఆఫీస్/హైదరాబాద్ తేది:29/07.26

ఈ క్రింది పనులకు ఈ-టెండర్లను దిగువసంతకందారుచే ఆహ్వానించడమైనది. 1) టెండరు స్పెసిఫికేషన్ నం.07/2026-27-గద్వాల్ సర్కిల్‌లో బీచ్‌పల్లి వద్ద పీఎస్‌సీసీ పోల్‌సెంటర్‌ను స్థాపించుట. మిగతా వివరాలకు మరియు ఇతర నిబంధనలకు మరియు షరతుల కోసం www.tender.telangana.gov.in లో చూడగలరు. ఫోన్ నం: 8712468186,ఫ్యాక్స్ నం.23431006

DIPR No.6940-PP/CL/ADVT/2026-27

సం/- చీఫ్ ఇంజినీర్/ప్రాజెక్ట్స్/ టీజీఎస్‌పీడీసీఎల్

# విద్యార్థులపై పోలీస్ కాల్పులకు అనుమతెవరిచ్చారు?

సభ్యులు తీవ్ర అభ్యం తరం వ్యక్తం చేశారు. యువత ఆందోళనలను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. అయితే రోడ్లపైకి వచ్చిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జ్ చేసి హింసించారని రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులపై దా డికి కేంద్ర హోం మంత్రి అమిత్‌షానే అనుమతి ఇచ్చారని ఆరోపించారు. లోక్‌సభలో విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రా హుల్ గాంధీ వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. విద్యార్థుల ఆందోళనపై లోక్‌సభలో ప్రసంగించిన ఆయన.. ఆర్ఎస్ ఎస్, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సమయంలో ఆయన ఉపయోగించిన ఓ పదంపై తీవ్ర దుమారం రేగింది. రాహుల్ వ్యాఖ్యలపై భాజపా ఎంపీలు అభ్యంతరం వ్యక్తం చేశారు పబ్లిక్ ఎగ్జామినేషన్స్‌లో అక్రమాల నిరోధానికి చట్టాన్ని సవరిస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లుపై లోక్‌సభలో బుధవారం కూడా వాడీవేడి చర్చ కొనసాగించింది. ఈ చర్చలో భాగంగా రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ.. విద్యార్థుల ఆందోళన విషయంలో కేంద్రం తీరుపై విమర్శలు గుప్పించారు. యువత ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారు. వారి సెంటిమెంట్‌ను అన్ని పార్టీలు గౌరవించాయి. ఎన్నో ఆశలు, ఆకాంక్షలతో ఉన్న విద్యార్థులు పేపర్ లీక్ వంటి ఘటనలతో ఆందోళనకు గురయ్యారు. తీవ్ర వేదన తర్వాతే ఢిల్లీ వేదికగా నిరసనలు చేపట్టారు. శాంతియుత నిరసన చేస్తున్న వారిని రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారు. ఆందోళన చేసిన వారితో నేను మాట్లాడాను. వారు చెప్పిన మాటలు నన్ను కదిలించాయి. మూర్ఖులు ఎవరి మాటలు వినరని విద్యార్థులు నాతో చెప్పారు. ప్రభుత్వంలో ఉన్నవాళ్లు తమ ఆవేదనను పట్టించుకోవడం లేదని బాధపడ్డారని రాహుల్ వ్యాఖ్యానించారు. అయితే, రాహుల్ ప్రసంగంపై భాజపా ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలో అభ్యంతరకర మాటలు మాట్లాడుతున్నారని, విద్యార్థుల పేరు చెప్పి ఎంపీలను అవమానిస్తున్నారని మండిపడ్డారు. వాటిని రికార్డుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతో కేంద్రం, విపక్ష నేత మధ్య ఒకింత వాగ్వాదం నెలకొంది. దీంతో స్పీకర్ దాన్ని తొలగించారు. చదువు అనేది ప్రస్తుతం ఖరీదైన వ్యాపారంగా మారింది. విద్యార్థుల కోసం నేడు తల్లిదండ్రులు లక్షలు ఖర్చుపెడుతు న్నారు. కానీ, విద్యావ్యవస్థ క్రూరంగా మారింది. ప్రైవేటీకరణ విచ్చలవిడిగా జరుగుతోంది. ఇక, ఈ వ్యవస్థ నడిపిస్తోంది ఆర్ఎస్ఎస్. ధర్మేంద్ర ప్రధాన్ కేవలం సింబల్ మాత్రమే. విద్యార్థులకు అసలైన శత్రువు ఈ సంస్థే. ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లకే ప్రభుత్వంలో ప్రాధాన్యత ఉంటోంది. ఆఖరికీ వర్సిటీల్లోనూ ఆర్ఎస్ఎస్ నుంచి వచ్చిన వాళ్లనే వీసీలుగా నియమించారని రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలను కూడా అధికార సభ్యులు తీవ్రంగా ఖండించారు. అనంతరం విద్యార్థులపై పోలీసుల చర్యను ప్రస్తావిస్తూ రాహుల్ గాంధీ తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థులపై పెల్లెట్ గన్స్ ఎందుకు ప్రయోగించారని ప్రశ్నించారు. ఆందోళనకారులను అణచివేయాలంటూ కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదేశించారని ఆరోపించారు. సభకు రావడానికి హోంమంత్రికి ధైర్యం లేదంటూ విమర్శించారు. దీంతో సభలో మరోసారి గందరగోళం నెలకొంది. రాహుల్ గాంధీ ఇలాంటి ఆరోపణలు ఎలా చేస్తున్నారు? అమిత్ షా పేరును ప్రస్తావించేందుకు ఆయన వద్ద ఏం ఆధారాలున్నాయి? రాహుల్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని హోంమంత్రికి క్షమాపణలు చెప్పాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. ఇ కపోతే పేపర్ లీక్‌పై ఏం జరిగిందో తెలుసుకోవాలంటే బీజేపీ నేతలు, వారి పిల్లలను అడగాలంటూ వ్యాఖ్యానించారు. ఢిల్లీ వీధుల్లో జరిగింది నిరసన కాదని.. భావ వ్యక్తీకరణ అని పేర్కొన్నారు. విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేశారని తెలిపారు. విద్యార్థుల ఆందోళనను దేశ ప్రజలు అర్థం చేసుకున్నారని అన్నారు. విద్యార్థుల ఆందోళనను రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు గౌరవించాలని రాహుల్ పిలుపునిచ్చారు. తీవ్ర వేదన తర్వాతే విద్యార్థులు ఆందోళన చేశారని.. కానీ వారి నిరసనను కేంద్రం అర్థం చేసుకోలేదని విమర్శించారు. కేంద్రం మూర్ఖంగా వ్యవహరించిందన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులను రెచ్చగొట్టేలా పోలీసులు ప్రవర్తించారని మండిపడ్డారు. మూర్ఖులు ఎవరి మాటలు వినరని.. ప్రభుత్వంలో ఉన్నవారు తమ ఆవేదనను పట్టించుకోరని విద్యార్థులు చెప్పారన్నారు. వారి ఆవేదనను పట్టించుకోలేదనే విద్యార్థులు రోడ్లపైకి వచ్చారని వివరించారు. విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేసి, హింసించారని మండిపడ్డారు. పేపర్ లీక్ వార్తతో విద్యార్థులు తీవ్ర ఆవేదనకు గురయ్యారని.. వారి ఆవేదనను అర్థం చేసుకున్నందునే వారి పక్షాన మాట్లాడుతునట్లు రాహుల్ గాంధీ చెప్పుకొచ్చారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగాన్ని బీజేపీ ఎంపీలు అడ్డుకున్నారు. ఇడియట్స్ అనే పదాన్ని రాహుల్ వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహించారు. రాహుల్ తన భాషను మార్చుకోవాలని కిరణ్ రిజిజు అన్నారు. విద్యార్థుల పేరుతో అన్‌పార్లమెంటరీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. రాహుల్ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. దీంతో ప్రతిపక్ష నేత వ్యాఖ్యలను స్పీకర్ రికార్డుల నుంచి తొలగించారు. బీజేపీ ఎంపీల వ్యాఖ్యలపై రాహుల్ మాట్లాడుతూ.. 'నేను ఎంపీలను విమర్శించలేదు. బీజేపీ ఎంపీలు కావాలనే నా ప్రసంగాన్ని అడ్డుకుంటున్నారు. సభలో కేవలం బీజేపీ ఎంపీలే మాట్లాడాలనడం సరికాదు' అంటూ రాహుల్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వందేమాతరం బిల్లుకు రాజ్యసభ ఆమోదం

### అధికార పార్టీ తీరుకు నిరసనగా విపక్షాల వాకౌట్

**న్యూఢిల్లీ,జూలై29(జనంసాక్షి):** జాతీయ గేయం వందేమాతరంపై బిల్లు రాజ్యసభలో ఆమోదం పొందింది. ఈ బిల్లును కేంద్ర మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24న ప్రవేశపెట్టారు. వందేమాతరాన్ని అవమానించినా, ఆలపిస్తుండగా ఆటంకం కలిగించినా నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్-1971లో సవరణలు చేయాలని కేంద్రం ప్రతిపాదించింది. ప్రస్తుతం జాతీయ గీతమైన జనగణమనకు ఉన్న చట్టపరమైన రక్షణను వందేమాతరానికీ వర్తింపజేయడమే ఈ బిల్లు ప్రధాన ఉద్దేశం. బిల్లుపై సభలో చర్చ ప్రారంభం కాగానే ప్రతిపక్ష నేతలు భారీ ఎత్తున నినాదాలు చేశారు. ఇటీవల దిల్లీలో విద్యార్థులపై పోలీసులు బలప్రయోగం చేశారని... దీనిపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. చర్చలో పాల్గొనాలని సభ్యులను డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ పదే పదే కోరినప్పటికీ ఆందోళనలు విరమించలేదు. కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలె బిల్లుపై మాట్లాడుతున్న సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి వాకౌట్ చేశారు. వందేమాతరాన్ని అవమానించడాన్ని నేరంగా పరిగణించి, దోషులకు గరిష్ఠంగా మూడేళ్ల జైలు శిక్ష విధించేలా ఈ బిల్లులో నిబంధనలు రూపొందించారు.

# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

న్యూఢిల్లీ,జూలై29(జనంసాక్షి): వాడీవేడీ చర్చలు..విమర్శలు ప్రతివిమర్శలు, ఆక్షేపణల మధ్య పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. చర్చల అనంతరం బిల్లును మూజువాణి ఓటుతో సభ ఆమోదించింది. బిల్లులో మార్పులు చేయాలంటూ విపక్షాలు ప్రతిపాదించిన సవరణలను ప్రభుత్వం తిరస్కరించింది. పశ్నపత్రాల లీకేజీ, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ఈ బిల్లులో నిబంధనలు పొందుపరిచారు. దేశవ్యాప్తంగా పోటీ పరీక్షల నిర్వహణలో పారదర్శకత పెంచడం, అభ్యర్థుల ప్రయోజనాల ను కాపాడడమే బిల్లు లక్ష్యమని ప్రభుత్వం తెలిపింది. ఈ యాంటీ పేపర్ లీక్ బిల్లు ఆమోదం అనంతరం లోక్‌సభ సమావేశాలను స్పీకర్ ఓం బిర్లా గురువారానికి వాయిదా వేశారు. కాగా పేపర్ లీక్ కేసుల్లో దోషులకు పదేళ్ల వరకు జైలు శిక్ష, రూ.10 కోట్ల వరకు జరిమానా విధించేలా ఈ బిల్లును రూపొందించారు. ఇదివరకు 3-5 ఏళ్ల జైలు శిక్ష, రూ.10లక్షల వరకు జరిమానా ఉండేది. అదే వ్యవస్థీకృత నేరాల్లో అయితే 5-10 ఏళ్ల జైలు శిక్ష, రూ.కోటి వరకు జరిమానా ఉంది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు. యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. చర్చ మధ్యలో సంబంధం లేని అంశాలను ప్రస్తావిస్తూ.. అసలు విషయం నుంచి దృష్టిని మళ్లించడానికి ప్రయత్నిస్తున్నార న్నారు. విద్యార్థుల సంక్షేమం, భద్రత కోసమే ఈ బిల్లు తీసుకువచ్చినట్లు తెలిపారు. పరీక్షా విధానంపై ఏమైనా సూచనలు ఉంటే ఇవ్వాలని ప్రతిపక్షాలను కోరారు. సభలో మాట్లాడేటప్పుడు సభ్యతతో కూడిన భాషను ఉపయోగించాలని సూచించారు. రాహుల్, ప్రియాంక, అఖిలేశ్, గొగోయ్ తదితరులు బిల్లుపై మాట్లాడారు.



# రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు

సింగరేణివ్యాప్తంగా భూగర్భ గనుల ద్వారా 20 నుండి 30% బొగ్గు ఉత్పత్తి అవుతుంటే, ఓపెన్ కాస్ట్ గనుల ద్వారా 70 శాతం ఉత్పత్తి జరుగుతుంది. మంచిర్యాల జిల్లాలో మొత్తం ఆరు భూగర్భగనులు నాలుగు ఓపెన్ కాస్ట్ గనుల ద్వారా ప్రతినిత్యం 42,000 టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. బొగ్గు ఉత్పత్తిలో ఓపెన్ కాస్ట్ గనులు కీలక పాత్ర పోషిస్తాయి. అత్యధికంగా బొగ్గు ఉత్పత్తి జరగాలన్న సింగరేణివ్యాప్తంగా బొగ్గు ఉత్పత్తి ఎక్కువ శాతం ఓపెన్ కాస్ట్ గల పైనే ఆధారపడి ఉంటుంది. వర్షాకాలంలో పెడతెరిపిలేని వర్షాలు వారం రోజులు కురిసిన రెండు రోజులు కురిసిన వర్షాలు కురిసిన అన్ని రోజులు ఓపెన్ కాస్ట్ గనులలో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోతుంటుంది.

**32 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి విఘాతం**

బెల్లంపల్లి సింగరేణి రీజియన్‌లో శ్రీరాంపూర్, మందమర్రి, బెల్లంపల్లి డివిజన్లు ఉన్నాయి. బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓపెన్ కాస్ట్, డోర్లి ఓపెన్ కాస్ట్ గనుల ద్వారా ఇక్కడ ఉత్పత్తి జరుగుతుంది. ఖైరిగూడ ఓపెన్ కాస్ట్, డోర్లి ఓపెన్ కాస్ట్ ల ద్వారా ప్రతిరోజు 9 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి అవుతుంది. భారీ వర్షాలతో ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. శ్రీరాంపూర్ ఏరియాలో ఎస్ఆర్‌పి ఓపెన్ కాస్ట్ గని, అలాగే ఇందారం ఓపెన్ కాస్ట్ గనుల్లో సుమారు 22 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి వర్షాలతో అంతరాయం ఏర్పడింది. మందమర్రి ఏరియాలో కళ్యాణి ఖని ఓపెన్ కాస్ట్ గనిలో వర్షపు నీరు చేరడంతో భారీగా బొగ్గు ఉత్పత్తి అంతరాయం ఏర్పడింది.

**ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులకు అంతరాయం**

మందమర్రి ఏరియాలోని కేకే ఓపెన్‌కాస్ట్ (కేకే ఓసీ) ప్రాజెక్టులో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా దెబ్బతింది. గనిలో భారీగా వర్షపు నీరు చేరడంతో బొగ్గు తవ్వకం, ఓవర్‌బర్డెన్ (మట్టి) తొలగింపు పనులు నిలిచిపోవడంతో సింగరేణి సంస్థకు గణనీయమైన ఉత్పత్తి నష్టం వాటిల్లింది. ప్రాజెక్టు అధికారి రాంబాబు తెలిపిన వివరాల ప్రకారం, ఒక్కరోజులోనే సుమారు 4,100 టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. అలాగే 50 వేల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ తొలగింపు పనులు కూడా పూర్తిగా ఆగిపోయాయి. దీంతో నిర్ణయించిన ఉత్పత్తి లక్ష్యాలపై ప్రతికూల ప్రభావం పడిందని తెలిపారు. భూపాలపల్లి జిల్లా మల్హర్ రావు మండల పరిధిలోని తాడిచర్ల జెన్కో ఓపెన్ కాస్ట్-1 గనిలో బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. మైన్ పరిధిలోకి భారీగా వర్షపు నీరు వచ్చి చేరడంతో ఓపెన్ కాస్ట్ ఉపరితల గనిలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ వర్షాల వల్ల గని నుండి తీయాల్సిన దాదాపు 18,000 టన్నుల బొగ్గు ఉత్పత్తితో పాటు, 2,40,000 క్యూబిక్ మీటర్ల ఊబి ఓవర్ బర్డెన్ - ఓబీ తొలగింపు పనులకు తీవ్ర ఆటంకం కలిగిందని కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, కేఎస్ఎన్ మూర్తి, మైన్ మేనేజర్ శ్రీనివాస్ సంయుక్తంగా తెలియజేశారు.

# ఉదయ్‌కృష్ణారెడ్డి లైంగిక వేధింపులకు ఆధారాలున్నాయి




**హైదరాబాద్(జనంసాక్షి):** లైంగిక వేధింపుల కేసులో ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ పోలీసులు ఓ ప్రకటన విడుదల చేశారు. అందులో కేసు నేపథ్యాన్ని సీపీ సజ్జనర్ వివరించారు. "నిందితుడు, ట్రైనీ ఐపీఎస్ ఉదయ్‌కృష్ణారెడ్డి గతంలో పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేశాడు. అనంతరం యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి 2025 బ్యాచ్ ఐపీఎస్ అధికారిగా ఎంపికయ్యాడు. 2025 డిసెంబర్ నుంచి శివరాంపల్లిలోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ (ఎస్‌వీపీ ఎన్‌పీఏ)లో శిక్షణ పొందుతున్నాడు. అదే ఏడాది మధ్యలో ఇన్‌స్టాగ్రామ్ ద్వారా నిందితుడికి బాధితురాలితో పరిచయం ఏర్పడింది. తన విజయ ప్రయాణంపై నిందితుడు చేసిన పోస్టుకు ఆమె స్పందించడంతో వీరి పరిచయం ప్రారంభమైంది. తాను కూడా 2024 బ్యాచ్ ఐపీఎస్‌కు ఎంపికయ్యానని.. ఎక్స్‌ట్రా ఆర్డినరీ లీవ్‌లో ఉండటంతో 2025 బ్యాచ్‌తో కలిసి శిక్షణలో చేరనున్నట్లు బాధితురాలు తెలిపింది. అనంతరం ఇద్దరూ స్నేహితులయ్యారు. ఈ పరిచయం ప్రేమగా మారింది. ఎన్‌పీఏలో శిక్షణ పొందుతున్న సమయంలో వీరి సంబంధం మరింత బలపడింది. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్యా మనస్పర్థలు వచ్చాయి. నిందితుడు పలుమార్లు ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించాడు. బాధితురాలి ల్యాప్‌టాప్‌ను విసిరి ధ్వంసం చేశాడు. ఆమె తనను బ్లాక్ చేసిన తర్వాత నకిలీ సోషల్ మీడియా ఖాతాలు సృష్టించాడు. వ్యక్తిగత చాట్‌లను బహిర్గతం చేస్తానని బెదిరించాడు. బాధితురాలి అనుమతి లేకుండా కుటుంబ సభ్యులు, సహచరులను సంప్రదించాడు. వేధింపులు పెరగడంతో బాధితురాలు అతడి నుంచి దూరంగా ఉంది. అనంతరం మరో వ్యక్తిని వివాహం చేసుకుంది. అయినా ఉదయ్ కృష్ణారెడ్డి వేధింపులు ఆగలేదు. కేసు దర్యాప్తులో ఉదయ్ కృష్ణారెడ్డి నేరానికి పాల్పడినట్లు ప్రాథమిక ఆధారాలు లభించాయి. చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా నిందితుడిని అరెస్ట్ చేసి ఉప్పరపల్లి కోర్టులో హాజరుపరిచాం. ఈ కేసుకు సంబంధించిన అన్ని అంశాలపై మరింత లోతుగా దర్యాప్తు కొనసాగుతోంది. చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుంటాం. మహిళా భద్రతా విభాగం డీసీపీ లావణ్య నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం కేసును దర్యాప్తు చేస్తోంది" అని సజ్జనర్ పేర్కొన్నారు.

ట్రైనీ ఐపిఎస్‌కు 14రోజుల రిమాండ్

ఉదయ్‌కృష్ణారెడ్డిని పోలీసులు మిర్యాలగూడలో మంగళవారం అదుపులోకి తీసుకుని ఉమెన్ సేఫ్టీ వింగ్‌కు అప్పగించారు. ఉదయ్ కృష్ణారెడ్డికి కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. ఉదయ్‌కృష్ణారెడ్డిని బుధవారం ఉప్పర్‌పల్లి కోర్టులో హాజరపరుచగా.. న్యాయమూర్తి అతడికి ఆగస్టు 11 వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు ఉదయ్ కృష్ణారెడ్డిని పోలీసులు భారీ భద్రత మధ్య చంచల్ గూడ జైలుకు తరలించారు. మహిళా ట్రైనీ ఐపీఎస్‌పై ఉదయ్‌కృష్ణారెడ్డి దాడి చేసినట్టు వైద్యపరీక్షల్లో నిర్దారణ అయినట్టు తెలిసింది. కేసు నమోదైన జూలై 18న బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు ఆమెపై భౌతికంగా దాడి జరిగినట్టు తేల్చారు. బాధితురాలి గొంతు నులిమినట్టు గాయాల ఆనవాళ్లు, చెంప భాగంలో కొట్టిన కమిలిన గాయా లు, ఎడమ కాలిపైనా గాయం ఉన్నట్టు సమాచారం. నేషనల్ పోలీస్ అకాడమిలో తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారిణి ఇచ్చిన ఫిర్యాదుతో నమోదు అయిన ఎఫ్ఐఆర్ లో దిగ్భ్రాంతికర అంశాలు వెలుగులోకి వచ్చాయి. బాధితురాలు అందించిన వివరాల ప్రకారం నిందితుడు ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెపై మానసికంగా, శారీరకంగా తీవ్ర స్థాయిలో వేధింపులకు పాల్పడినట్లు తెలుస్తోంది. బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్న దాని ప్రకారం ఉదయ్ కృష్ణారెడ్డి ఆమెను వాట్సాప్ ద్వారా లైంగికంగా వేధించడమే కాకుండా, వారిద్దరి మధ్య రిలేషన్ షిప్ ఉందంటూ తోటి ట్రైనీ ఐపీఎస్ అధికారుల వద్ద అసత్య ప్రచారాలు చేశాడు. అంతటితో ఆగకుండా, మరో ట్రైనీ అధికారితో ఆమెకు అక్రమ సంబంధం ఉందంటూ నిరాధారమైన ఆరోప ణలు చేస్తూ అవమానించాడు. బాధితురాలిని అత్యంత అసభ్యకరమైన పదాలతో దూషిస్తూ మానసిక క్షోభకు గురిచేసినట్లు సమాచారం. బాధితురాలికి తెలియకుండానే ఆమె వ్యక్తిగత వీడియోలను రికార్డు చేసిన ఉదయ్, వాటి ఆధారంగా ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడానికి యత్నించాడని బాధితురాలు పేర్కొంది. ఆ వీడియోలను ఆమె భర్తకు పంపించి తీవ్ర మనోవేదన కలిగించాడు. అంతేకాకుండా ఆమె మొబైల్ ఫోన్‌ను బలవంతంగా తన గదికి తీసుకెళ్లి, పాస్‌వర్డ్ చెప్పాలంటూ బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు తెలిపింది. అదే సమయంలో ఆమెను అసభ్యకరం గా తాకుతూ, తీవ్రంగా వేధించినట్లు ఫిర్యాదులో నమోదైంది. ఈ నెల 9వ తేదీ రాత్రి బాధితురాలిని బలవంతంగా తన గదికి తీసుకెళ్లి బంధించిన ఉదయ్ కృష్ణారెడ్డి, ఆమె జుట్టు పట్టుకుని లాగి, గొంతు నులిమేందుకు ప్రయత్నించాడు. గది నుంచి బయటకు వెళ్లకుండా మెడపై కత్తి పెట్టి భయభ్రాంతులకు గురిచేశాడు. ఆమెను అవమానించే ఉద్దేశంతో మూడు కండోమ్ ప్యాకెట్లను ఆమెపైకి విసిరాడు. అనంతరం ఈ నెల 10వ తేదీ ఉదయం కూడా ఆమెపై తీవ్రంగా శారీరక దాడికి పాల్పడ్డాడు. అకాడమిలో ఇతరుల సమక్షంలోనూ అసభ్యకరంగా మాట్లాడి ఆమె పరువుకు భంగం కలిగించాడని బాధితురాలు తెలిపింది.

# గల్ఫ్ దేశాల్లో భారతీయుల భద్రతే అత్యంత ప్రాధాన్యం

### భారత్

న్యూయార్క్(జనంసాక్షి): పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులను ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో తీవ్రంగా ఖండించింది. హింసాత్మక ఘటనలు వెంటనే నిలిపివేసి, అంతర్జాతీయ జలమార్గాల్లో స్వేచ్ఛాయుత నౌకాయానాన్ని పునరుద్ధరించాలని స్పష్టం చేసింది. పశ్చిమాసియాలో శాంతి సాధించేందుకు దౌత్య మార్గమే సరైనదని భారత్ పునరుద్ఘాటించింది. ఐరాస భద్రతా మండలిలో భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ మాట్లాడుతూ.. ఈ నెల హర్మూజ్ లో జీఎఫ్ఎస్ గెలాక్సీ, ఎంటీ ఏఐ బహియాహ్, ఎంటీ మొంబాసా నౌకలపై దాడులు జరిగాయన్నారు. ఈ దాడుల్లో పలువురు భారతీయులు గాయపడగా, ఒకరు ప్రాణాలు కోల్పోయారన్నారు. మరో వ్యక్తి గల్లంతయ్యాడని ఆందోళన వ్యక్తం చేశారు. వాణిజ్య నౌకలు, పౌర మౌలిక వసతులపై దాడులు తక్షణమే ఆగాలన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న భారతీ యుల భద్రత తమకు అత్యంత ప్రాధాన్య అంశమన్నా రు. హూతీలు సముద్ర రవాణాపై కొనసాగిస్తున్న దా డులను తీవ్రంగా ఖండించారు. బాబ్ ఎల్-మాండెబ్ జ లసంధి, దక్షిణ ఎర్ర సముద్ర ప్రాంతంలో నౌకాయా నాన్ని కాపాడటం ప్రపంచ దేశాల ఉమ్మడి బాధ్యత అని పేర్కొన్నారు.



# ఉరకలేస్తున్న జలపాతాలు

**ప్రకృతి అందాలకు ముగ్ధులవుతున్న పర్యాటకులు**





**నెరడిగొండ జులై28(జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో అత్యంత ఎత్తైన జలపాతంగా పేరుగాంచిన కుంటాల జలపాతం, సుందర ప్రకృతి అందాలకు ప్రతీకగా నిలిచిన పొచ్చేర, కొర్దికల్ జలపాతాలు రెండు రోజులుగా కురుస్తున్న విస్తార వర్షాలతో జలకళను సంతరించు కున్నాయి. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగులు,వంకలు పొంగిపొర్లుతూ జలపాతాల వద్ద భారీగా నీటి ప్రవాహం కొనసాగుతోంది.ఎత్తైన కొండలపై నుంచి పాలనురుగులా తెల్లగా కిందకు దూకుతున్న జలధారలు, చుట్టూ అలుముకున్న పచ్చని అడవులు, ప్రకృతి ఒడిలో విరాజిల్లుతున్న సోయగాలు పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. వర్షాకాలం అందాలను ఆస్వాదించేందుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాలతో పాటు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. జలపాతాల వద్ద ప్రకృతి అందాలను తమ కెమెరాల్లో బంధించుకుంటూ, సెల్ఫీలు దిగుతూ సందర్శకులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరూ కుటుంబ సమేతంగా ప్రకృతి ఒడిలో ఆహ్లాదకర క్షణాలను ఆస్వాదిస్తున్నారు.అయితే జలపాతాల వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్న నేపథ్యంలో పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని, భద్రతా సూచనలు పాటిస్తూ ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. వర్షాకాలంలో కుంటాల,పొచ్చేర,కొర్దికల్ జలపాతాలు మళ్లీ తమ సహజ సౌందర్యాన్ని చాటుకుంటూ పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి.

# బీజేపీ ప్రాపకం కోసం కేటీఆర్ పాట్లు

- ఢిల్లీ పర్యటన మతలబు ముమ్మాటికీ అదే
- ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపణ



**హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) :** కేంద్ర మంత్రులను కలుస్తున్నాననే పేరుతో బీజేపీతో కెటిఆర్ రాయబారం నడుపుతున్నట్లు కనిపిస్తోందని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ ఆరోపించారు. కెటిఆర్ ఢిల్లీ పర్యటనపై వెంకట్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కేటీఆర్‌కు ఢిల్లీలో అసలేం పనుందని ప్రశ్నించిన ఆయన.. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీల మధ్య పొత్తు కోసమే ఢిల్లీలో చర్చలు జరుగుతున్నాయని, వచ్చే ఎన్నికల్లో రెండు పార్టీలు కలిసి పోటీ చేసే అవకాశాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు. అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీ అపాయింట్మెంట్ దొరక్కపోవడంతో తెలంగాణ అంశాల పేరుతో కేంద్ర మంత్రులను కలుస్తున్నట్లు కేటీఆర్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. కెటీఆర్ పార్టీ మనుగడ కోసమే ఢిల్లీ వీధుల్లో తిరుగుతున్నారని వెంకట్ అన్నారు. కేసీఆర్ కోసం ఫామ్‌హౌస్‌లో డమ్మీ అసెంబ్లీ పెట్టే పరిస్థితి వస్తుందేమోనని ఎద్దేవా చేశారు. ఉదయం కేంద్ర మంత్రులను కలుస్తున్నానని చెప్పే కేటీఆర్.. రాత్రివేళ ఎవరిని కలుస్తున్నారో తమకు తెలుసని వ్యాఖ్యానించారు. బీఆర్‌ఎస్ ఇప్పుడు ముగిసిన అధ్యాయమని, ప్రజలను తప్పుదోవ పట్టించే రాజకీయాలనే ఆ పార్టీ కొనసాగిస్తోందని విమర్శించారు. కేసీఆర్ నుంచే పచ్చి అబద్దాలు చెప్పే రాజకీయ సంస్కృతి బీఆర్‌ఎస్‌కు వచ్చిందని ఆరోపించారు. హైడ్రాపై చేస్తున్న విమర్శలను కూడా బల్మూరి వెంకట్ ఖండించారు. బఫర్ జోన్‌లో భూములు ఉంటే ఫిర్యాదు చేయాల్సిందేనని, హైడ్రాను కోర్టు తప్పుపట్టలేదని, కేవలం కమిషనర్ కోర్టుకు హాజరుకాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసిందని స్పష్టం చేశారు. హైడ్రా ఇప్పటికే వేల ఎకరాల ప్రభుత్వ భూములను, వేల కోట్ల విలువైన ఆస్తులను కాపాడిందని తెలిపారు. ఢిల్లీలో జరిగిన కీలక పరిణామాలపై కేటీఆర్ స్పందించకుండా సంగ్రామ సభల పేరుతో అసలు సమస్యలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యేలకు గత ప్రభుత్వంలో భద్రత కల్పించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ అవసరమైన భద్రత కల్పిస్తోందని, పెద్ది సుదర్శన్ రెడ్డి కోసం సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక గ్రీన్ ఛానల్ కూడా ఏర్పాటుచేశారని పేర్కొన్నారు.

# పులుల సంరక్షణ మన బాధ్యత

- భూమ్మీద జీవించే హక్కు సమస్త జీవరాశులది
- అంతర్జాతీయ పులుల దినోత్సవ కార్యక్రమంలో మంత్రి సురేఖ



**హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) :** పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. ఈ భూమి కేవలం మనుషుల ఆవాసం మాత్రమే కాదని, సమస్త జీవరాశుల ఉమ్మడి నివాసం అని గుర్తించి ప్రకృతి పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో ముందుకు రావాలని కోరారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించు కుని మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమిలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను మంత్రి పరిశీలించారు. పులుల సంరక్షణకు సంబంధించిన లఘు చిత్రాన్ని మంత్రి వీక్షించారు. కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్ కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్ లర్ దండా రాజిరెడ్డి, పిసిసిఎఫ్ (డెవలప్ మెంట్) రత్నాకర్ జౌహరి, సిసిఎఫ్ టిజిఎస్ఎఫ్ఎ డైరెక్టర్ ప్రియాంక వర్గీస్, సిసిఎఫ్ ఎన్ క్షితిజ, టైగర్ సెల్ రీసర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం పలువురు అటవీశాఖ అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ సభను ఉద్దేశించి ప్రసంగించారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులిని పరిరక్షించడమంటే అడవిని, పర్యావరణాన్ని, జీవవైవిధ్యాన్ని, భావితరాల భవిష్యత్తును పరిరక్షించడమేనని అన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో వాటి సంఖ్య తీవ్రంగా తగ్గిపోయిందని మంత్రి సురేఖ ఆవేదన వ్యక్తం చేశారు.

## అంబర్‌పేట మహంకాళి బోనాలు ఉత్సవాలకు విస్తృత ఏర్పాట్లు చేయండి

- ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు

**హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) :** అంబర్‌పేట్ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల ఏర్పాట్లపై ప్రభుత్వ సలహాదారు వి. హనుమంత రావు బుధవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆగస్టు 9న అంబర్ పేట్ మహంకాళి ఆలయంలో అమ్మవారి బోనాలు జరగనున్నందున ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా జిహెచ్ఎంసి, ట్రాన్స్ కో, పోలీస్, జలమండలి, వైద్యారోగ్యశాఖ, కల్చరల్ డిపార్ట్ మెంట్ లు సమన్వయంతో విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ బోనాలకు అధికసంఖ్యలో భక్తులు పాల్గొంటున్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ బోనాల ఉత్సవాలను తెలంగాణ ప్రజలు అత్యంత వైభవోపేతంగా జరుపుకుంటారని, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు జరుగుతున్నాయని అన్నారు. హైదరా బాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

# గురుపౌర్ణమిన కొండగట్టు గిరిప్రదక్షిణ

- రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం ప్రత్యేక పూజలు
- లోక కళ్యాణం కోసం ప్రత్యేక పూజలు : మంత్రి పొన్నం ప్రభాకర్
- కొండగట్టు క్షేత్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ : మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్
- సకలజనుల సంక్షేమమే లక్ష్యంగా కొండగట్టు గిరిప్రదక్షిణ : ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



**కరీంనగర్ బ్యూరో / కొండగట్టు, జూలై 29 (జనం సాక్షి) :** ప్రజా సంక్షేమం కోసం వర్షాలు సమృద్ధిగా పడాలని, రైతులందరూ సుభిక్షంగా ఉండాలని బుధవారం రోజు గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో కొండగట్టు గిరిప్రదక్షిణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజురాబాద్ కాంగ్రెస్ ఇంచార్జ్ ఒడితల ప్రణవ్ బాబు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు వైద్యుల అంజన కుమార్ లతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, అంజన్న భక్తులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాన్ని కూడా లెక్కచేయకుండా కాంగ్రెస్ నేతలు, భక్తులు కొండగట్టు గిరిప్రదక్షిణను పూర్తి చేసి, అనంతరం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోరుతూ రాష్ట్రంలోని అన్ని ప్రముఖ దేవాలయాలు ప్రత్యేక పూజలు నిర్వహించడం జరుగుతుందని, "ఎల్-నినో వైపరీత్యం ప్రభావంతో రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో గతంలో హైదరాబాద్ లాల్ దర్వాజా అమ్మవారు, వేములవాడ రాజన్న ఆలయం, కొండగట్టు అంజన్న ఆలయం ఇలా ఏ పుణ్యక్షేత్రంలో అయినా ఇలాంటి విపత్తుల సమయంలో ప్రజలు నమ్ముకున్న దేవుళ్ళు వారిని రక్షించారు. 43వ సారి పౌర్ణమి రోజున జరుగుతున్న ఈ గిరి ప్రదక్షిణ సందర్భంగా వర్షాలు కురవాలని, పంటలు సుభిక్షంగా పండాలని, ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని లోక కళ్యాణం కోసమే కొండగట్టు అంజన్నను ప్రార్థించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నందుకు సంతోషంగా ఉందని జిల్లా అభివృద్ధి కోసం మేమంతా ఎప్పుడు కలిసే పని చేస్తామని ఇది ఏ పార్టీకి, ఏ వర్గానికి సంబంధించిన కార్యక్రమం కాదని, సకలజనుల సంక్షేమం కోసం చేస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమం అని అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని, కొండగట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ... "రైతుల కష్టాలు తీరాలని, రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖంగా ఉండాలని ఆధ్యాత్మిక భావనతో ఈ గిరిప్రదక్షిణ చేపట్టామని, కొండగట్టు అంజన్న ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరుకుంటున్నానని, భారీ వర్షంలోనూ పాల్గొన్న ప్రతి భక్తుడికి, కార్యకర్తకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున జిల్లాకు చెందిన కాంగ్రెస్ పార్టీ మండల కాంగ్రెస్ అధ్యక్షులు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సహకార సంఘాల చైర్మన్లు, మార్కెట్ కమిటీ చైర్మన్ లు, పాలకవర్గ సభ్యులు, ప్రజా ప్రతినిధులు ఇతర ముఖ్య నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తల్లిదండ్రుల చెంతకు చేరిన కిడ్నాప్‌నకు గురైన చిన్నారి

- 6 గంటల్లో కిడ్నాప్ కేసును ఛేదించి సురక్షితంగా రక్షించిన జిల్లా పోలీసులు
- కిడ్నాప్ చేసిన మహిళ, అక్రమంగా తన వద్ద చిన్నారిని ఉంచుకున్న మహిళ, ఇద్దరి అరెస్ట్



**మావల జూలై 30(జనం సాక్షి):** కిడ్నాప్ కు గురి అయిన బాలికను సురక్షితంగా తల్లి దండ్రులకు అప్పగించినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు.మంగళవారం ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం రూయ్యడి గ్రామానికి చెందిన నాలుగు సంవత్సరాల చిన్నారి ఆత్రం గంగామణి కిడ్నాప్‌కు గురైంది.జిల్లా పోలీసులు ఈ కేసు ఛాలెంజ్ తీసుకొని గంటల్లో చేధించారు.ఈ ఘటనలో జిల్లా పోలీసులు తక్షణమే స్పందించి 6 గంటల్లోనే చిన్నారిని సురక్షితంగా గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 28వ తేదీన రూయ్యడి గ్రామానికి చెందిన నిందితురాలు లినైతం నాగుబాయిలి చిన్నారిని కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆదిలాబాద్ పట్టణానికి తీసుకువచ్చి బస్టాండ్ ప్రాంతంలో తనకు తెలిసిన లిభారతిలి అనే మహిళ నిందితురాలికి అప్పగించింది. బాధితురాలి తల్లి ఆత్రం కప్లిబాయి తలమడుగు పోలీస్ స్టేషన్‌లో సాయంత్రం 5 గంటలకు ఫిర్యాదు చేయడంతో నిందితురాలిపై కిడ్నాప్ కేసు నమోదు చేసి వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. మంగళవారం రాత్రి 11 గంటలకు ఆదిలాబాద్ పట్టణంలోని మహాలక్ష్మి వాడ నందు చిన్నారి ఉన్నట్లు గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బుధవారం ఉదయం స్థానిక పోలీస్ ముఖ్య కార్యాలయంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ చిన్నారిని ఆమె తల్లిదండ్రులైనా ఆత్రం జంగు, ఆత్రం కప్లీ బాయిలకు అప్పగించారు. తప్పిపోయిన తమ కుమార్తె తిరిగి క్షేమంగా లభించడంతో చిన్నారి తల్లిదండ్రులు భావోద్వేగానికి గురై జిల్లా ఎస్పీతో పాటు గాలింపు చర్యల్లో పాల్గొన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, చిన్నారుల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని, పిల్లలు కనిపించకపోయినా లేదా అనుమానాస్పద పరిస్థితులు గమనించినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని ప్రజలకు సూచించారు. కిడ్నాప్ చేసిన మహిళ నిందితురాలు నైతం నాగుబాయి, చట్ట వ్యతిరేకంగా తన వద్ద బాలికను ఉంచుకున్న గుమ్మడి వార్ భారతి (25) మహిళను అరెస్టు చేసినట్లు తెలిపారు. గతంలో ఈ మహిళ భారతిపై వ్యక్తిపై దాడి చేసిన కేసు, తన కుమార్తెను రిమ్స్ నందు వదిలిపెట్టిన ఘటనలు నమోదైనట్లు తెలిపారు. బాలికను రక్షించడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ రహీం పాషా మరియు ఎస్ఐలు రాధిక, విష్ణువర్ధన్, సిబ్బంది లాలు, మనోజ్, శ్రీనివాస్, సాగర్, సంతోష్, మౌనిక, గంగారం, నరేష్, శివకృష్ణ, ప్రతాప్, లను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి, తలమడుగు ఎస్ఐ రాధిక, బాలిక తల్లిదండ్రులు, గ్రామ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# టఫ్ ఆత్మీయుల సమ్మేళనం విజయవంతం

**తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ అమలుపరచాలని డిమాండ్**





**హైదరాబాద్ (జనంసాక్షి) :** హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టఫ్ ఆత్మీయ సమ్మేళనం జరిగింది. 1996 నుండి మొదలైన మలిదశ తెలంగాణ ఉద్యమానికి కొనసాగింపే తెలంగాణ యునైటెడ్ ఫ్రంట్ ఉద్యమమని ఆత్మీయ సమ్మేళనం ముక్తకంఠంతో స్పష్టం చేసింది. టఫ్ ఉపాధ్యక్షులు మన్నారం నాగరాజు ఆహ్వానంతో టి. హనుమండ్లు,విమలక్క కపిలవాయి దిలీప్ కుమార్ కట్టా భగవంతు రెడ్డి,సోహరా బేగం అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ముందుగా అమరులకు మౌనం పాటించి సమావేశం ప్రారంభమయ్యింది. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించే కమిటీకి చట్టబద్ధత కల్పించాలని ఉద్యమ సంస్థల నుండి వచ్చే రిపోర్టును కూడా గుర్తింపుకు ప్రాతిపాదిక చేర్చుకోవాలని సమ్మేళనం అభిప్రాయపడింది. ఈ మేరకు సమ్మేళనానికి 20 అంశాలతో కూడిన ప్రతిపాదనలు కొన్ని సవరణలతో సమ్మేళనం ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ ప్రపోజల్ జులై 30 2026న కేకే కమిటీకి అందించాలని సమ్మేళనం తీర్మానించింది. ఈ సమావేశంలో తెలంగాణ ఉమ్మడి జిల్లాల నుండి 300 మంది ప్రతినిధులు హాజరయ్యారు. టఫ్ మాజీ స్పోక్ పర్సన్ గ్రంథాలయ పరిషత్ అధ్యక్షులు రియాజ్ టఫ్ మాజీ నాయకులు ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్ చింతమల్ల గురూజీ (నల్లగొండ), కొల్లాపురం విమల(పాలమూరు), షాబాద్ అలీఖాన్ (హైదరాబాద్), ఎనిశెట్టి శంకర్ (నిజామాబాద్), బొల్లం లింగమూర్తి (కరీంనగర్), బొమ్మ కంటి కొమురయ్య (సూర్యాపేట), శ్రీనివాస్ (వికారాబాద్), శేషగిరిరావు (ఖమ్మం), రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెల్తురు సదానందం రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగిరెడ్డి మేకల రాములు (మెదక్), నలిగంటి పాల్ (వరంగల్), ఆత్రం సాయుధ (అదిలాబాద్), 1969 ఉద్యమకారుడు ప్రభాకర్ ఆడబిడ్డల వేదిక నాయకురాళ్లు వెలుగు వనిత అరుణోదయ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్సూర్ పోతుల రమేష్, ఏఐఎఫ్ టీ యు రాష్ట్ర అధ్యక్షులు వై మల్లేష్, ఐ ఎఫ్ టి యు రాష్ట్ర నాయకులు శివ బాబు తదితరులు పెద్ద ఎత్తున హాజరైనారు.

## బ్యాక్‌లాగ్ ఉన్న వారి కోసం మరో అవకాశం

- కాకతీయ వర్సిటీ రిజస్ట్రార్ ప్రకటన

**హనుమకొండ, జూలై29 (జనంసాక్షి) :** కాకతీయ యూనివర్సిటీ పరిధిలో నిర్ణీత కాలవ్యవధిలో కోర్సు పూర్తి చేయలేక బ్యాక్‌లాగ్‌లు మిగిలిన యూజీ, పీజీ పూర్వ విద్యార్థులకు 2026-2027 విద్యాసం వత్సరానికి చివరి అవకాశం కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. అర్హులైన విద్యార్థులు థియరీ, ప్రాక్టికల్, ప్రాజెక్ట్ వర్క్, సెమినార్ పరీక్షలకు దరఖాస్తు చేసుకుని తమ కోర్సును పూర్తి చేసుకోవచ్చన్నారు. ఇందుకోసం రిజిస్ట్రార్ అనుమతితో పాటు నిర్దేశిత రుసుములు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. యూజీ, పీజీ విద్యార్థులు ప్రస్తుత బ్యాచ్‌లతో కలిసి పరీక్షలు రాయవచ్చని, పీజీ విద్యార్థులు అవసరమైతే ఎస్డీఎల్సీఈ పరీక్షలతో పాటు ప్రత్యేక అనుమతి పొంది నిర్ణీత రుసుం చెల్లించి పరీక్షలకు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన పూర్వవిద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం వెబ్‌సైట్ ను సందర్శించవచ్చని తెలిపారు.

## హైడ్రా ముసుగులో పేదల ఇళ్లు కూల్చివేత

- ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శలు

**హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) :** హైడ్రా కమిషనర్‌గా రంగనాథ్‌ను తీసివేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి విమర్శించారు. హైడ్రాకు అందమైన భాష్యం చెప్పి తమ ఇష్టాలకు అనుగుణంగా వాడుకుంటూ పెద్దల భూములు రక్షించుకుంటూ.. పేదల ఇండ్లు కూలగొడుతూ ఎంతో మందిని రోడ్డున పడేశారని అన్నారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఆయన మీడియాకు ఈ విషయాలు వెల్లడించారు. ప్రజలను మభ్యపెట్టడం కోసమే లక్షల కోట్ల రూపాయల ఆస్తులు కాపాడినట్లు రంగనాథ్ అబద్ధాలు చెబుతున్నారని అన్నారు. దుర్గంచెరువు వద్ద ఉన్న నెక్టార్ గార్డెన్, ఫాతిమా కాలేజ్ లాంటి వాటి జోలికి హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని మండిపడ్డారు. హిమాయత్ సాగర్, గండిపేట ఎఫ్‌టీఎల్‌లో ఉన్న ఇండ్ల వద్దకు హైడ్రా ఎందుకు వెళ్లడం లేదని, కోర్టును తప్పుదోవ పట్టించారని విమర్శించారు. రంగనాథ్ వ్యాఖ్యలను కోర్టు ధిక్కరణ కింద సుమోటోగా స్వీకరించాలని కోరారు. హైదరా బాద్‌లో రియల్ ఎస్టేట్ పడిపోవడానికి హైడ్రా కూడా ఒక కారణం అని పేర్కొన్నారు.

# గణనీయంగా చెరకు విస్తీర్ణం పెంపు

- ఉత్పాదక సామర్థ్యం మెరుగు పర్చాలి
- చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ కమిటీతో సిఎస్ చర్చలు



**హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) :** రాష్ట్రంలో చెరకు పంట విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచడంతో పాటు చక్కెర పరిశ్రమల పునరుద్ధరణ, వాటి ఉత్పాదక సామర్థ్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో షుగర్ పరిశ్రమల పునరుద్ధరణ, చెరకు పంట విస్తీర్ణం పెంపు కోసం ప్రభుత్వం జారీ చేసిన జి.ఓ. నెం. 86 ప్రకారం ఏర్పాటు చేసిన కమిటీ సమావేశం గురువారం సచివాలయం లో ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, చెరకు రైతు ప్రతినిధులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో మొత్తం 12 చక్కెర కర్మాగారాలు ఉండగా ప్రస్తుతం 7 కర్మాగారాలు మాత్రమే పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రస్తుతం పనిచేస్తున్న పరిశ్రమలు పూర్తి సామర్థ్యంతో పనిచేయాలంటే ఏటా సుమారు 50 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు అవసరమవుతుందని, ప్రస్తుతం రాష్ట్రంలో కేవలం 20 లక్షల మెట్రిక్ టన్నుల చెరకు మాత్రమే ఉత్పత్తి అవుతోందని వివరించారు. ఠి పంటతో పోలిస్తే చెరకు సాగుకు తక్కువ నీరు అవసరమవుతుందని, డ్రిప్ ఇరిగేషన్ వంటి ఆధునిక సాగు పద్ధతులను అవలంబిస్తే దిగుబడులు పెరగడంతో పాటు సాగు వ్యయం కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. 2026?27 వ్యవసాయ సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా 19 వేల మంది రైతులు 26 వేల హెక్టార్లలో చెరకు సాగు చేస్తున్నట్లు తెలిపారు. చెరకు సాగు విస్తీర్ణాన్ని పెంచేందుకు, చక్కెర పరిశ్రమలకు అవసరమైన ముడి చెరకు లభ్యతను మెరుగుపరచేందుకు ఇతర రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ప్రోత్సాహకాలు, విధానాలను సమగ్రంగా అధ్యయనం చేసి నివేదికను తక్షణమే సమర్పించాలని అధికారులను ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.మావేశంలో రైతు ప్రతినిధులు మాట్లాడుతూ, చెరకు రైతులకు కూడా వరి రైతులకు అందిస్తున్న తరహాలో టన్నుకు రూ.500 ప్రోత్సాహకం అందించాలని కోరారు. చెరకు సాగులో అధిక పెట్టుబడి, వ్యవసాయ కూలీల కొరత రైతులకు ప్రధాన సవాళ్లుగా మారాయని వివరించారు. చెరకు ద్వారా చక్కెరతో పాటు ఇథనాల్, విద్యుత్ ఉత్పత్తి కూడా సాధ్యమవుతుందని పేర్కొంటూ, ఈ రంగానికి మరింత ప్రోత్సాహం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# విద్యార్థులపై తుపాకులు ఎక్కుపెట్టిన రాజ్యం

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో పోలీసు వ్యవస్థ ప్రజల రక్షణ కోసం ఉండాలి తప్ప, ప్రజలపైనే ఆయుధాలు ఎక్కుపెట్టేందుకు కాదు. కానీ ఇటీవల చోటుచేసుకున్న ఘటన ఈ మౌలిక సూత్రాన్నే ప్రశ్నార్థకం చేసింది. నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు ఏకంగా ఏకే 47 రైఫిల్ ఉపయోగించి కాల్పులు జరిపారు. పిల్లలపై జల్లాడలా బుల్లెట్లు కురిపించారు. మైనర్లనైనా చూడకుండా విచక్షణారహితంగా లాఠీ చార్జ్ చేశారు. ఈ కాల్పులకు అనుమతి ఎవరిచ్చారు, ఏ ఆదేశాల మేరకు పోలీసులు ఇంతటి తీవ్ర చర్యకు దిగారు అన్న ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. కాల్పులు జరపడానికి ముందు పోలీసులు రాజ్యాంగబద్ధంగా, చట్టపరంగా తీసుకోవాల్సిన హెచ్చరికలు, జాగ్రత్తలు పాటించారా అన్నది కీలక ప్రశ్న. ఈ అంశాలపై పార్లమెంటు దిగువసభ అట్టుడికిపోయింది. చిన్నపిల్లలపై పోలీసులు ఎందుకు అంతటి క్రూరత్వంతో విరుచుకుపడాల్సి వచ్చిందో సమాధానం చెప్పాల్సిన పరిస్థితి ప్రభుత్వానికి ఆసన్నమైంది.

ఈ కాల్పుల పర్యవసానాలు గుండెను పిండేసేలా ఉన్నాయి. ఒక విద్యార్థి కంటిచూపు శాశ్వతంగా కోల్పోగా, బుల్లెట్ గాయాల కారణంగా మరో విద్యార్థిని తన వినికిడి శక్తిని కోల్పోయింది. ఆ బాధిత విద్యార్థిని తల్లి వ్యక్తం చేసిన ఆవేదన యావత్ సమాజాన్ని కుదిపేసింది. తన కూతురిని పరామర్శించేందుకు నాయకులు రానక్కర్లేదని ఆమె నిష్కర్షగా చెప్పడం, రాజకీయ నాయకత్వం పట్ల ప్రజల్లో పేరుకుపోయిన అపనమ్మకానికి అద్దం పడుతుంది. క్షతగాత్రులను పరామర్శించడం ఒక ప్రొటోకాల్‌గా, ఫొటో అవకాశంగా మారిపోయిన నేపథ్యంలో, ఆ తల్లి మాటలు అధికార వ్యవస్థ యథార్థ జవాబుదారీతనాన్ని ప్రశ్నిస్తున్నాయి.

ఈ ఘటన కేవలం ఒక పోలీసు చర్యగా కాకుండా, ప్రజాస్వామ్యం అంటే ఏమిటి అన్న మౌలిక ప్రశ్నను తెరపైకి తెస్తుంది. ప్రజాస్వామ్యం అంటే ఐదేళ్లకోసారి ఓటు వేసి, తిరిగి ఐదేళ్ల వరకూ మౌనంగా ఉండిపోవడం కాదు. ఆధునిక సమాజంలో పాలనలో పౌరుల భాగస్వామ్యం అంటే, ఒక ఒత్తిడి బృందంగా (ప్రెషర్ గ్రూపు) ఏర్పడి, గాడి తప్పిన రాజకీయ వ్యవస్థను తిరిగి సరైన దారిలో పెట్టేందుకు ప్రశ్నించడం, పోరాడడం, ప్రజాస్వామ్యయుతంగా ప్రభుత్వాలను నిలదీయడం. ఇదే నిజమైన ప్రజాస్వామ్య ప్రక్రియలో పౌరుల చురుకైన పాత్ర. పౌరులు ఈ చురుకైన పాత్రను కోల్పోతే, ప్రశ్నించే ధైర్యాన్ని వదులుకుంటే, నిరాశ నిస్పృహలలోకి కూరుకుపోతే, అది ప్రజాస్వామ్యానికే, ప్రజాస్వామ్య మౌలిక స్ఫూర్తికే తీవ్ర విఘాతం కలిగిస్తుంది. కాబట్టి ఈ కాల్పుల ఘటనను ఒక్క పోలీసు వైఫల్యంగానో, ఒక రోజు వార్తగానో మరచిపోకుండా, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేలా, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించేలా పౌరసమాజం, పార్లమెంటు, న్యాయవ్యవస్థ నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. అప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం సజీవంగా నిలుస్తుంది.

# భయాన్ని కళ్లలోకి చూసిన తరం


**(నీట్ ప్రశ్నాపత్రం లీక్ నుంచి ప్రజా విద్య పరిరక్షణ వరకు విద్యార్థుల పోరాట గాథ)**



**నేహా బోరా**
ఆల్ ఇండియా స్టూడెంట్ అసోసియేషన్ (ఐసా) జాతీయ అధ్యక్షురాలు

ఒక ప్రశ్నాపత్రం లీక్ అయింది. అది కేవలం ఒక పరీక్ష రద్దుకే కారణం కాలేదు. లక్షలాది మంది యువత గుండెల్లో పెరిగిన ఆశలను, కుటుంబాలు ఎన్నేళ్లుగా కూడబెట్టుకున్న కలలను, తల్లిదండ్రులు చేసిన త్యాగాలను, పేదరికాన్ని జయించాలనే సంకల్పాలను ఒక్కసారిగా కుదిపేసింది. నీట్-యూజీ పరీక్షలో జరిగిన ప్రశ్నాపత్రం లీక్ భారత విద్యా వ్యవస్థలో నెలకొన్న లోతైన సంక్షోభాన్ని దేశం ముందుంచింది.
ప్రతి సంవత్సరం లక్షలాది మంది విద్యార్థులు వైద్య విద్యలో ప్రవేశం కోసం అహర్నిశలు శ్రమిస్తారు. కొందరి తల్లిదండ్రులు పొలాలు అమ్ముకుంటారు. మరికొందరు అప్పులు చేస్తారు. ఇంకొందరు జీవిత పొదుపులన్నింటినీ పిల్లల చదువుల కోసం ఖర్చు చేస్తారు. ఒక కుటుంబం భవిష్యత్తంతా ఒక పరీక్షపై ఆధారపడే పరిస్థితిని ఈ వ్యవస్థే సృష్టించింది. అలాంటి పరీక్షలో ప్రశ్నాపత్రం లీక్ కావడం అంటే అది కేవలం ఒక పరిపాలనా వైఫల్యం కాదు. అది విద్యార్థుల నమ్మకాన్ని ఛిద్రము చేయడం.
ఈ ఘటన తర్వాత దేశవ్యాప్తంగా విద్యార్థులలో తీవ్ర ఆవేదన వ్యక్తమైంది. కొందరు యువకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ఎన్నో కుటుంబాలు దుఃఖసాగరంలో మునిగిపోయాయి. కానీ ప్రజాస్వామ్య ప్రభుత్వానికి తగిన వినయం, బాధ్యత, ఆత్మపరిశీలన అధికార వర్గంలో కనిపించలేదు. క్షమాపణ చెప్పాల్సిన వారు ప్రశ్నించిన వారినే నిందించడం ప్రారంభించారు. సమాధానం చెప్పాల్సిన వారు విమర్శకులను దేశద్రోహులుగా చిత్రీకరించారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించడం పౌర హక్కు. కానీ ప్రశ్నించే గొంతును "దేశ శత్రువు"గా ముద్ర వేయడం ప్రజాస్వామ్య ఆత్మను అవమానించడం. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేసిన వ్యాఖ్యలు అందుకే తీవ్ర విమర్శలకు గురయ్యాయి. భవిష్యత్తు కోసం పోరాడుతున్న విద్యార్థులను "ఉగ్రవాదుల బృందం"గా అభివర్ణించడం వారి బాధను అర్థం చేసుకోలేని అధికార అహంకారానికే నిదర్శనం.
అయితే ఈ ఉద్యమం ఒక్క నీట్ పరీక్షతో ఆగిపోలేదు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు తమ అనుభవాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. యూపీటీఈటీ, పోలీసు నియామక పరీక్షలు, ఉపాధ్యాయ నియామకాలు, ప్రభుత్వ ఉద్యోగ పరీక్షలు.. ఎక్కడ చూసినా ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, ఫలితాల ఆలస్యాలు, నిలిచిపోయిన నియామకాలు. ఇవి విడివిడిగా జరిగిన సంఘటనలు కావు. యువత భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టిన ఒక వ్యవస్థకు ఇవి లక్షణాలు. ఈ ఉద్యమం ఒక ముఖ్యమైన సత్యాన్ని దేశానికి గుర్తుచేసింది. విద్య కూడా రాజకీయమే.
ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం రాజకీయమే. గ్రామీణ పాఠశాలలను "హేతుబద్ధీకరణ" పేరుతో విలీనం చేయడం రాజకీయమే. పేద విద్యార్థి ఫీజులు చెల్లించలేక కళాశాల విడిచిపెట్టడం రాజకీయమే. ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను సంవత్సరాల తరబడి భర్తీ చేయకపోవడం రాజకీయమే. ప్రశ్నాపత్రం లీక్ కావడం కూడా రాజకీయమే. ఎందుకంటే ఇవన్నీ ప్రభుత్వ విధానాలతో ముడిపడి ఉంటాయి.
జాతీయ విద్యా విధానం-2020 అమలుతో విద్యలో కేంద్రీకరణ మరింత పెరిగింది. జాతీయ పరీక్షా సంస్థ (ఎన్‌టీఏ) ద్వారా దేశవ్యాప్తంగా పరీక్షలను ఒకే వ్యవస్థలోకి తీసుకువచ్చారు. మరోవైపు విద్యను మార్కెట్‌కు మరింతగా అప్పగించారు. స్వయం-ఆర్థిక కోర్సులు పెరిగాయి. ఫీజులు విపరీతంగా పెరిగాయి. "స్వయం ప్రతిపత్తి" అనే ఆకర్షణీయమైన పదం వెనుక ప్రభుత్వ బాధ్యత క్రమంగా తగ్గిపోయింది. ఫలితంగా విద్య అనే ప్రజా హక్కు ఒక కొనుగోలు చేయాల్సిన వస్తువుగా మారిపోయింది. ఈ భారాన్ని అందరూ మోస్తున్నప్పటికీ, దళితులు, ఆదివాసీలు, బీసీలు, మైనారిటీలు, గ్రామీణ పేదలు, మహిళలు వంటి సామాజికంగా వెనుకబడిన వర్గాలపై దీని ప్రభావం మరింత తీవ్రంగా పడుతోంది. సమాన అవకాశాల పేరుతో అసమానతలను మరింతగా పెంచే పరిస్థితి ఏర్పడుతోంది.
ఈ ఉద్యమం మరో అరుదైన మార్పుకు కూడా నాంది పలికింది. ఇంతకు ముందు ఎప్పుడూ నిరసనలో పాల్గొనని వేలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చారు. వారి వెంట తల్లిదండ్రులు కూడా నడిచారు. కొందరు తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమై ఒక మాట చెప్పారు. "ఇప్పటివరకు నిరసన చేసే వారిని తప్పుగా అర్థం చేసుకున్నాం. ఇప్పుడు మా పిల్లలే అదే అన్యాయాన్ని ఎదుర్కొంటున్నారు." ఈ స్వీయ అవగాహన ప్రజాస్వామ్యానికి గొప్ప పాఠం. రాజకీయాల నుంచి దూరంగా ఉన్నామని భావించినా, ప్రభుత్వ నిర్ణయాలు ప్రతి ఇంటి గడపను తడతాయని ప్రజలు గ్రహించడం ప్రారంభించారు.
జూలై 20న జరిగిన "సంసద్ చలో" కార్యక్రమం ఈ ఉద్యమానికి చారిత్రక మలుపుగా నిలిచింది. దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది విద్యార్థులు పార్లమెంట్ వైపు కదిలారు. వారి చేతుల్లో ఆయుధాలు లేవు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను వినియోగిస్తూ ప్రశ్నించే స్వరాలే ఉన్నాయి. కానీ వారికి ఎదురుగా నిలిచింది భారీ పోలీసు బలగం. లాఠీలు, టియర్ గ్యాస్, వాటర్ కానన్లు, పెలెట్ గన్స్.. ఇవి ప్రజాస్వామ్యానికి రక్షణ కవచాలా? లేక ప్రశ్నించే గొంతును అణచివేసే సాధనాలా? మహిళలపై జరిగిన దౌర్జన్యాలు, విద్యార్థులపై జరిగిన దాడులు దేశవ్యాప్తంగా ఆందోళన రేకెత్తించాయి.
అయితే భయం ఉద్యమాన్ని ఆపలేదు. ప్రతి బ్యారికేడ్ కొత్త సంఘీభావాన్ని పుట్టించింది. అపరిచితులు ఒకరికి ఒకరు నీళ్లు అందించారు. తమ ఇళ్ల తలుపులు తెరిచారు. గాయపడిన వారికి చికిత్స అందించారు. లాఠీ దెబ్బలు తిన్నవారు మరుసటి రోజే మళ్లీ ఉద్యమంలో చేరారు. అదే ప్రజాస్వామ్యపు అసలైన బలం. విద్యార్థుల ఈ పోరాటం ఒక విషయాన్ని స్పష్టంగా రుజువు చేసింది. ప్రజలను శాశ్వతంగా భయపెట్టడం ఏ ప్రభుత్వానికీ సాధ్యం కాదు. ప్రజల ధైర్యం, సంఘటిత శక్తి, పరస్పర విశ్వాసం ముందు అధికార అహంకారం నిలవదు.
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక వ్యక్తి ఓటమి కాదు. అది సంఘటిత విద్యార్థి ఉద్యమం సాధించిన రాజకీయ విజయం. అయితే అది అంతిమ గమ్యం కాదు. ప్రశ్నాపత్రాల లీకులకు దారి తీసిన వ్యవస్థ ఇంకా అలాగే ఉంది. విద్యను ప్రైవేటీకరిస్తున్న విధానాలు ఇంకా కొనసాగుతున్నాయి. ప్రభుత్వ విద్యను బలహీనపరిచే నిర్ణయాలు ఇంకా ఆగలేదు. అందువల్ల ఈ ఉద్యమం ఇప్పుడే ముగియదు. ఇది ప్రజా విద్య పరిరక్షణ కోసం, సమాన అవకాశాల కోసం, పారదర్శక నియామకాల కోసం, రాజ్యాంగబద్ధమైన విద్యా హక్కు కోసం కొనసాగాల్సిన దీర్ఘకాలిక ప్రజా ఉద్యమం.
భారత చరిత్రలో ప్రతి తరం తనదైన పోరాటాన్ని రాసుకుంది. స్వాతంత్య్ర సమర తరం విదేశీ పాలనను సవాలు చేసింది. అత్యవసర పరిస్థితి కాలంలో విద్యార్థులు ప్రజాస్వామ్యాన్ని కాపాడారు. నేటి తరం విద్య, ఉపాధి, సమాన అవకాశాల కోసం నిలబడుతోంది. ఈ తరం గురించి చరిత్ర ఒక వాక్యం తప్పకుండా రాస్తుంది "వారు భయాన్ని చూసి పారిపోలేదు; భయాన్ని కళ్లలోకి చూసి నిలబడ్డారు."

## మేమూ బొద్దింకలమే!



సత్యమేదో
అసత్యమేదో
తెలిని
అమాయకులం!
అజ్ఞానులం!
నిరక్షర కుక్షులం
దిక్కులేని పక్షులం!
ఎవడుగట్టిగా
గొంతుచించుకుంటే
వాడేమొనగాడని
జండాపట్టి వాడి
వెనక తిరిగిన
బానిస కుంకలం
కుంకల్లోకుంకలం!
ఇప్పటికీ మేము
నిష్ఠ దరిద్రులం!
ముప్పైత్తేవాళ్ళం!
ఒకపూటతింటే
రెండోపూట పస్తు!
పొయ్యిలో పిల్లి
లేవనివాళ్ళం!
పురాణకతలు
బాగాచెప్పారు!
అమ్మ ఒళ్లోనే
నేర్చుకున్నాం!
బడి పాఠాల్లోకూడా
రామాయణ భారత
భాగవతాలే నేర్పారు!
చరిత్ర సైన్స్
అంతగాతెలీదు!
చదువులే లేని
అమ్మా నాన్నలకు
పురాణాలైలిసినట్టు
సైన్స్ చరిత్ర
ఎందుకుతెలీదో!
కల్పితగాథలు
అబద్ధాలు చెప్పి
చరిత్ర సైన్స్ వంటి
సత్యాలు మరుగై
దేశమంటే తెలీక
వైజ్ఞానికస్పృహలేక
మంద బుద్ధులయ్యాం!
గతిలేకమతిలేక
ఏ పూటకాపూట
జండాలు మోస్తూ
సత్యాసత్యాలతో
పనిలేకుండా
ఇప్పటికీ అదే
బతుకు మాది!
తరతరాలుగా
బానిసలం!
కీలుబొమ్మలం!
తోలుబొమ్మలం!
జరిగినమోసం
చేసినవంచన
ఉద్దేశ్యపూర్వకం!
నిన్న ఢిల్లీలో
జంతర్మంతర్లో
కాక్రోచ్ పార్టీ
సోనంవాంగ్చుక్
ధర్మేంద్ర ప్రధాన్
వీళ్లెవరోతెలీదు!
తెలిస్తేఇంకేముంది!
నిప్పుకు
గాలితోడు!
విద్యార్థులకి
జనంతోడు!
అలాజరక్కూడదనే
బానిసల్ని చేసారు!
ముందుజాగ్రత్తతో !
ఇప్పుడిప్పుడే
మాకూ తెలుస్తోంది!
నిజం దాగదు!
మేమూ ఆగము!
కాక్రోచ్ పార్టీతో
అడుగులేస్తాం!
మేమూబొద్దింకలమే!

-తమ్మినేని అక్కిరాజు
హైదరాబాద్

## పుడమి వేల్పు

గురువు పండ్ల తరువు
కూర్మికిని నెలవు
గురువు రాజహంస
పరిహరించి
మంచి చెడుల చూపు
మహనీయ మనిషి
పూజనీయ గరువు
పుడమి వేల్పు

రేడియమ్
9291527757

## నిస్సిగ్గుగా అధికారం



ధర్మం తప్పిన నేతకు సన్మానం
ప్రజాస్వామ్య ఆలయంలోనే
అపచారం
నిస్సిగ్గుగా బరితెగించే అధికారం
తల్లి భారతి కంట రుధిరం
విద్యావ్యవస్థలో మాఫియా రాజ్యం
భారతావనిలో నీట్ పేపర్ లీకేజీ
పాపం
ముక్కుపచ్చలారని బిడ్డల ప్రాణ
త్యాగం
దేశ పాలకుల మరో దైవకార్యం
లాఠీ దెబ్బకు తలలు పగిలినా
పెల్లెట్ గుండ్లు ఒంట్లో దిగినా
గుండె ధైర్యంతో సాగిన రణధీరులు
తలవంచని విద్యార్థి కిశోరాలు
చైనా పాక్ నిధుల ప్రవాహం
అరబ్ షేక్ లదే ఆహారం
సంఘ విద్రోహులదే సమరోత్సహం
విపక్షాల కుట్రలంటూ సాగిన
ప్రచారం

కుల మతాల విభజనలు
దైవాంశ సంభూతులుగా
ప్రచారాలు
పుష్కరకాల అధికార పగ్గాలు
చీల్చి చెండాడిన జెన్ జీ అడుగులు
పోలీస్ బారికేడ్లు ఛేదించి
మిలిటరీకి ఎదురు నిలిచి
తమ సహచరులను రక్షించి
వీరత్వం ప్రదర్శించిన ధీరవనితలు
దేశ భవిష్యత్తు కోరే భావి పౌరులు
నెల రోజుల్లోనే ఎగిసిపడిన దీక్షలు
లక్షలాదిగా కదిలిన యుగకర్తలు
ఢిల్లీ పీఠానికి ముచ్చెమటలు
సావిత్రిబాయి ఫాతిమా షేక్
లక్ష్మీబాయి
భగత్ సింగ్ అంబేద్కర్
త్యాగధనుల స్ఫూర్తి

మళ్లీ ఎరక చేసిన ఆడబిడ్డల
పోరాటశక్తి
భారత జన ఆక్రోశానికి మరో
సజీవ సాక్షి
ప్రశ్న నిరసన ప్రజాస్వామ్య జీవం
అణచివేతే తిరుగుబాటు మూలం
గలీజ్... బొద్దింకల సమాహారం
కుప్పకూలిన నియంతృత్వం..

- మాదాసి రామమూర్తి

## సువర్ణ భవితవ్యం



విశ్వంలో చరిత్ర గొప్పదా?
విశ్వంలో భవిష్యత్తు గొప్పదా?
గడిచిన కాలంలోని ముగిసిన
సంఘటనలు విషయాలు
ఒక చరిత్ర మన చరిత్ర!
రాబోయే కాలంలోని జరగబోయే
సంఘటనలు విషయాలు
ఒక భవిష్యత్తు మన భవిష్యత్తు!
ఎప్పుడైనా ఎక్కడైనా
రెండిటిలో చరిత్రదే పైచేయి
కారణం చరిత్ర స్వచ్ఛమైనది
కారణం చరిత్ర ప్రాణపథమైనది
కారణం చరిత్ర వాస్తవమైనది!!!
వర్తమానంలో విశిష్టమైన
చరిత్ర తెలుసుకోకపోతే
ఉజ్వల భవిష్యత్తు
ఎప్పటికి నిర్మించుకోలేము!
సువర్ణ భవితవ్యం
ఎన్నటికి అందించలేము!!

కోటం త్రినాథ్
8523005678

# జంతర్-మంతర్ ప్రొటెస్ట్ ఏం ఇచ్చింది?

**ఇదిగో ఇక్కడ ఈ పిల్లల్లో ధైర్యాన్ని నింపింది**



రాజస్థాన్ లోని ఓ గ్రామంలో, పాఠశాల విద్యార్థులు ఇలా వీధుల్లోకి వచ్చి నిరసన తెలియజేసిన సందర్భం ఇది. అసలు దేశ చరిత్రలోనే ఎన్నడూ లేదు.. బహుశా ప్రపంచ చరిత్రలో ఆ రికార్డు సృష్టించిన మొట్ట మొదటి దేశం మనదే కావచ్చు. ఎంతోమంది ఢిల్లీ జంతర్ మంతర్‌లో విద్యార్థులు చేసిన ప్రొటెస్ట్‌ని 'టెర్రరిస్ట్‌ల మంద' అన్నారు. 'దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు వీళ్ళు ఆడుతున్నా డ్రామా' అన్నారు, 'వీళ్ళు చైనా ఏజెంట్‌లు, విదేశాలనుండి ఫండ్స్ తీసుకుంటున్న దేశద్రోహులు, పాకిస్థానీలు' అంటూ, ఆధారం లేని నిందలేసారు.
(వీటిలో ఏ ఒక్కటీ ప్రభుత్వ విచారణలో నిరూపణ కాలేదు).
మరోవైపు కొంతమంది, 'మీరీ ప్రొటెస్టులు చేసి ఏం సాధిస్తారు?... ఏం ఉద్ధారిద్దాం అని, పని పాట మానేసి ఇలా రోడ్లు పట్టుకు తిరుగుతున్నారు?.. ఫస్ట్ మీ బతుకులు మీరు చూసుకోండి. ప్రొటెస్ట్‌లు చేసి మీరు పీకి పొడిచేది ఏమీ లేదంటు" తిట్టి పోశారు. అలా విద్యార్థుల ప్రొటెస్ట్‌ని బూతులతో దూషించి, మీరేం పీకలేరంటూ, వాళ్ళకి మద్దతుగా నిలిచిన మాలాంటి వాళ్ళని ఆడి పోసుకున్న జనాలు, ఇప్పుడు ఈ పాఠశాల పిల్లల ప్రొటెస్ట్‌ని చూసైనా మత్తు నిద్రలోంచి మేల్కొంటారంటారా?
గడిచిన గత డెబ్బై సంవత్సరాలలో బడి పిల్లలు ఇలా రోడ్డు మీదకి వచ్చి, 'మా హక్కుల్ని మాకివ్వండి బాబోయ్!' అంటూ, అడుకున్న ఇంతటి హేయమైన కాలం ఎన్నడూ లేదు. ఢిల్లీలో జరిగిన నిరసన నుండి ఇన్‌స్పైర్ అయ్యి, పాఠాలు నేర్చుకున్న ఈ Alpha-Zenzy పిల్లలు, ఇలా తమ హక్కుల కోసం గొంతెత్తడం చూస్తుంటే, నాకైతే బలే సంతోషంగా వుంది.
'బడిలో మాకు పాఠాలు చెప్పేందుకు సరిపడా ఉపాధ్యాయులు లేరు. అన్ని తరగతులకు, అన్ని సబ్జక్ట్స్ చెప్పగలిగే టీచర్స్ కావాలి మాకు' అనీ, ఏ క్షణంలోనైనా కుప్పకూలిపోయే ప్రమాదంలో ఉన్న భవనాలు, తాగునీటి కొరత, పరిశుభ్రమైన మరుగుదొడ్ల కొరత వంటి ఫిర్యాదులను కూడా ప్రభుత్వం పరిగణంలోకి తీసుకోవాలని, లేదంటే మేం ఎవ్వరం కూడా క్లాసులకి వెళ్ళబోమని, 10 గంటల వరకైన సరే స్కూల్ గేట్ తెరిచేదే లేదని తేల్చి చెప్పారు. 'తక్షణమే మా డిమాండ్లను నెరవేర్చాలి' అంటూ, స్లొగన్స్ ఇవ్వడం మొదలుపెట్టారు. ఎంత బావుందో అసలు పిల్లల్ని ఇలా చూడటం.
ఇది కదా ఒక తరాన్ని, ఒక ఉద్యమం ప్రభావితం చేయడం అంటే.
అది కూడా సమకాలీనంలోనే.
ఇంతకు మించి ఇంకేం కావాలి??
అయినా, ఇప్పటికి ఈ పిల్లలను కూడా చైనీస్ ఏజెంట్స్ అని, పాకిస్తానీలు అనీ, బంగ్లాదేశ్ నుండి చొచ్చుకొని వచ్చారనీ అంటారా ఏంటి ? ఇది కూడా ఒక జిహాదీ ముఠానే అంటారా?
లేక ఈ జెన్ జీ ఏ కాదు, జెన్ ఆల్ఫా కూడా "Gutter mouth generation." అని తీర్పులిచ్చేస్తారా??
ఇప్పటికీ... ఇలాంటివి చూసాకైనా మీకు జ్ఞానోదయం కలగకపోతే, ఈ చిన్న చిన్న పిల్లల తెగువ ధైర్యం చూసాకైనా మీలో కాసింత sensitivity రాకపోతే, మీరు అసలు చచ్చి చాలాకాలం అయ్యిందని అర్థం.
కళ్ళుండి గుడ్లప్పగించి చూస్తూ, నోరుండి కూడా వాళ్ళకోసం ఒక మాట మాట్లాడని మిమల్ని ఈ పిల్లలు గుర్తుపెట్టుకుంటారు.
రాబోయే కాలంలో ఖచ్చితంగా మీనుండి మీ జవాబుదారితనాన్ని ప్రశ్నిస్తారు వీళ్ళు.
అప్పుడు మీ తల ఎక్కడ పెట్టుకోవాలో ఇప్పటినుండే ఆలోచించుకోండి.



- దియా విఘ్నేష్

# నేర - ధన రాజకీయాలను నిలువరించాలి



అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వర్ధిల్లుతున్న భారతదేశంలో నేడు ప్రజాస్వామ్యం నేర చరితుల మరియు ధన రాజకీయుల చేతుల్లో బంధీగా కునారిల్లుతూ 'ప్రమాద ప్రజాస్వామ్య సంకేతాల'తో కొట్టుమిట్టాడుతుంది. నేడు దేశంలో భూతద్దం పెట్టి వెతికినా స్వచ్ఛమైన రాజకీయాలు మచ్చుకైనా కనుచూపుమేరలో కూడా కనిపించని పరిస్థితులు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ రకంగా నేడు దేశంలో నీతివంతమైన రాజకీయాలకు ఏమాత్రం చోటు లేకుండా పోవడం నిజంగా విచారకరం. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానాన్ని ప్రజాస్వామ్యం అంటారు అని అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ చాలా స్పష్టంగా నిర్వచించారు. కాని నేటి ప్రజాస్వామ్య భారతం అంతా మాఫియా మరియు మనీ విషపు కోరల్లో బంధీగా మారి అప్రజాస్వామికంగా రూపుదాల్చుకోవడం విచారకరం. నేడు దేశంలో ప్రజాస్వామిక రాజకీయాలు కనుమరుగుతూ క్రమంగా నేర రాజకీయాలు మరియు ధన రాజకీయాలుగా చలామణి కావడం తద్వారా ప్రజాస్వామ్య మనుగడకు అంతులేని నష్టాన్ని కలిగిస్తూనే ఉన్నాయి. ఎన్నికలు - ప్రజాస్వామిక సంస్కరణలలో భాగంగా కృషిచేస్తున్న అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎ.డి.ఆర్) అనే సంస్థ దేశంలోని 28 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 31 మంది ముఖ్యమంత్రుల ఆస్తులు, క్రిమినల్ కేసులు, వయస్సు, విద్యార్హతలు మొదలగు అంశాలపై ఎన్నికల సమయాలలో ఆయా ముఖ్యమంత్రులు సమర్పించిన అఫిడవిట్ల ఆధారంగా ఇటీవల నివేదికను విడుదల చేసింది. ఈ నివేదిక ప్రకారం నేర రాజకీయాలను పరిశీలిస్తే తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యధికంగా 89 కేసులతో మొదటి స్థానంలోనూ మరియు 30 కోట్లకు పైగా ఆస్తులతో ఎనిమిదవ స్థానంలో నిలిచారు. అదేవిధంగా 29 కేసులతో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి రెండవ స్థానంలో నిలిచి ఉన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివ కుమార్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 19 కేసులతో ఆ తర్వాతి స్థానాలలో నిలిచి ఉన్నారు. 31 మంది ముఖ్యమంత్రులలో ఏకంగా 14 మంది ముఖ్యమంత్రులపై క్రిమినల్ కేసులు ఉండడం గమనార్హం. కేసులు నమోదు అయినంత మాత్రాన నేరం రుజువు అయినట్లుగా భావించకున్ననూ ఈ రకంగా క్రిమినల్ కేసులు నమోదు కావడం 'నేర రాజకీయాల పరాకాష్ట'ను చాలా స్పష్టంగా ఎత్తి చూపుతుంది. ఏది ఏమైననూ క్రిమినల్ కేసులు నమోదైనవారు ప్రజాప్రతినిధులుగా కొనసాగడం 'ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ'గా మిగిలిపోతుంది అని ఖచ్చితంగా చెప్పవచ్చు. నేడు దేశ రాజకీయాలలో ప్రజాప్రతినిధుల నేరాలు రోజురోజుకు పెరుగుతుండడం కడు విచారకరం. అందువల్ల ప్రజాస్వామ్యంలో నేరమయ రాజకీయాలకు ఏమాత్రం స్థానం కల్పించరాదు. నేరాలను నిలువరించే దిశలో ప్రభుత్వాలు తగిన విధంగా వ్యవహరించడం లేదు విమర్శలు తరచుగా వినిపిస్తూనే ఉన్నాయి.
ఈ అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఎ.డి.ఆర్) నివేదిక దేశంలోని 28 రాష్ట్రాలు, 3 కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 31 మంది ముఖ్యమంత్రుల మొత్తం ఆస్తుల విలువ 3660 కోట్లుగా వెల్లడించింది. కర్ణాటక ముఖ్యమంత్రి డి.కె.శివకుమార్ 1413 కోట్ల ఆస్తులు కలిగిఉండి దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా ప్రథమ స్థానంలో నిలిచారు. ఆ తర్వాత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 931 కోట్లతో రెండవ స్థానంలో, తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్ 648 కోట్లతో మూడవ స్థానంలో నిలిచి ఉన్నారు. ఈ రకంగా సంపన్న ముఖ్యమంత్రుల జాబితాలో దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు తొలి మూడు స్థానాలలో నిలిచి ఉన్నారు. అత్యల్ప ఆస్తులు (55 లక్షలు) కలిగి ఉన్న ముఖ్యమంత్రులలో జమ్మూ - కశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా ఉండడం గమనార్హం.
నేడు భారతదేశ రాజకీయాలు ఓట్లు, నోట్లు, సీట్లు అనే విధంగా మారడం అసలు సిసలైన ప్రజాస్వామ్యాన్ని పాతాళంలోకి తొక్కి వేశాయి. చెమట చుక్కలు చిందించకుండా ప్రజల సొమ్మును దోచుకుని రాత్రికిరాత్రే కోటీశ్వరులుగా ఎదిగే అవకాశాలు భారతదేశ రాజకీయాలు కల్పించడం కడు విచారకరం. ఈ నివేదికను చాలా సునిశితంగా పరిశీలిస్తే ఆయా పార్టీలు నేర మరియు ధన రాజకీయాలలో పాలుపంచుకుంటూ ప్రజాస్వామ్య పునాదులను సైతం పెకిలిస్తూ అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నాయి అని ఘంటాపథంగా చెప్పవచ్చు. ఈ రోజుల్లో కనీసం గ్రామ పంచాయితీ సర్పంచ్ గాను గెలవడానికి కూడా కోటి రూపాయల దాకా కూడా ఖర్చు చేస్తున్న హెచ్చు ఘటనలు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. తీరా ఎన్నికల్లో గెలిచాకా 'దోచుకోవడం మరియు దాచుకోవడం' తప్పితే వారు ప్రజలకు ఒరగబెట్టేది ఏమి ఉండదు. డబ్బులు ఉన్నవారే నేడు రాజకీయాలలో రాణిస్తున్నారు తప్ప సామాన్యులకు రాజకీయాలలో రాణించే అవకాశాలు కనుచూపుమేరలో కూడా కనబడడం లేదు. ఎన్నికలను సజావుగా అవినీతి మరియు అన్యాయాలకు తావు ఎన్నికలను నిర్వహించడంలో ఎన్నికల కమీషన్లు సైతం విఫలం కావడం కూడా నేర మరియు ధన రాజకీయాలు మరింతగా పెట్రేగిపోవడానికి దోహదం చేస్తుంది అని నిస్సందేహంగా చెప్పవచ్చు. అందువల్ల ఎన్నికల కమీషన్ నిద్రావస్థ నుండి మేల్కొని నేర మరియు ధన రాజకీయాలను పూర్తిగా నిలువరించే దిశగా ప్రక్షాళన గావించే విధంగా తగిన చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన అవసరం నేడు ఎంతైనా ఉంది.



జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

## ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం



**యాచారం, జూలై 29 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలలలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక ప్రణాళికతో, ఉపాధ్యాయుల వృత్తి నైపుణ్య శిక్షణతో ముందుకు వెళుతున్నట్లు యాచారం మండల విద్యాధికారి పాండురంగారెడ్డి తెలిపారు. యాచారం మండల పరిధిలో పనిచేస్తున్న ఎస్జీటీ ఉపాధ్యాయులందరికీ జూలై 20 నుండి జూలై 25 వరకు జెడ్పీహెచ్ఎస్ యాచారంలో నిర్వహించిన సమగ్ర వృత్యంతర శిక్షణ కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని ఆయన పేర్కొన్నారు. ఈ శిక్షణా శిబిరంలో మొత్తం 102 మంది ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు రెండు విడతలుగా పాల్గొన్నారని వివరించారు. ఇందులో మొదటి విడత కింద 50 శాతం మంది ఉపాధ్యాయులు సోమ, మంగళ, బుధవారాల్లోనూ, రెండో విడత కింద మిగిలిన 50 శాతం మంది ఉపాధ్యాయులు గురు, శుక్ర, శనివారాల్లోనూ శిక్షణ పొందినట్లు ఆయన వెల్లడించారు. ముఖ్యంగా చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక బోధనా పద్ధతుల ద్వారా విద్యాభివృద్ధి కలిగించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని ఎంఈఓ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్లుగా కొండలు, యాదయ్య, శ్రీనివాసులు, వెంకటయ్య వ్యవహరించి ఉపాధ్యాయులకు తగిన మార్గదర్శకాలను అందించారు. ఈ శిక్షణా తరగతులలో మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

# ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ నిశితంగా పర్యవేక్షించాలి

- **రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి**




**రంగారెడ్డి, జూలై 29 (జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈ.ఆర్.ఓ.లతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మాట్లాడుతూ.. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటైజేషన్ ప్రక్రియను బీఎల్ఓ, సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు, ఈఆర్ఓలు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణను నియమ నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో 1200 ఓటర్లకు మించి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఒక కుటుంబానికి సంబంధించిన ఓటర్లందరూ ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు కలిగి ఉండేలా హేతుబద్ధీకరణను చేపట్టాలని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి, వాటికి సంబంధించిన వివరాలు డాక్యుమెంటేషన్ చేయాలని తెలిపారు. ఎ.ఎస్.డి. జాబితా తయారు చేసిన తరువాత సంబంధిత బూత్ స్థాయి ఏజెంట్ సంతకం తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అర్హతతో దీనికి ఎలాంటి సంబంధం లేదని ప్రజలకు స్పష్టంగా వివరించాలని అధికారులకు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ప్రస్తుతం పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. మ్యాపింగ్ అనంతరం అందిన తాజా డేటా ఆధారంగానే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నామన్నారు. హేతుబద్ధీకరణలో ప్రధానంగా ప్రతి పోలింగ్ కేంద్రంలో సాధ్యమైనంత వరకు 1,200 మంది ఓటర్ల పరిమితిని పాటించడంతోపాటు, ఒకే కాలనీ, ఒకే నివాస సముదాయానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్ర పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. కొన్ని కాలనీల్లో ఒకే కుటుంబం లేదా ఒకే నివాస సముదాయంలోని ఓటర్లు రెండు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు విభజించబడిన సందర్భాలు ఉన్నాయని, అలాంటి సమస్యలను ప్రస్తుత హేతుబద్ధీకరణ దశలో పూర్తిగా పరిష్కరించడం సాధ్యం కానప్పటికీ, ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించిన తర్వాత ఫారం--8 ద్వారా సవరణలు చేపట్టేలా ప్రణాళిక రూపొందించినట్లు పేర్కొన్నారు. ఓటర్లకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు దిశగా పని చేస్తున్నామని చెప్పారు. రాజకీయ పార్టీలతోనూ నిరంతర సమావేశాలు కొనసాగిస్తున్నామని, అన్ని నియోజకవర్గాలు, మండలాల్లో సమావేశాలు నిర్వహించి పెండింగ్ అంశాల వివరాలను వారికి అందజేశామని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి శారద, ఎన్నికల విభాగం అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలు నిషేధం

- **ఉల్లంఘిస్తే వాహనాలు సీజ్**
- **ఆర్టీసీ డీఎం ఆర్. రామ్మోహన్**



**నారాయణపేట, జూలై 29 (జనం సాక్షి) :** నారాయణపేట కొత్త ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీ కరణ, బస్సుల రాకపోకల కు ఎలాంటి ఆటంకం కలగ కుండా ఉండేందుకు బస్టాం డ్ ఆవరణలోకి ప్రైవేటు వాహనాల ప్రవేశాన్ని పూర్తిగా నిషేధించినట్లు ఆర్టీసీ డీఎం ఆర్. రామ్మోహన్, ఆర్టీవో గౌతమ్, ట్రాఫిక్ ఎస్ఐ కృష్ణ చైతన్య తెలిపారు.బుధవారం ఆర్టీసీ, ట్రాఫిక్ పోలీసు, రవాణా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నారాయణపేట నూతన బస్టాండ్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.తనిఖీలలో మొత్తం 50 ప్రైవేటు వాహనాలను గుర్తించి చర్యలు తీసుకోగా, నిబంధనలు తీవ్రంగా ఉల్లం ఘించిన 9 వాహనాలను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అలాగే మిగిలిన 41 వాహనాలకు మోటారు వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించి అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగాఅధికారులు మాట్లాడుతూ బస్టాండ్‌లోకి అనుమతి లేని ప్రైవేటు వాహనాలు ప్రవేశించడం వల్ల బస్సుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటంతో పాటు ప్రయాణికుల ప్రాణా లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందన్నారు.ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు అధిక సంఖ్యలో బస్టాండ్‌ను వినియోగిస్తున్నందున వారి భద్రతను దృష్టిలో ఉంచుకొ ని ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు.బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వాహనాలను ఇష్టానుసారంగా నిలిపివే యడం, బస్టాండ్‌లోకి ప్రైవేటు వాహనాలను తీసుకురావడం, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించ డం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబో మన్నారు.నిబంధనలు ఉల్లంఘించే వారిపై వాహ నాలను సీజ్ చేయడంతో పాటు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజలు,వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ అధికారులకు సహకరించా లని,బస్టాండ్‌లోకి అనవ సరంగా ప్రైవేటు వాహనాలుతీసుకురాకుండా ప్రత్యామ్నాయ పార్కింగ్ స్థలాలను వినియోగిం చాలని సూచించారు. ప్రయాణికుల భద్రత, ట్రాఫిక్ సౌలభ్యం కోసం చేపడుతున్న ఈ చర్యలకు ప్రజలు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

# రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్**



**నిజాంపేట్, జూలై 29 (జనం సాక్షి) :** సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లి పారిశ్రామికవాడలో జీడిమెట్ల ఐల వద్ద నుంచి దూలపల్లి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నూతనంగా చేపట్టనున్న రోడ్డు విస్తరణతో పాటు నూతన రోడ్డు నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 2.20 కిలోమీటర్ల పొడవు, 50 ఫీట్ల వెడల్పుతో సుమారు 10.90 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయనున్న ఈ రోడ్డు విస్తరణతో 20 ఫీట్ల రోడ్డు 50 ఫీట్ల రోడ్డుగా విస్తరించడం ద్వారా భారీ వాహనాల ప్రయాణంతో పాటు దూలపల్లి, కొంపల్లి వంటి సమీప ప్రాంతాలవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పారిశ్రామికవాడలో రోడ్డు విస్తరణలో భాగంగా 153 కరెంట్ పోల్ షిఫ్టింగ్ పనులతో పాటు రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న 66 చెట్లను ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా వేరే ప్రాంతానికి తరలించేందుకు చేపట్టవలసిన చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా నాలాలపై ఉండే కల్వర్ట్ లను వెంటనే పూర్తి చేయాలి. దూలపల్లి - జీడిమెట్ల పారిశ్రామిల వాడలను కలుపుతూ చేపట్టే ఈ రోడ్డు నిర్మాణ పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయపరచుకుంటూ నిర్ణీత కాల పరిమితిలోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు నిర్మాణ పనులను చక చకా పూర్తి చేసేందుకు పారిశ్రామికవాడ ద్వారా వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లింపు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ఏఈఈ నరేష్, మాజీ ప్రజా ప్రతినిధులు చింతల దేవేందర్ యాదవ్, సురేష్ రెడ్డి, డప్పు కిరణ్, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు వెంకటేష్, మహేష్, మధు, వారాల వినోద్, బర్మా రాజు, బర్మ ప్రవీణ్, బర్మా శ్రీకాంత్, మంత్రి రఘు, గుర్రాల గోపాల్, గుబ్బల లక్ష్మీనారాయణ, కోల శ్రీకాంత్, ఇస్మాయిల్, శేషా చారి, దూలపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రెసిడెంట్ సాంబశివరావు, జీడిమెట్ల ఐలా ప్రెసిడెంట్ సాయి కిషోర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- **బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



**నిజాంపేట్, జూలై 29 (జనం సాక్షి) :** సిఎంసి కొంపల్లి సర్కిల్ పరిధిలోని దూలపల్లి పారిశ్రామికవాడలో జీడిమెట్ల ఐల వద్ద నుంచి దూలపల్లి ఎన్టీఆర్ చౌరస్తా వరకు నూతనంగా చేపట్టనున్న రోడ్డు విస్తరణతో పాటు నూతన రోడ్డు నిర్మాణ పనులను బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ గారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దాదాపు 2.20 కిలోమీటర్ల పొడవు, 50 ఫీట్ల వెడల్పుతో సుమారు 10.90 కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చేయనున్న ఈ రోడ్డు విస్తరణతో 20 ఫీట్ల రోడ్డు 50 ఫీట్ల రోడ్డుగా విస్తరించడం ద్వారా భారీ వాహనాల ప్రయాణంతో పాటు దూలపల్లి, కొంపల్లి వంటి సమీప ప్రాంతాలవాసులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. పారిశ్రామికవాడలో రోడ్డు విస్తరణలో భాగంగా 153 కరెంట్ పోల్ షిఫ్టింగ్ పనులతో పాటు రోడ్డు విస్తరణలో అడ్డుగా ఉన్న 66 చెట్లను ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా వేరే ప్రాంతానికి తరలించేందుకు చేపట్టవలసిన చర్యలను వెంటనే చేపట్టాలన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా నాలాలపై ఉండే కల్వర్ట్ లను వెంటనే పూర్తి చేయాలి. దూలపల్లి - జీడిమెట్ల పారిశ్రామిల వాడలను కలుపుతూ చేపట్టే ఈ రోడ్డు నిర్మాణ పనులను అన్ని శాఖల అధికారులు సమన్వయపరచుకుంటూ నిర్ణీత కాల పరిమితిలోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా రోడ్డు నిర్మాణ పనులను చక చకా పూర్తి చేసేందుకు పారిశ్రామికవాడ ద్వారా వెళ్లే వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా దారి మళ్లింపు చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఎంసి ఏఈఈ నరేష్, మాజీ ప్రజా ప్రతినిధులు చింతల దేవేందర్ యాదవ్, సురేష్ రెడ్డి, డప్పు కిరణ్, సుభాష్ నగర్ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, నాయకులు వెంకటేష్, మహేష్, మధు, వారాల వినోద్, బర్మా రాజు, బర్మ ప్రవీణ్, బర్మా శ్రీకాంత్, మంత్రి రఘు, గుర్రాల గోపాల్, గుబ్బల లక్ష్మీనారాయణ, కోల శ్రీకాంత్, ఇస్మాయిల్, శేషా చారి, దూలపల్లి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రెసిడెంట్ సాంబశివరావు, జీడిమెట్ల ఐలా ప్రెసిడెంట్ సాయి కిషోర్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కపాస్ యాప్‌ను రద్దు చేయాలి

- **పిఎసిఎస్, రైతు వేదికల ద్వారా ఎరువులు పంపిణీ చేయాలి**
- **తెలంగాణ రైతు సంఘం డిమాండ్**



**మర్పల్లి, జూలై 29 (జనంసాక్షి) :** ఖరీఫ్ పంటలు సాగు చేస్తున్న రైతన్న లకు ఎరువులు పిఎసిఎస్, రైతు వేదికల ద్వారా పంపిణీ చేయాలని, కాపాస్ యాప్ తో రైతులు పద రని పాట్లు పడుతున్నారని కాపాసి యాప్ ను వెంటనే రద్దుచేసి పిఎసిఎస్, రైతు వేదికల ద్వారా ప్రభుత్వం నిర్ణయించిన సబ్సిడీ ధరలకు పంపిణీ చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్ మైపాల్ డిమాండ్ చేశారు. బుధవారం మండలంల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రైతు సంఘం ఆధ్వర్యంలో ఎరువుల దుకాణాల్లో సర్వే నిర్వహించి ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ మైపాల్ మాట్లాడుతూ మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే ఇష్టానుసారంగా దళారులు అధిక ధరలకు మసాలా ఎరువులు అమ్ముతూ రైతుల నడ్డి వీరుస్తున్నారని ఆయన ఆరోపించారు.యూరియా 265 నుండి350వరకు, డిఏపి 1350నుండి 2000వరకు, ఇతర ఎరువులు అధిక ధరలకు అమ్ముతున్నారని ఆయన ఆరోపించారు, నకిలీ ఎరువులు, నకిలి విత్తనాలు ఎక్కువ ధరలకు అమ్ముతున్నా వ్యవసాయ మండల,జిల్లా అధికారులు, జిల్లా కలెక్టర్ వారిపై తనిఖీలు చేయడం లేదని తనిఖీలు నిర్వహించి వెంటనే చట్టపరమైన చీరలు తీసుకొని లైసెన్స్ లు రద్దు చేసి కఠిన చర్యలు తీసుకొని లైసెన్సులు రద్దు చేయాలని.ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎరువుల బుకింగ్ యాప్ను వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతన్నలు తమ సాగు చేసిన పంటలను కాపాడుకునేందుకు ఎరువుల కోసం పడరాని పాట్లు పడుతున్నారని అయినా మసాలా ఎరువులు దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. దుకాణాల యజమానుల సమాచారంతో దళారులు ముందుగానే మసాలా ఎరువులు యాప్ ద్వారా బుక్ చేసుకుంటున్నారని దీంతో రైతులకు బుక్ చేసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. రైతులకు సరిపడా యూరియా దొరకక ఇబ్బందులకు గురవుతున్నారని మార్కెట్లో రైతులకు సరిపడే అందుబాటులో చాలు అన్నారు.

## ఎన్కెపల్లి-కొత్తపల్లి నక్ష బాటకు శాశ్వత రహదారి నిర్మించాలి

- **జిల్లా కలెక్టర్‌కు ఎన్కెపల్లి సర్పంచ్ మైపాల్ రెడ్డి వినతి**



**చేవెళ్ల, జూలై 29 (జనంసాక్షి) :** చేవెళ్ల మండల పరిధిలోని ఎన్కెపల్లి నుంచి కొత్తపల్లి, ఎర్రవగూడెం, మంచర్లగూడెం గ్రామాలను కలుపుతూ ఉన్న నక్షా బాటలో శాశ్వత రహదారి నిర్మించాలని కోరుతూ ఎన్కెపల్లి సర్పంచ్ మైపాల్ రెడ్డి బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. పొలాలకు వెళ్లేందుకు సరైన రహదారి లేక రైతులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానిక రైతులు సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై వెంటనే స్పందించిన సర్పంచ్ మైపాల్ రెడ్డి, రైతుల సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. వినతిపత్రాన్ని స్వీకరించిన కలెక్టర్ నారాయణ రెడ్డి సానుకూలంగా స్పందించి, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర నివేదిక సమర్పించాలని ఆర్డీవో, తహసీల్దార్ లకు ఆదేశించారు. రైతులకు తగిన న్యాయం జరిగేలా విచారణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సరైన రోడ్డు సౌకర్యం లేక ఎరువులు, విత్తనాలు, వ్యవసాయ యంత్రాలను పొలాలకు తరలించడం కష్టసాధ్యంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పంట దిగుబడులను మార్కెట్లకు తీసుకెళ్లడంలో కూడా తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో ఈ మార్గం పూర్తిగా బురదమయంగా మారి రాకపోకలు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించాల్సి వచ్చినప్పుడు అంబులెన్సులు, ఇతర వాహనాలు గ్రామాలకు చేరుకోలేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్థులు తెలిపారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రైతులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు రాకపోకలు సులభతరమై, వ్యవసాయ కార్యకలాపాలు, అత్యవసర సేవలు మెరుగుపడతాయని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.

## వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలి

- **కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**




**తెలకపల్లి, జూలై 29 (జనం సాక్షి) :** రైతు వేదికలో బుధవారం మండల పరిధిలోని దాసుపల్లి గ్రామంలో నిర్వహించిన రైతు అవగాహన సదస్సులో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పాల్గొన్నారు. రైతులు పంటల సాగుపైనే ఆధారపడకుండా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసుకోవాలని, గేదెల పెంపకంతో పాటు పశుగ్రాస సాగుపై ప్రత్యేక దృష్టి సారించి పాల ఉత్పత్తుల ద్వారా స్థిరమైన ఆదాయాన్ని పొందాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తక్కువ నీటితో పెరిగే పశుగ్రాస పంటలను సాగు చేయడంతో పాటు సైలేజ్ వంటి ఆధునిక పద్ధతుల్లో పశుగ్రాసాన్ని నిల్వ చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. నాణ్యమైన గేదెల పెంపకం, సమతుల్య పోషకాహారం, సకాలంలో టీకాలు, పశు వైద్య సేవలతో పాల దిగుబడి పెంచుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పాడి పరిశ్రమ ప్రోత్సాహక పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సీడ్ ఫామ్ నిపుణులు పశుగ్రాస సాగు, అధిక దిగుబడి గడ్డి రకాలు, సైలేజ్ తయారీ, హైడ్రోపోనిక్ ఫోడర్, పాడి పశువుల పోషణ, పాల ఉత్పత్తి పెంపుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డా. లచ్చిరెడ్డి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. జ్ఞానశేఖర్, వ్యవసాయ శాఖ అధికారులు, సీడ్ ఫామ్ నిపుణులు, ప్రజాప్రతినిధులు, వివిధ మండలాల నుంచి వచ్చిన పాడి రైతులు పాల్గొన్నారు.

# వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**

**మెదక్ బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** జిల్లాలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని ఛాంబర్ లో వర్షాల అప్రమత్తతపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ..భారత వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. పాడు బడిన ఇండ్లు, శిథిలావస్థలో ఉన్న భవనాలు, కమ్యూనిటీ హాళ్లను పరిశీలించి, ఎవరైనా అందులో నివసిస్తుంటే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. వర్షాల సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కాలువలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాటిని దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించరాదని సూచించారు. వరద నీటిలో ప్రయాణించడం ప్రాణాపాయానికి దారితీసే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు.అత్యవసర పరిస్థితులు మినహా భారీ వర్షాల సమయంలో బయటకు వెళ్లకుండా ఉండాలని, ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విద్యుత్ తీగలు తెగి పడిన ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని, అలాంటి సంఘటనలు కనిపిస్తే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించాలని కోరారు. తక్కువ ఎత్తులో ఉన్న ప్రాంతాల ప్రజలు నీటి మట్టాన్ని నిరంతరం గమనిస్తూ, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రైతులు తమ వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలను సురక్షిత ప్రదేశాల్లో నిల్వ చేసుకోవాలని సూచించారు. వాహనదారులు భారీ వర్షాల సమయంలో అధిక వేగంతో ప్రయాణించకుండా జాగ్రత్త వహించాలని, నీరు నిలిచిన రహదారులపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. జిల్లా యంత్రాంగం అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసి సహాయక చర్యలకు సిద్ధంగా ఉంచిందని, అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని, అత్యవసర పరిస్థితుల్లో సంబంధిత శాఖల అధికారులను సంప్రదించాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేశారు. ప్రజల సహకారంతోనే వర్షాల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోగలమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ తమ కుటుంబ సభ్యుల భద్రతకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి యాదయ్య, ఎంపీడీవోలు,జిల్లా అధికారులు, పాల్గొన్నారు.



# సర్ ప్రక్రియను 100 శాతం పూర్తి చేయాలి

● డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూలై 29 (జనంసాక్షి) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ఓటర్ల సర్వే ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేషన్ ఫారాల భర్తీని 100 శాతం పూర్తి చేయాలని డీసీసీ చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి బీఎల్ఏ-2 ప్రతినిధులకు పిలుపునిచ్చారు.బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో నియోజకవర్గ వ్యాప్తంగా బీఎల్ఏ-2 ప్రతినిధులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశానికి స్థానిక ఎమ్మెల్యే మేఘారెడ్డి కూడా హాజరయ్యారు.ఈ సందర్భంగా శివసేన రెడ్డి మాట్లాడుతూ, సర్ ప్రక్రియకు సమయం తక్కువగా ఉన్నందున బీఎల్ఏ-2 ప్రతినిధులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారికి అందజేసిన ఎన్యూమరేషన్ ఫారాలను పకడ్బందీగా పూర్తిచేయించాలన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీఎల్ఏ-2లతో నిరంతరం సమీక్షా సమావేశాలు నిర్వహించాలని, వారికి ప్రత్యేకంగా కేటాయించిన ఇన్‌చార్జిలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఓటర్లకు తలెత్తే సందేహాలను కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా నివృత్తి చేయాలని, క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేసి సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు.అలాగే, కాంగ్రెస్ పార్టీ ఓట్లను తొలగించే కుట్రలు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేస్తున్నాయని ఆరోపిస్తూ, వాటిని తిప్పికొట్టేందుకు బీఎల్ఏ-2లు, నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తల ఓటు హక్కులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ పార్టీ విజయానికి ఐక్యతే బలమని అన్నారు. నియోజకవర్గంలోని బీఎల్ఏ-2లు, ఇన్‌చార్జిలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పార్టీ కోసం కృషి చేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. సీనియర్ నాయకులతో సమన్వయం చేసుకుంటూ సర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, సాయి చరణ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కోళ్ల వెంకటేష్, శరవంద, పట్టణ అధ్యక్షుడు కదిరే రాములు, మండల అధ్యక్షుడు నక్క రవికిరణ్, బీఎల్ఏ-2 ప్రతినిధులు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పులుల పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యం

● ఎఫ్ఆర్‌వో పర్వేజ్ అహ్మద్




**గద్వాల నడిగడ్డ, జూలై 29 (జనం సాక్షి) :** పులుల పరిరక్షణతోనే ప్రకృతి సమతుల్యత సాధ్యమని ఎఫ్ఆర్‌వో పర్వేజ్ అహ్మద్ అన్నారు.ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక అభ్యాస పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించి, పులుల సంరక్షణ,జీవవైవిధ్య పరిరక్షణ,అడవుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌వో పర్వేజ్ అహ్మద్ మాట్లాడుతూ, పులులు ప్రకృతి సమతుల్యతను కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయని, వాటి సంరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని అన్నారు. అడవులు, వన్యప్రాణులను పరిరక్షించేందుకు చిన్ననాటి నుంచే విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యం పెంపొందించాల్సిన అవసరం ఉందని సూచించారు.అనంతరం విద్యార్థులు పులుల సంరక్షణ, అడవుల పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తామని ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన,చిత్రలేఖన పోటీలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పులుల పరిరక్షణపై తమ ఆలోచనలను వ్యాసాలు,చిత్రాల రూపంలో సృజనాత్మకంగా ఆవిష్కరించారు.ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో రేంజ్ సిబ్బంది,పాఠశాల సిబ్బంది విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్య విద్యే భవిష్యత్తుకు బంగారు బాట



**కల్వకుర్తి, జూలై 29 (జనంసాక్షి న్యూస్) :** విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాథమిక విద్యే బలమైన పునాదని జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడం, చదవడం, రాయడం, లెక్కించడం వంటి ప్రాథమిక నైపుణ్యాల్లో పూర్తి ప్రావీణ్యం కల్పించడం ఉపాధ్యాయుల ప్రధాన బాధ్యత అని పేర్కొన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి ఆధ్వర్యంలో కల్వకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని బుధవారం ఆయన పరిశీలించారు. శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులతో మాట్లాడి బోధనా విధానాలు, విద్యార్థుల అభ్యాస సామర్థ్యాల పెంపు, నిరంతర మూల్యాంకనం, తరగతి గది నిర్వహణ తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆధునిక బోధనా పద్ధతులను అమలు చేయాలని, ప్రతి విద్యార్థి అభ్యాసంలో చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.చిన్న వయస్సులోనే పిల్లల్లో పఠన అలవాటు,గణిత నైపుణ్యాలు,సృజనాత్మక ఆలోచన పెంపొందిస్తే ఉన్నత విద్యకు బలమైన పునాది ఏర్పడుతుందని రమేష్ కుమార్ తెలిపారు. ఒక్క విద్యార్థి కూడా వెనుకబడకుండా వ్యక్తిగత శ్రద్ధతో బోధన అందించాలని, ప్రతి పాఠశాలలో ప్రతిరోజూ పఠన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

# పండ్ల తోటలపై రైతులు దృష్టి సారించాలి

● మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి బ్యూరో, జూలై 29 (జనంసాక్షి) :** సంప్రదాయ పంటలతో పాటు అధిక ఆదాయం అందించే పండ్ల తోటల సాగుపై రైతులు దృష్టి సారించాలని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సూచించారు. వనపర్తి జిల్లా అమరిచింత మండలం చిన్న కడుమూరు గ్రామానికి చెందిన రైతు దాసరిపల్లి ఆశిరెడ్డి 10 ఎకరాల్లో మేలురకం దానిమ్మ తోటను సాగు చేస్తూ అధిక దిగుబడి సాధించి రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన ప్రశంసించారు. దానిమ్మ తోటను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, ఆత్మవిశ్వాసంతో సంప్రదాయ పంటలతో పాటు వాణిజ్య పంటలపై ఆసక్తి చూపిన ఆశిరెడ్డి ప్రతి ఏడాది సుమారు రూ.1.20 కోట్ల విలువైన దానిమ్మ దిగుబడిని సాధిస్తూ విజయవంతమైన రైతుగా గుర్తింపు పొందారని తెలిపారు. ఆశిరెడ్డి కుమారులు ఇద్దరూ వైద్యులుగా సేవలందిస్తూనే వ్యవసాయంలోనూ నైపుణ్యం కనబరుస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. రైతులు తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అందించే వాణిజ్య పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించిన ఆయన, కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వ్యవసాయశాఖ మంత్రిగా పనిచేసిన సమయంలో ఆయిల్ పామ్ సాగును రెండు లక్షల ఎకరాలకు విస్తరించి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన కల్పించామని గుర్తుచేశారు. లాభసాటి వ్యవసాయం ద్వారా రైతులు ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నందిమల్ల అశోక్, కర్రె స్వామి, రఘువర్ధన్ రెడ్డి, ధర్మా నాయక్, రవి ప్రకాష్ రెడ్డి, రాజశేఖర్, మహేశ్వర్ రెడ్డి, చిట్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను వేగవంతం చేయండి

● జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా



**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న 1000 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టర్ ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో ఉన్న జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ కార్యాలయాన్ని సందర్శించారు.కార్యాలయాన్ని అనువైన వేరే భవనం లోకి షిఫ్టింగ్ పై కలెక్టర్ చర్చించారు. .ప్రభుత్వ ఆదేశాల ననుసరించి సమన్వయంతో పనులు చేపట్టాలని సూచించారు. డాకర్ల,విద్యార్థుల, రోగుల పార్కింగ్ కు,పక్కన గార్డెనింగ్,మెయిన్ రోడ్డు నుండి అప్రోచ్ రోడ్డు తదితర పెండింగ్ పనులు పూర్తి చేసి రెండు నెలల్లో ఆసుపత్రి ప్రారంభం కు అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని,జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరిండెంట్ డా.రంగా అజ్మీరా,తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల సంస్థ డి.ఈ.ఈ వేణుగోపాల్, తదితరులు ఉన్నారు.

# మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌లో డీఐజీ తనిఖీ

● డీఐజీ ఎల్.ఎస్.చౌహన్



**మహమ్మదాబాద్, జూలై 29 (జనంసాక్షి) :** జోగులాంబ జోన్ డీఐజీ ఎల్.ఎస్.చౌహన్ బుధవారం మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి వాటి నిర్వహణ తీరును సమీక్షించారు.అనంతరం పోలీసు అధికారులతో సమావేశమై పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. పోక్సోకేసుల దర్యాప్తులో నిర్లక్ష్యానికి తావులేకుండా వేగవంతంగా విచారణ పూర్తి చేయాలని సూచించారు. రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు.అదేవిధంగా రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలను చైతన్యపరచాలని,హెల్మెట్,సీటుబెల్ట్ వినియోగం,మద్యం సేవించి వాహనాలు నడపకూడదనే అంశాలపై ప్రత్యేక ప్రచారం చేపట్టాలని సూచించారు.ప్రజలకు సత్వర,పారదర్శక పోలీసు సేవలు అందించడంతో పాటు చట్టాలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని డీఐజీ ఎల్.ఎస్.చౌహన్, అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీఐ గాంధీనాయక్, ఎస్ఐ శేఖర్ రెడ్డి,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**గద్వాల, జూలై 29 (జనం సాక్షి) :** గద్వాల జిల్లా గద్వాల డిపోలో పరమేశ్వరయ్య అధ్యక్షతన జరిగిన గేట్ మీటింగ్‌లో యూనియన్ రాష్ట్ర నాయకులు మాట్లాడారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న, డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు, వైస్ ప్రెసిడెంట్ గోపాల్, హైదరాబాద్ జోనల్ ప్రెసిడెంట్ వెంకటేష్, గద్వాల డిపో యూనియన్ గౌరవాధ్యక్షులు గడ్డం కృష్ణారెడ్డి పాల్గొన్నారు.ఏడేళ్లుగా యూనియన్లపై నిషేధం ఉన్నా ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల హక్కుల కోసం పోరాడుతోందని నాయకులు తెలిపారు. కార్మికుల ఐక్య పోరాటం వల్లనే ఆగస్టులో యూనియన్ ఎన్నికలకు ప్రభుత్వం అంగీకరించిందని, ఈ ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ను గెలిపించాలని పిలుపునిచ్చారు. పీఆర్‌సీ బకాయిలతో సహా నూతన వేతన సవరణ అమలుజరగాలని,డ్రైవర్, కండక్టర్, గ్యారేజ్ సిబ్బంది పోస్టుల భర్తీచేస్కొఖీ, జజూ బకాయిలను వెంటనే జమ చేయడం,అదనపు పని గంటల రద్దు చెయ్యొద్దని,కారుణ్య నియామకాల అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో గద్వాల డిపో ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు మరియు అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## ఐడీఓసీ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు వద్ద రూ.55 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న నూతన ఇంటి గ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లె క్స్ (ఐడీఓసీ) నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ ప్రియాంక బుధవారం సాయంత్రం పరిశీలించారు.ఆర్ అండ్ బీ అధికారులతో కలిసి భవన సముదాయం లోని ఏ, బీ బ్లాక్‌లతో పాటు మంత్రి చాంబర్‌ను పరిశీలిం చిన కలెక్టర్, నిర్మాణ పురో గతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇంకా మిగిలి ఉన్న పనుల వివ రాలను తెలుసుకుని, ఆగ స్టు 10లోపు అన్ని పనుల ను పూర్తి చేయాలని అధికా రులను ఆదేశించారు.పనులను వరుసగా కాకుం డా సమాంతరంగా చేపట్టి వేగవంతంగా పూర్తి చేయా లని సూచించారు. భవన సముదాయానికి రంగులు వేసే పనులు పూర్తయ్యా యా, ఇంకా ఏమైనా మిగిలి ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే సముదాయం ఆవరణలో గ్రీనరీ, వాటర్ ఫౌంటెన్ పనుల పురోగతిని కూడా పరిశీలించారు. సముదాయం చుట్టూ సీసీ రోడ్డు పనులను త్వరి తగతిన పూర్తి చేయాలని, సముదాయం వెలుపల ప్రధాన రహదారిపై హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేయాల ని సంబంధిత అధికారు లను ఆదేశించా రు.నిర్మాణ పనులన్నింటినీ నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భవనాన్ని వినియోగానికి సిద్ధం చేయాలని మరోసారి స్పష్టం చేశారు.ఈ కార్యక్ర మంలో ఆర్ అండ్ బీ ఈఈ వెంకట రమణయ్య, డీఈ ఈ రాములు, ఎలక్ట్రికల్ ఏఈ, కాంట్రాక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలి




**చిలప్‌చేడ్, జులై 29 (జనంసాక్షి) :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించి, వారి సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాశాఖ అధికారి ఎంఈఓ విఠల్ సూచించారు. మండలంలోని జెడ్పీహెచ్ఎస్ సోమక్కపేటలో బుధవారం ప్రారంభమైన మూడు రోజుల మండల స్థాయి సమగ్ర వృత్యంతర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి పాఠశాలలో విద్యార్థుల నమోదు పెంచడంతో పాటు, హాజరు శాతం 100కు చేరేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థుల్లో డిస్‌లెక్సియా, డిస్క్యాల్కులియా వంటి అభ్యసన లోపాలను గుర్తించి, వారికి తగిన లోప నివారణ బోధన అందించాలని చెప్పారు. ప్రత్యేక అవసరాలున్న విద్యార్థులను సమ్మిళిత విద్యలో భాగంగా అందరితో కలిపి బోధించడంతో పాటు, పాఠశాల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. కృత్రిమ మేధ, డిజిటల్ లిటరసీ, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలపై ఉపాధ్యాయులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులను సక్రమంగా నిర్వహించాలని అన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా పాఠశాలల్లో ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులను వినియోగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో చండూర్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రమేష్, మండల రిసోర్స్ పర్సన్స్ నాగేందర్ రెడ్డి, సుజాత, మహేష్, నవీన్‌తో పాటు మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువత రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

● కలెక్టర్ ప్రియాంక

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** యువత స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాత లుగా నిలవాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపు నిచ్చారు.గురు పౌర్ణిమ సందర్భంగా నారాయణ పేట జిల్లా కేంద్రంలోని షిరిడి సాయిబాబా మందిర ఆవరణలో స్నేహ మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన స్వచ్ఛంద రక్తదాన శిబిరా న్ని జిల్లా కలెక్టర్ ప్రారంభిం చారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రక్తదానం చేయడం ద్వారా అవస రమైన వారికి సకాలంలో రక్తం అందించడంతోపాటు, రక్తదాత ఆరోగ్యానికి కూడా ప్రయోజనం చేకూరుతుం దని తెలిపారు. ప్రతి సంవ త్సరం ఈ తరహా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ సామాజిక సేవలో భాగస్వా ములవుతున్న స్నేహ మిత్ర మండలి నిర్వాహకులను ఆమె అభినందించారు. అనంతరం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ డాక్టర్ వినీత్ శిబిరాన్ని సందర్శిం చి మాట్లాడారు. యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం ద్వారా సమాజా నికి సేవ చేయడంతో పాటు ఆరోగ్యపరమైన ప్రయోజ నాలు కూడా పొందవచ్చని పేర్కొన్నారు. రక్తదాతలను, శిబిర నిర్వాహకులను ఈ సందర్భంగా అభినందిం చారు.ఈ సందర్భంగా స్నేహ మిత్ర మండలి సభ్యులు కలెక్టర్ ప్రియాంక,ఎస్పి వినీత్ ను శాలువాల తో సన్మానించారు.ఈ రక్తదాన శిబిరాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మంజుల రెడ్డి, ఆర్డీఓ రమేష్ సందర్శించారు.



# వనపర్తిని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలి

● ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి




**వనపర్తి బ్యూరో, జూలై 29 (జనంసాక్షి) :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి వనపర్తి నియోజకవర్గాన్ని పూర్తిగా గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధ్యక్షతన నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పురోగతి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని ప్రతి అర్హ పేద కుటుంబానికి ఇందిరమ్మ పథకం ద్వారా పక్కా ఇల్లు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మొదటి విడతలో ఇళ్లు మంజూరైనా నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను వెంటనే గుర్తించి, వారి వివరాలను సేకరించాలని ఆదేశించారు. అవసరం లేని వారి స్థానంలో నిజంగా అర్హులైన పేదలకు ఇళ్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఇప్పటికే గుర్తించిన 287 గుడిసెలతో పాటు నియోజకవర్గంలోని అన్ని గుడిసెలను పూర్తిస్థాయిలో గుర్తించి జాబితా సిద్ధం చేయాలని, పెండింగ్ అంశాలన్నింటినీ వారం రోజుల్లో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఇళ్ల నిర్మాణం చేపట్టేలా అధికారులు సహకరించాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, నిర్దేశించిన లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచాలని, లబ్ధిదారులకు అవసరమైన సహకారం అందించి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో హౌసింగ్ పీడీ విటోబా, అసిస్టెంట్ ఇంజనీర్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# నీట్ ఫలితాలలో తక్కువ మార్కులొచ్చాయని ఆత్మహత్యాయత్నం

- నిమ్స్‌లో చికిత్స పొందుతూ కృష్ణవేణి మృతి



**పలిమెల జులై 29 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన పాగె కృష్ణవేణి నీట్ పరీక్షా ఫలితాల్లో తక్కువ మార్కులు వచ్చాయన్న మనస్తాపంతో గడ్డి మందు తాగి మృతి చెందిన సంఘటన మండలం లో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పాగె కృష్ణవేణి తల్లితండ్రులు రాజయ్య చంద్రక్క వ్యవసాయ ఆధారిత కుటుంబం కాగా పై చదువుల కోసం నీట్ పరీక్ష రాసి ఇటీవలి నీట్ ఫలితాల్లో 405 మార్కులు సాధించింది. మంచి ర్యాంకు రాలేదని, తక్కువ మార్కులు వచ్చాయని తీవ్ర మానసిక ఒత్తిడికి, వేదనకు గురైందని, ఈ క్రమంలో సోమవారం ఉదయం నివాసంలో గడ్డి మందు తాగేసిందని గమనించిన తల్లిదండ్రులు వెంటనే ఆమెను మహాదేవపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని అక్కడి వైద్యుల సూచన మేరకు భూపాలపల్లి ఆసుపత్రికి తరలించగా మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్ లోని నిమ్స్‌లో నిపుణులైన వైద్యులు అత్యవసర చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించడంతో మంగళవారం సాయంత్రం ప్రాంతంలో కృష్ణవేణి కన్నుమూసిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కృష్ణవేణి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేశారు.

### ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో
# సినారె జయంతి వేడుకలు



**హనుమకొండ ప్రతినిధి జూలై 29 (జనం సాక్షి) :** ప్రముఖ కవి జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీత డాక్టర్ సి నారాయణ రెడ్డి జయంతి సందర్భంగా బుధవారం హనుమకొండ రాంనగర్ లోని జిల్లా సంఘ భవనంలో క్లాస్మేట్ క్లబ్ ఉమ్మడి వరంగల్ జిల్లా కన్వీనర్ రిటైర్డ్ యంపీడీఓ పెద్ది ఆంజనేయులు ఆధ్వర్యంలో నలుగురు కవులకు సన్మానం చేయడం జరిగిందిఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుందూరు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో కరీంనగర్ జిల్లా మారుమూల ప్రాంతంలో జన్మించి ప్రపంచ విఖ్యాత కవిగా జ్ఞానపీఠ పురస్కారం పొందడం తెలంగాణ ప్రాంత ప్రజలకు గర్వకారణమని అన్నారు. క్లాస్మేట్ క్లబ్ ప్రతినిధి రిటైర్డ్ యంపీడీఓ పెద్ది ఆంజనేయులు మాట్లాడుతూ తెలంగాణ ప్రముఖుల ను గుర్తించి స్మరించాలని అన్నారుఈ సందర్భంగా హనుమకొండ లోని ప్రముఖ కవులు శనిగరం రాజమోహన్, రామబ్రహ్మచారి, కుందూరు గోపాల్ రెడ్డి యండీ నయీముద్దీన్ లను దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సంఘం అసోసియేట్ అధ్యక్షుడు యండి నయీముద్దీన్ ఉపాధ్యక్షుడు నారాయణ రావు కార్యవర్గ సభ్యులు జగదీశ్వర్ రెడ్డి ,సమ్మయ్య , శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులకు హాస్టల్‌లో మెరుగైన వసతులు కల్పించాలి

- అందుబాటులో లేని హాస్టల్ వార్డెన్ పై ఆగ్రహం
- హాస్టళ్లలో పరిశుభ్రత, భోజనం, భద్రతపై రాజీ ఉండొద్దు..
- జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి..



**హనుమకొండ ప్రతినిధి, జూలై 29 (జనం సాక్షి) :** విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునేలా హాస్టళ్లలో నాణ్యమైన వసతులు, పరిశుభ్రమైన వాతావరణం, పౌష్టికాహారం అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు.బుధవారం హనుమకొండ 100 ఫీట్ల రోడ్డు సమీపంలోని టీవీ టవర్ కాలనీలో ఉన్న షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలోని బాలుర జూనియర్ కళాశాల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా హాస్టల్ ప్రాంగణం, విద్యార్థులు నివసిస్తున్న గదులు, వంటగది, భోజనశాలను పరిశీలించారు. విద్యార్థుల కోసం సిద్ధం చేసిన భోజన పదార్థాల నాణ్యత, నిత్యావసర సరుకుల నిల్వలను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.అనంతరం హాస్టల్‌లోని మొదటి, రెండో అంతస్తుల్లో ఉన్న విద్యార్థులతో కలెక్టర్ నేరుగా మాట్లాడారు.ఆకస్మిక తనిఖీ సమయంలో హాస్టల్ వార్డెన్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ ఆరా తీసి, విధుల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టల్‌లోని గదులు, ప్రాంగణం ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, సురక్షితమైన వాతావరణం కల్పించడం అధికారులు, సిబ్బంది బాధ్యత అని అన్నారు. విద్యార్థులు లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈ తనిఖీలో హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

# భూసేకరణ పనులు వేగవంతం చేయాలి



- వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో సమీక్ష సమావేశం

**వరంగల్ బ్యూరో, జూలై 29 (జనం సాక్షి) :** జిల్లాలో వివిధ ప్రతిష్ఠాత్మక అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు.బుధవారం జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో జే. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకం, కొనైమాకుల ఎత్తిపోతల పథకం, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, ఇన్నర్ రింగ్ రోడ్, జాతీయ రహదారి--163జీ, రైల్వే ప్రాజెక్టులు, విమానాశ్రయానికి సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.ప్రాజెక్టుల వారీగా పెండింగ్‌లో ఉన్న భూసేకరణ, పరిహారం చెల్లింపులు, అవార్డు ప్రక్రియ, భూ స్వాధీనం తదితర అంశాలపై అధికారులతో సవివరంగా చర్చించారు.ప్రభుత్వ ప్రాధాన్యత గల ఈ ప్రాజెక్టుల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టి, భూసేకరణ ప్రక్రియను నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ జి సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, వరంగల్,నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు, ఎడి సర్వే ల్యాండ్ శ్రీనివాస్ రావు, జోనల్ మేనేజర్ స్వామి, ఎలక్ట్రిసిటీ ఎస్ ఈ ఆనందం, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాలు

- ఉధృతంగా ప్రవహిస్తున్న రాళ్లవాగు
- వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన సిపి అంబర్ కిషోర్ ఝా

**మంచిర్యాల ప్రతినిధి/చెన్నూర్, జూలై 29 (జనంసాక్షి) :** మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రాంతంలో ఉన్న రాళ్లవాగు ప్రాంతాన్ని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ...భారీ వర్షాల కారణంగా రాళ్లవాగు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో పాత మంచిర్యాల ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయని తెలిపారు.ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదకర ప్రాంతాలను పూర్తిగా మూసివేసి, అవసరమైన చోట్ల ట్రాఫిక్ మళ్లింపులు అమలు చేస్తున్నామని, మరికొన్ని ప్రాంతాల్లో రాకపోకలను పూర్తిగా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. పోలీసులు సూచించిన ట్రాఫిక్ మళ్లింపులను ప్రజలు తప్పనిసరిగా పాటించాలని, వర్షాకాలంలో భద్రతకే అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని కమిషనర్ కోరారు.వాతావరణ శాఖ మరో రెండు రోజులపాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించిన నేపథ్యంలో,ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ముఖ్యంగా కోటపల్లి,నీల్వాయి ప్రాంతాల వైపు ప్రాణహిత నదిలో నీటి ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున, అవసరమైతే ఎస్‌డీఆర్‌ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) బృందాలను మోహరించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

పోలీస్ కమిషనరేట్ పరిధిలో దాదాపు 30 మంది శిక్షణ పొందిన సిబ్బంది అత్యవసర సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు.గత ఏడాది వరదల సమయంలో గ్రామాలు నీటిలో చిక్కుకున్నప్పుడు బోట్ల సహాయంతో విజయవంతంగా సహాయక చర్యలు చేపట్టామని గుర్తు చేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే స్పందించేందుకు పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటిస్తూ అందుబాటులో ఉన్నారని కమిషనర్ తెలిపారు. సిపితో మంచిర్యాల డీసీపీ ఎ. భాస్కర్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.






### చెన్నూర్‌లో ఉప్పొంగుతున్న లోతు వాగు, పాలవాగు

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామం వద్ద లోతు వాగు లో వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నాలుగు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నక్కలపల్లి, బద్దంపల్లి, బ్రాహ్మణపల్లి, చామనపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామాలలోని ప్రజలకు ఏ చిన్న అవసరం వచ్చినా ప్రాణాలకు తెగించి లోతు వాగు వాగు దాటి కోటపల్లి మండల కేంద్రానికి లేదా చెన్నూరు మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. గత రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షానికి లోతు వాగులో భారీగా వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున, గ్రామాలలోని ప్రజలు ఎవరు కూడా వాగు దాటే ప్రయత్నం చేయవద్దని అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు. అలాగే మండలంలోని అక్క పెల్లి గ్రామం వద్ద పాలవాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది రాత్రి నుండి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిపారు. అక్కపల్లి గ్రామం వద్ద కాజు వే లెవెల్ వంతెన నుండి భారీ వరద నీరు ప్రవహిస్తుండటంతో ఎలాంటి ప్రమాదం సంభవించకుండా రోడ్డును పూర్తిగా మూసివేయగా, రోడ్డుకు రెండూ వైపులా బారికేడ్స్ ఏర్పాటు చేయడమేగాక పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేయడం జరిగినది తెలిపారు. తహసీల్దార్ మల్లికార్జున్, పట్టణ సీఐ బన్సీలాల్, ఎంపీడీవో మోహన్ లతో కలసి వాగు ప్రవహిస్తున్న బ్రిడ్జి వద్దకు చేరుకొని నీటి ప్రవాహాన్ని పరిశీలించారు.

## బల్లి వాగు దాటుతూ మహిళ మృతి



**ఖానాపూర్ జూ లై 29 (జనం సాక్షి) :** మం డలంలోని చమన్‌పెల్లిగూడెం గ్రామానికి చెందిన పారు బాయి (45) ఎరువచింతల్ గ్రామ బల్లివాగు దాటుతూ మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మృతురాలు చామనపల్లి గూడెం నుండి పెన్షన్ తీసుకునేందుకు ఎర్ర చింతల్ గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో వాగులు పొంగిపొర్లుతున్న తరుణంలో మహిళ వాగులో మృతి చెందడం ఈ ప్రాంతంలో కలకలం రేపింది. వాగులో ప్రమాదవశాత్తు కొట్టుకుపోతున్న మహిళను గమనించిన స్థానికులు ఒడ్డుకు చేర్చేసరికి ఆమె మృతిచెందినట్టు స్థానికులు తెలిపారు.

# వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండండి

- మీ ప్రాణ భద్రతే మా ప్రాధాన్యం
- చిన్న నిర్లక్ష్యం... పెద్ద ప్రమాదం
- విద్యుత్ భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించండి
- ములుగు సూపరింటెండింగ్ ఇంజనీర్ బి బిక్షపతి



**ములుగు ప్రతినిధి, జులై 29(జనంసాక్షి) :** వర్షాకాలంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని ములుగు సూపరింటెండింగ్ ఇంజనీర్ బి బిక్షపతి తెలిపారు. విద్యుత్ మన జీవితానికి వెలుగు నిచ్చే అమూల్యమైన శక్తి అయినప్పటికీ, చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తుందని హెచ్చరించారు. గృహ వినియోగదారులు, రైతులు, పశువులకాపలాదారులు, విద్యార్థులు, ప్రజలందరూ ఈ క్రింది విద్యుత్ భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. 'వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు,స్టే వైర్లు, సపోర్ట్ వైర్లు, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు లేదా తడి గోడలకు ఆనుకుని ఉన్న విద్యుత్ ఉపకరణాలను తాకకండి.తెగిపోయిన, వేలాడుతున్న లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దు,తాకవద్దు.ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల క్రింద నిలబడకండి.బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించవద్దు. తడి చేతులతో స్విచ్‌లు,ప్లగ్‌లు,మీటర్ బోర్డులు, మోటార్లు, గీజర్లు, కూలర్లు, వాటర్ హీటర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకరాదు.సెల్‌ఫోన్ ఛార్జింగ్‌లో ఉండగా ఫోన్‌లో మాట్లాడకండి. ముందుగా ఛార్జర్‌ను తొలగించిన తర్వాత మాత్రమే వినియోగించండి. ఇంటి వైరింగ్‌కు తప్పనిసరిగా నాణ్యమైన ఎర్తింగ్ చేయించండి.ఐఎస్ఐ నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలు, ప్లగ్గులు, వైర్లు, ఛార్జర్లు మాత్రమే ఉపయోగించండి.పాడైన, అతుకులు(జాయింట్లు) ఉన్న,ఇన్సులేషన్ దెబ్బతిన్న వైర్లు వెంటనే మార్చించండి.

ఇంటి విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేయకుండా అర్హత కలిగిన ఎలక్ట్రిషియన్‌తో మాత్రమే చేయించండి.' అని తెలిపారు. 'వ్యవసాయ మోటార్‌ను ఆన్ చేసే ముందు స్టార్టర్, వైర్లు, స్విచ్‌లు సురక్షితంగా ఉన్నాయో లేదో పరిశీలించండి.మోటార్లు,స్టార్టర్లు,జిఐ పైపులు, ఫుట్ వాల్వులు, పంపుసెట్లకు తప్పనిసరిగా సరైన ఎర్తింగ్ చేయించండి.'అని తెలిపారు.



## ప్రజలకు అందుబాటులో మెరుగైన వైద్య సేవలు

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**చెన్నూర్, జూలై 29(జనం సాక్షి) :** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని చెన్నూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనులు, ప్రహరీ గోడ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. చెన్నూర్ పట్టణంలో నూతనంగా చేపట్టిన వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహ నిర్మాణ పనులను సందర్శించి పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు

## సాంగ్వి, అనర్పల్లి వాగు ప్రవాహాల పరిశీలన



కెరమెరి, జూలై29 (జనంసాక్షి) : కెరమెరి మండలంలో కురుస్తున్న వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని తాసిల్దార్ నాగార్జున గౌడ్ అన్నారు. బుధవారం నాడు మండలంలోని సాంగ్వి, అనర్పల్లి వాగు ప్రవాహాలను పరిశీలించారు. వారి వెంట రెవిన్యూ ఇన్స్పెక్టర్ పవన్ ఉన్నారు.

# మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ తనిఖీ

- పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష
- ఆన్‌లైన్ నమోదుకు ప్రాధాన్యత




**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మంగళవారం మహాదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీ నిర్వహించారు. జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలు, కేసుల దర్యాప్తు పురోగతి, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. అనంతరం పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. అందిన ప్రతి ఫిర్యాదును వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా స్టేషన్ రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ, కేసు రికార్డుల నవీకరణ విధానాన్ని పరిశీలించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెంపొందించడమే తమ ప్రధాన లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు. ఈ వార్షిక తనిఖీలలో కాటారం డిఎస్పీ సూర్యనారాయణ, మహాదేవ్‌పూర్ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై సాంబమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంట్ స్తంభమే కాటేసింది!

- కరెంటు స్థంబాన్ని తాకిన మూగజీవాలు మృత్యువాత





**ఎల్కతుర్తి (జనంసాక్షి) :** మండలంలోని చింతలపల్లి గ్రామ శివారులో ఉన్న టువంటి వ్యవసాయ బాహువుల దగ్గర ఇనుప స్థంభానికి తాకి మూడు గొర్రెలు మృత్యువాత పడ్డా ఘటన దామెరలో చోటు చేసుకుంది. బాధిత కాపరి వివరాల ప్రకారం.. దామెర గ్రామానికి చెందిన రోడ్డ భిక్ష పతి కి సంబంధించిన గొర్రెలు ఇంద్రనగర్ నుండి దామెరకు మోసుకుంటూ వెలిలుచున్న క్రమములో బాండ్ల కుంట చెరువు కింద ఉన్న మర్రి చెట్టు దగ్గర ఎల్కతుర్తి చింతలపల్లి శివారు కు సంబంధించిన లైన్ ఏఈ .లైన్ మెన్ .ఇతర కరంటు సంబంధిత అధికారుల నిర్లక్ష్యానికి మూగ జీవులను బలి తీసుకున్న ఘటన దామెరలో చోటు చేసుకుంది దాదాపు 50 వెయ్యుల నుండి 60వెయ్యుల వరకు గొర్రెల విలువ ఉంటుందని బాధితుడు భిక్షపతి అన్నారు ..ప్రభుత్వం ఇనుప పోల్లా ప్లేసులో సిమెంటు పి పోల్లను ఏర్పాటు చెయ్యాలనే నిబంధనాలు ఉన్నప్పటికీ లైన్ మెన్లూ ఏ ఈ లు డిఈ పర్యవేక్షణ కరువైం దని అన్నారు. సంబంధిత అధికారులు వెంటనే నష్ట పరిహారం అందించాలని లేకుంటే సబ్టేషను ముట్టడిస్తామని ఈ సందర్భంగా బాధితుడు హెచ్చరించాడు. ఈ సందర్భంగా వ్యవసాయ దారులను ఈ విషయాన్ని అడుగగా పలుమార్లు సంబంధిత అధికారుల కు తెలుపగా నిర్లక్షంగా వ్యవహరించి సమాధానం చెప్పారని ఇలాంటి ఇనుప స్థంభాలు ఉన్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులస్పందన కరువైందని గ్రామస్తులు తెలిపారు.

# క్యాతనపల్లి మున్సిపాలిటీలో కమిషనర్-చైర్మన్ మధ్య వివాదం

- ఇరు వర్గాల పరస్పర ఫిర్యాదులు
- మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ ధర్నా



**రామకృష్ణాపూర్,జూలై 29(జనంసాక్షి):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో కమిషనర్ మురళీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ డా.గొడిసెల సంధ్యారాణి మధ్య వివాదం బహిర్గతమైంది. ఇరు వర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడంతో పాటు మున్సిపల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ కౌన్సిలర్లు, నాయకులు ధర్నా చేపట్టారు. బుధవారం మొదటి వార్డులో కమిషనర్ పర్యటించడాన్ని స్థానిక కౌన్సిలర్ ప్రశ్నించగా వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. వార్డు పర్యటనల గురించి చైర్మన్, కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వకుండా కమిషనర్ వ్యవహరిస్తున్నారని, ప్రజాప్రతినిధులను అవమానించే విధంగా మాట్లాడారని చైర్మన్ సంధ్యారాణి, బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. కమిషనర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు కమిషనర్ మురళీకృష్ణ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. విధుల్లో భాగంగానే వార్డుల్లో పర్యటిస్తుండగా తన విధులకు ఆటంకం కలిగించారని, తనపై అనుచితంగా ప్రవర్తించారని ఫిర్యాదులో పేర్కొన్నట్లు సమాచారం. ఇరు వర్గాల ఫిర్యాదులను పోలీసులు స్వీకరించి విచారణ చేపట్టారు. ఇటీవలే బాధ్యతలు స్వీకరించిన కమిషనర్‌తో పాలకవర్గానికి ఏర్పడిన విభేదాలు మున్సిపాలిటీలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వివాదం ఎలాంటి మలుపు తిరుగుతుందోనన్న ఆసక్తి స్థానికంగా నెలకొంది.

## పద్మశ్రీ అవార్డు గ్రహీత దాసరి కొండప్పకు ఘన సన్మానం



**నారాయణపేట, జూలై 29 (జనం సాక్షి) :** భారతీయ జనతా పార్టీ జిల్లా ఎండోమెంట్ సెల్ ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, ప్రముఖ జానపద కళాకారుడు దాసరి కొండప్పను వ్యాస పౌర్ణమి సందర్భంగా బుదవారమాయన స్వగృహంలో ఘనంగా సన్మానించి గురు వందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు కొండా సత్యాయాదవ్ మాట్లాడుతూ దాసరి కొండప్ప తమ కళా సేవల ద్వారా భారతీయ సంస్కృతి,సంప్రదాయాలను దేశ వ్యాప్తంగా చాటిచెప్పి పద్మశ్రీ పురస్కారాన్ని అందుకోవడం నారాయ ణపేట జిల్లాకే గర్వకార ణమని అన్నారు. ఇలాంటి మహనీయులను సన్మానిం చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. బీజేపీ జిల్లా ఎండోమెంట్ సెల్ కన్వినర్ కె. మోనేష్ చారి మాట్లాడుతూగురువులను, కళాకారులను గౌరవించడం భారతీయ సంస్కృతిలో భాగమని, దాసరి కొండప్ప సేవలు భావితరాలకు ఆదర్శప్రాయమని కొనియా డారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కో-కన్వినర్ వింజమూరు జగదీశ్ ,విద్యాధర్ దీక్షితులు, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు కృష్ణ బీజేపీ జిల్లా కార్యదర్శి గోపాల్ రావు, బీజేపీ మండల అధ్యక్షులుసంజీవ్ ,సత్తి సత్యనారాయణ,అశోక్ ,రవీందర్ నాథ్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీ ఉద్యమ జ్వాలను రగిలిస్తాం

- కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు బిసిలను ఏకం చేస్తాం
- ఆగస్టు 7న బెంగళూరులో జాతీయ ఓబీసీ మహాసభ నిర్వహణ
- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్



**మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 29 (జనం సాక్షి) :** దేశంలో సగభాగానికి పైగా ఉన్న బీసీల హక్కుల సాధన కోసం కోట్లాదిమంది బీసీలను కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు ఏకం చేసి గల్లీ నుండి ఢిల్లీ వరకు బీసీ ఉద్యమ జ్వాలను రగిలిస్తామనీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. నేడు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో బిసి విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు దోమ వెంకటేష్ ఆధ్వర్యంలో టీఎన్జీవో భవన్ లో ఆగస్టు 7న బెంగళూరులో జరిగే జాతీయ ఓబీసీ మహాసభను విజయవంతం చేయాలని కోరుతూ వాల్ పోస్టర్ ను బీసీ సంఘాలు,విద్యార్థి, యువజన, ఉద్యోగ సంఘాల నేతలతో కలిసి కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బిసి ఉద్యమాన్ని విస్తరించడానికి ఆగస్టు ఏడో తేదీన ప్రతి సంవత్సరం జాతీయ ఓబీసీ మాసభలను ప్రతి రాష్ట్రంలో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే ఢిల్లీ, ముంబై, నాగపూర్, హైదరాబాద్, తిరుపతి, అమృత్ సర్, గోవా లో నిర్వహించి ఈసారి బెంగుళూరులో నిర్వహిస్తున్నామన్నారు, బెంగళూరులో నిర్వహించే ఈ సభకు దేశం నలుమూలల నుండి వేలాదిమంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్నట్లు ఆయన వెల్లడించారు దేశవ్యాప్తంగా జాతి జనగణలో బీసీ కులగనణ చేపట్టాలని, మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని, జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని, చట్టసభలలో బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్ కల్పించాలనే ప్రధాన డిమాండ్ లపై జాతీయ సమావేశంలో చర్చించి భవిష్యత్ రాజకీయ కార్యాచరణ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. ముఖ్యంగా ప్రస్తుతం జరుగుతున్న వర్షాకాల పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం డిలీమిటేషన్ మరియు మహిళా బిల్లును పార్లమెంట్ లో ఆమోదించుకోవాలని చూస్తుందని, బీసీల రాజకీయ రిజర్వేషన్లు కల్పించకుండా మహిళా బిల్లు, డిలిమిటేషన్ బిల్లును పెట్టిన, ప్రతిపక్ష పార్టీలు పార్లమెంట్లో వ్యతిరేకించి ఆమోదించకుండా అడ్డుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మహిళా బిల్లు, డీలిమిటేషన్ వలన బీసీలకు ఎలాంటి రాజకీయ ప్రయోజనం లేదని, కేవలం అగ్రకులాల రాజకీయ ప్రయోజనాల కోసమే మహిళా బిల్లు డీలిమిటేషన్ బిల్లును తీసుకొస్తున్నారన్నారు. మహిళా బిల్లు డీలిమిటేషన్ మాటున మరొకసారి అగ్రకులాల భార్యలకు, కుమార్తెలకు, కుటుంబ సభ్యులకు చట్టసభలో ప్రవేశం దొరుకుతుందే తప్ప,బీసీలకు ఒరిగేది ఏమీ లేదన్నారు, బీసీ ఆకాంక్షలను గౌరవించకపోతే జెన్‌జీ ఉద్యమ తరహాలోనే బీసీ ఉద్యమం దేశవ్యాప్తంగా మొదలుపెడతామని కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ తీవ్రంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముకురాల చంద్రశేఖర్ గౌడ్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గొడుగు మహేష్ యాదవ్, బిసి విద్యార్థి సంఘం కోఆర్డినేటర్ కొప్పుల చందు గౌడ్, బిసి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాసురి జ్ఞానేశ్వర్, మహమదాబాద్ మండల అధ్యక్షుడు వేణు గౌడ్ మధు, దోమ వెంకటేష్ జిల్లా అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# మత్తు పదార్థాలపై ముమ్మర తనిఖీలు



**షాబాద్, జూలై 29 (జనం సాక్షి) :** మాదకద్రవ్యాల నిర్మూలనే ధ్యేయంగా షాబాద్ సర్కిల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. మండల పరిధిలోని కుర్వగూడ, లక్ష్మరావు గూడ లో పలు వ్యాపార దుకాణాలలో పాటు అనుమానిత ప్రాంతాలలో డ్రగ్స్, సైకోట్రోపిక్ పదార్థాల వినియోగం, అక్రమ రవాణ, నిల్వ, విక్రయాలను అరికట్టేందుకు ఇన్స్పెక్టర్ చెన్నారెడ్డి డాగ్ స్క్వాడ్ బృందంతో బుధవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన కూడళ్లు, అనుమానాస్పద ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాలు, యువత ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. ఎలాంటి అక్రమ మాదకద్రవ్యాలు లభించకపోయినప్పటికీ, ఇలాంటి తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు. అనంతరం యువత, మరియు గ్రామస్తులతో ప్రత్యేక అవగాహన సమావేశం నిర్వహించి మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, ఆర్థిక, సామాజిక దుష్పరిణామాలను వివరించారు. డ్రగ్స్‌కు అలవాటు పడితే కుటుంబాలు, భవిష్యత్, జీవితం, విద్య, ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. ఎవరైనా డ్రగ్స్, గంజాయి లేదా ఇతర నిషేధిత మాదక పదార్థాల విక్రయం, నిల్వ, రవాణా లేదా వినియోగానికి సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100 ద్వారా పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని, ప్రతి గ్రామాన్ని డ్రగ్స్ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై నిత్యం దృష్టి ఉంచాలని, అనుమానాస్పద మార్పులు గమనిస్తే వెంటనే స్పందించాలని సూచించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు, యువకులు పోలీసుల చర్యలను అభినందిస్తూ మాదకద్రవ్యాల నిర్మూలనకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, డాగ్ స్క్వాడ్ బృందం, గ్రామ పెద్దలు, యువత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పదోన్నతి గౌరవంతో పాటు మరింత బాధ్యతను తీసుకురావాలి

- జిల్లా ఎస్పీ సునిత రెడ్డి




**వనపర్తి బ్యూరో, జూలై 29 (జనంసాక్షి) :** పోలీసు శాఖలో పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడమే కాకుండా, ప్రజలకు మరింత బాధ్యతాయుతంగా సేవలు అందించే అవకాశమని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి, పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖలో హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందిన వనపర్తి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన రాజ గౌడ్, నాగేశ్వరరావు, పానుగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన లక్ష్మీ నర్సమ్మ, రాంగోపాల్ వర్మ, పెబ్బేరు పోలీస్ స్టేషన్‌కు చెందిన నాగరాజు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారికి హెడ్ కానిస్టేబుల్ హోదా చిహ్నమైన బ్యాడ్జీలను అలంకరించి అభినందనలు తెలిపారు. పదోన్నతి బాధ్యతలను మరింత పెంచుతుందని పేర్కొంటూ, ప్రజలకు క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావంతో సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, సమాజం, శాఖ, ప్రజలు పోలీసులపై ఉంచిన విశ్వాసానికి పదోన్నతి ఒక గౌరవప్రదమైన గుర్తింపని అన్నారు. హోదా పెరిగే కొద్దీ బాధ్యత, జవాబుదారీతనం, చట్ట పరిరక్షణలో పాత్ర కూడా విస్తృతమవుతుందని పేర్కొన్నారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులు, హక్కులను పరిరక్షించడం పోలీసు శాఖ అత్యున్నత కర్తవ్యమని, ప్రతి పోలీసు అధికారి చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేస్తూ ప్రజలతో మర్యాదగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించాలని సూచించారు. ప్రజల విశ్వాసమే పోలీసు ఉద్యోగానికి నిజమైన పురస్కారమని పేర్కొంటూ, పదోన్నతి పొందిన సిబ్బంది శాఖ ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నిజాయితీ, క్రమశిక్షణ, సమయపాలన, సేవాతత్వం, నైతిక విలువలతో ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నాణ్యమైన సేవలు అందించాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

## ఎస్సీ బాలుర హాస్టల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే



**కల్హేర్, జూలై 29 (జనంసాక్షి) :** కల్హేర్ మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్‌లోని గదులు, వంటగది, భోజనశాల, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించి విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత, వసతి సౌకర్యాలు, విద్యా పరిస్థితులపై ఆరా తీశారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రతి విద్యార్థికి సమర్థవంతంగా అందేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. హాస్టల్‌లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా నాణ్యమైన భోజనం, పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను, హాస్టల్ నిర్వహకులను ఆదేశించారు. హాస్టల్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని, నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ, ఏ సమస్య ఉన్నా నేరుగా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్, సర్పంచులు కోడి గంగారం, రవీందర్ రెడ్డి, ఉపసర్పంచ్ మహేష్, మాజీ మండల అధ్యక్షుడు పోచయ్య, జిత్తు రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

## మోమిన్‌పేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా



**మోమిన్‌పేట, జూలై 29 (జనం సాక్షి) :** జిల్లాలో శాంతి భద్రతే ముఖ్యమని ఎస్పి స్నేహమేహ్రా అన్నారు, బుధవారం మోమిన్ పెట పోలీస్ స్టేషన్ ను సందర్శించి క్షుణంగా తనిఖీ చేశారు ,ఈ వార్షిక తనిఖీలా భాగంగా ఎస్పీ పోలీస్ స్టేషన్ ఆవరణ తొ పాటు పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పరిశీలించారు, అలాగే స్టేషన్ లోని వివిధ రికార్డులు రిజిస్టర్లను నిశితంగా తనిఖీ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పారదర్శకమైన సత్వర స్పందనతో కూడిన సేవలను అందించడమే పోలీస్ శాఖ ప్రధాన ద్యేయమని పేర్కొన్నారు చట్ట అమలులో నిష్పక్షి కతను పాటించాలని బాధితులకు సేవలందించడంలో పూర్తి పారదర్శకత ను కలిగి ఉండాలని అధికారులను ఆదేశించారు ఎలాంటి కేసులు పైళ్లన పెండింగ్ ను ఉంచవద్దని ఇప్పటికప్పుడు దర్యాప్తును పూర్తి చేసి సంబంధిత వివరాలను ఆన్లైన్ సీసీటీ ఎన్ఎస్ లో నమోదు చేయాలని అన్నారు సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ ,నేరాల నియంత్రణకు కృషి చేయాలని రాత్రి వేళల్లో గస్తీని మరింత ముమ్మరం చేయాలని సూచించారు, స్టేషన్. కు వచ్చే బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను పరితగతిన పరిష్కరించాలని, అన్నారు ఇటీవల ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు చేసిన సురక్ష మిత్ర నిఘానేత్రం కార్యక్రమాల, ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు, మహిళలు పిల్లలు వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు ,ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి అంజయ్య ,మోమిన్ పేట సిఐ.జి.వెంకట్ ,ఎస్సై భరత్ భూషణ్. నవాబు పేట ఎస్సై గిరి ,ఏ ఎస్ ఐ లు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన మహిళల సాధికారతకు నాటుకోళ్ల పంపిణీ



**కౌడిపల్లి, జూలై 29 (జనంసాక్షి) :** గిరిజన కుటుంబాల ఆర్థికాభివృద్ధి, మహిళల స్వయం ఉపాధి, గ్రామీణ జీవనోపాధి బలోపేతమే లక్ష్యంగా మెదక్ జిల్లా కౌడిపల్లి బ్లాక్ పరిధిలోని హరిచంద్ తాండ గ్రామ పంచాయతీలో సైన్స్, టెక్నాలజీ మరియు ఆవిష్కరణ కేంద్రం (ఎస్టిఐ హెచ్ యు బి) ఆధ్వర్యంలో, డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా ప్రాజెక్టు కింద విఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ వి ఎన్ ఆర్ వి జె ఐ ఈ టి సంస్థ పెరటి నాటు కోళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు సహ ప్రధాన పరిశోధకులు రాము మాట్లాడుతూ, ప్రతి ఇంట్లో పెరటి నాటు కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా మహిళలు అదనపు ఆదాయం పొందడంతో పాటు కుటుంబ ఆర్థిక స్థితిని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి వి ఎన్ ఆర్ వి జె ఐ ఈ టి సంస్థ నిరంతరం అండగా నిలుస్తుందని, అవసరమైన శిక్షణ, సాంకేతిక సలహాలు, సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పెరటి కోళ్ల పెంపకం తక్కువ పెట్టుబడితో ఎక్కువ ప్రయోజనం చేకూర్చే ఉపాధి మార్గమని, గ్రామీణ మహిళలకు ఇది ఆర్థిక స్వావలంబనకు దోహదపడుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో వీరేంద్ర గోపి, ప్రాజెక్టు సిబ్బంది డా. దత్తేష్, రాకేష్, రామకృష్ణ, గ్రామ సర్పంచ్ షాలిబాయి - రవీందర్, గ్రామ కార్యదర్శి సతీష్, గ్రామ పెద్దలు, మహిళలు, లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్హేర్‌లో త్వరలో నూతన గ్రంథాలయం ప్రారంభం



**కల్హేర్, జూలై 29 (జనంసాక్షి) :** కల్హేర్ మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్న నూతన గ్రంథాలయ భవనాన్ని నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి బుధవారం పరిశీలించారు. గ్రంథాలయంలో పుస్తకాల ఏర్పాటు, ఫర్నిచర్ అమరిక, ఇతర మౌలిక వసతుల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత విద్యార్థులు, నిరుద్యోగ యువత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ఈ గ్రంథాలయం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. గ్రంథాలయ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను ఎమ్మెల్యే ఆదేశించారు. మండలంలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత, ప్రజలందరూ ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై అపోహలు వద్దు



**తెలకపల్లి, జూలై 29 (జనం సాక్షి) :** హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల ఎలాంటి సమస్యలు ఉండవని, గత 20 ఏళ్లుగా ఈ టీకా సురక్షితంగా వినియోగంలో ఉందని జేడీ చైల్డ్ హెల్త్ ఇమ్యునైజేషన్ రాష్ట్ర బృందం డాక్టర్ పృథ్వీ, స్టాటిస్టికల్ ఆఫీసర్ డేవిడ్ తెలిపారు. బుధవారం తెలకపల్లి మండల కేంద్రంలోని కేకే రెడ్డి పాఠశాలలో ఏర్పాటు చేసిన హెచ్‌పీవీ వ్యాక్సిన్ పంపిణీ కేంద్రాన్ని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ సురేష్‌బాబుతో కలిసి వారు పరిశీలించారు. ఈ సందర్భంగా టీకా తీసుకున్న విద్యార్థినులను అభినందించారు. 14 ఏళ్లు నిండిన ప్రతి బాలిక హెచ్‌పీవీ వ్యాక్సిన్ తీసుకోవడం ద్వారా గర్భాశయ క్యాన్సర్‌ను సమర్థవంతంగా నివారించవచ్చని వారు తెలిపారు. టీకాపై ఉన్న అపోహలను తొలగించి అర్హులైన ప్రతి బాలికకు వ్యాక్సిన్ అందేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా 41 మంది విద్యార్థినులకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ రాజేశ్వర్, జిల్లా వ్యాక్సిన్ స్టోర్ మేనేజర్ కుమార్, కోల్డ్ చైన్ ఇన్‌చార్జి దివ్య, డాక్టర్ అరవింద్, సూపర్‌వైజర్లు వీర్‌పాల్, యశోద, హెల్త్ అసిస్టెంట్ సందీప్‌రెడ్డి, ఏఎన్ఎంలు కవిత, శాంత, శ్రీలత, ఫార్మాసిస్ట్ సాయిరాం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# చెరువును తలపించిన నారాయణఖేడ్ బైపాస్ రోడ్డు

- వర్షపు నీటిలో నిలబడి నిరసన తెలిపిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి
- రోడ్లు, పారిశుద్ధ్యం, తాగునీటి సమస్య తీర్చాలని ప్రభుత్వంపై అగ్రహం

**నారాయణఖేడ్, జూలై 29 (జనం సాక్షి) :** గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో నారాయణఖేడ్ పట్టణంలోని బైపాస్ రోడ్డు పూర్తిగా నీటమునిగి చెరువును తలపించే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో బైపాస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలోనే నిలబడి మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి నిరసన వ్యక్తం చేశారు. ప్రజలు నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో నారాయణఖేడ్ అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి బైపాస్ రోడ్డు సహా పలు ప్రధాన రహదారులకు నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం మారిన తర్వాత అభివృద్ధి పనులు నిలిచిపోయాయని, ప్రజా సమస్యలను విస్మరించడంతో నేడు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. బైపాస్ రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాటిలో వర్షపు నీరు నిలిచిపోవడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ముఖ్యంగా సమీపంలో పాఠశాలలు, ఆసుపత్రులు ఉండటంతో విద్యార్థులు, రోగులు, వృద్ధులు, గర్భిణీలు ప్రాణభయంతో ప్రయాణించాల్సి వస్తోందని అన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతినడంతో వర్షం పడిన ప్రతిసారి నీరు నిలిచి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని పేర్కొన్నారు. మున్సిపాలిటీ పారిశుద్ధ్య నిర్వహణలో విఫలమైందని, చెత్తను సకాలంలో తొలగించకపోవడంతో దుర్వాసన, దోమల సమస్య పెరిగి ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందని ఆరోపించారు. ఈ



కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు విట్టల్ రావు మాజీ మున్సిపల్ చైర్మన్ నజీ బ్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నగేష్ సెట్. కో ఆప్షన్ సభ్యులు లయక్ రాజు నాయక్, రవీందర్ నల్గొండ తదితరులు పాల్గొన్నారు.




## యాపిల్ అప్‌గ్రేడ్ ప్లాన్.. ఇక నెలవారీ అద్దె చెల్లింపులు

**న్యూఢిల్లీ:**ప్రముఖ టెక్ దిగ్గజం యాపిల్ తన మ్యాక్‌బుక్ ఐప్యాడ్ ధరలను ఇటీవలే భారీగా పెంచింది. తాజాగా ఐఫోన్ ధరల పెంపు చేపట్టనున్నట్లు తెలుస్తోంది. దీంతో సాధారణ వ్యక్తి ఐఫోన్ కొనాలంటే ఆలోచించాల్సిన పరిస్థితి. అయితే, వినియోగదారులకు ఊరటనిచ్చేలా యాపిల్ ఓ కొత్త ప్లాన్ తీసుకొచ్చింది. యాపిల్ అప్‌గ్రేడ్ పేరిట డివైజ్ లీజింగ్ ప్రోగ్రామ్‌ను లాంచ్ చేసింది. అంటే ఎంపిక చేసిన కంపెనీ ఉత్పత్తులను లీజ్‌కు తీసుకోవాలంటే.. నెలవారీ ప్రాతిపదికన కొంత మొత్తాన్ని అద్దె రూపంలో చెల్లించాల్సి ఉంటుంది.

యాపిల్ అప్‌గ్రేడ్ ప్లాన్ వివరాలివే...

ఎంపిక చేసిన ఐఫోన్, యాపిల్ వాచ్ కొనుగోలుపై ఒకేసారి పూర్తి నగదు చెల్లించాల్సిన అవసరం లేదు. 12 నెలలు, 24 నెలలు లేదా 36 నెలల వ్యవధిలో వాయిదాల పద్ధతిలో కొంత అద్దె చెల్లించాలి. యాపిల్ కార్డు హోల్డర్స్‌కు 3 శాతం క్యాష్‌బ్యాక్ ఉంటుందని కంపెనీ పేర్కొంది. లీజు గడువు ముగిశాక.. వినియోగదారులు మిగిలిన మొత్తాన్ని చెల్లించి సదరు డివైజ్‌లను సొంతం చేసుకోవచ్చు. లేదంటే ఆ డివైజ్‌లను కంపెనీకి ఇచ్చేసి లీజు నుంచి తప్పుకోవచ్చు. లేదా ఆ పరికరాన్ని ఇచ్చేసి కొత్త మోడల్ కోసం మరో ఒప్పందాన్ని కుదుర్చుకోవచ్చు.వినియోగదారులు ఆన్‌లైన్‌లో లేదా యాపిల్ స్టోర్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే దరఖాస్తుదారులకు సాఫ్ట్ క్రెడిట్ ఎంక్వైరీని తప్పనిసరి చేసింది. ఐఫోన్17 మోడళ్లు, యాపిల్ వాచ్ సిరీస్11, అల్ట్రా 3, మ్యాక్‌బుక్ ఎయిర్ ఎం5 చిప్, ఐప్యాడ్ ఎయిర్ ఉత్పత్తులపై ఆఫర్లు అందిస్తోంది.ఎంపిక చేసిన మోడళ్లపై నెలకు 11.99 డాలర్ల నుంచి 24.99 డాలర్ల మధ్య అద్దె ధరలు నిర్ణయించింది. (భారత కరెన్సీ ప్రకారం.. రూ. 1148 నుంచి రూ.2400)ఈ ప్లాన్‌ను ప్రస్తుతం అమెరికాలో తీసుకొచ్చింది. దశలవారీగా భారత్‌లోనూ విస్తరించే అవకాశం ఉంది.

# ఐటీలో కొనుగోళ్ల జోష్..

## భారీ లాభాల్లో ముగిసిన సూచీలు

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి అంతర్జాతీయంగా ప్రతికూల సంకేతాలు ఉన్నప్పటికీ.. ఐటీ, ఎఫ్ఎంసీజీ, మెటల్, బ్యాంకింగ్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. విదేశీ మదుపర్ల పెట్టుబడులూ కలిసొచ్చాయి. దీంతో సెన్సెక్స్ 888 పాయింట్లు ఎగబాకగా.. నిఫ్టీ 24,250 మార్కును చేరింది. సెన్సెక్స్ 888.68 పాయింట్ల లాభపడి 77, 654.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 264.85 పాయింట్లు ఎగబాకి 24,250.20 వద్ద ముగిసింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.64 వద్ద ఉంది. సెన్సెక్స్ 30లో ఆదానీ పోర్ట్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, పవర్ గ్రిడ్, బీఈఎల్, ఎన్‌టీపీసీ షేర్లు తప్ప మిగతా స్టాక్స్ లాభాలను ఆర్జించాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ 87.65 డాలర్ల వద్ద కొనసాగుతుండగా..బంగారం ఔన్స్ 4,031.84 డాలర్ల వద్ద కదలాడుతోంది.

**కారణాలు ఇవీ..**

ఏఐ రంగంలో ఇంతకాలం భారీగా పెట్టుబడులు పెట్టిన మదుపర్లు.. అక్కడ ఆశించిన స్థాయిలో ప్రతిఫలాలు రావేమోనని ఇప్పుడు ఐటీ స్టాక్స్‌వైపు మొగ్గుచూపుతున్నారు. నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు ఐటీ, బ్యాంకింగ్ షేర్లను కొనుగోలు చేశారు. విదేశీ పెట్టుబడిదారులు భారత్ మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది. మరోవైపు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతారన్న అంచనాలు మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరచాయి.



**అనిశ్చితులున్నా.. భారీ లాభాల్లో**

దేశీయ మార్కెట్లు బుధవారం భారీ లాభాల్లో ప్రారంభమయ్యాయి అంతర్జాతీయంగా అనిశ్చితులు కొనసాగుతున్నప్పటికీ.. సూచీలు లాభాల్లో కదలాడుతున్నాయి. నిఫ్టీ 24వేలపైన ప్రారంభమైంది.ఉదయం 9.35 గంటల సమయంలో సెన్సెక్స్ 717 పాయింట్లు ఎగబాకి.. 77,493 వద్ద కదలాడుతోంది. నిఫ్టీ 207 పాయింట్ల లాభంతో 24,192 వద్ద ట్రేడవుతోంది. రూపాయి కాస్త కోలుకుంది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 95.70గా ఉంది. నిఫ్టీ సూచీలో లార్సెన్, హెచ్‌యూఎల్, ఇన్ఫోసిస్, భారతీ ఎయిర్‌టెల్, టాటా కన్జ్యూమర్ ప్రొడక్ట్స్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, కోల్ ఇండియా, పవర్ గ్రిడ్ కార్పొరేషన్, ట్రెంట్ స్టాక్స్ నష్టపోతున్నాయి. కృత్రిమమేధ రంగంవైపు ఇంతకాలం పెట్టుబడిపెట్టిన మదుపర్లు.. ఇప్పుడు ఐటీస్టాక్స్ వైపు మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలోనే నేటి ట్రేడింగ్‌లో మదుపర్లు ఐటీ షేర్లను కొనుగోలు చేశారు. విదేశీ పెట్టుబడిదారులు భారత్ మార్కెట్‌లో స్టాక్స్ కొనుగోలు చేయడమూ కలిసొచ్చింది. మరోవైపు యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లను యథాతథంగా ఉంచుతారన్న అంచాలున్నాయి. పెరిగిన ముడిచమురు ధరలు: అమెరికా ముడిచమురు నిల్వలు తగ్గడం, పశ్చిమాసియాలో మరోసారి ఉద్రికత్తలు పెరడగంతో క్రూడ్ ఆయిల్ ధరలు మూడు శాతం మేర పెరిగాయి. బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ ఒక బ్యారెల్‌కు 86 డాలర్లకు చేరింది.

## బీఎండబ్ల్యూలో లేఆఫ్‌లు.. 8000 ఉద్యోగాల కోత!

ప్రముఖ ప్రీమియం కార్ల తయారీ కంపెనీ బీఎండబ్ల్యూ భారీగా లేఆఫ్‌లకుసిద్ధమవుతోంది. జర్మనీలోని తమ సంస్థలో దాదాపు 8 వేల ఉద్యోగులను తొలగించనున్నట్లు ప్రకటించింది. తొలగించిన వారికి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ ప్యాకేజీ ఇవ్వనున్నారు. కంపెనీ కార్ల డిమాండ్ తగ్గడంతో వ్యయాల భారాన్ని తగ్గించుకునేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు పేర్కొన్నాయి. జర్మనీలోని 8 వేల మందిని ఉద్యోగులను 2027 చివరినాటికి తొలగించే అవకాశం ఉంది. ఇది ఆ సంస్థ మొత్తం ఉద్యోగుల సంఖ్యలో సుమారు 5 శాతం. ఉద్యోగుల తొలగింపు ఈ ఏడాది అక్టోబరు నుంచి ప్రారంభం కానుంది. డెస్క్ ఆధారిత సిబ్బందికే ఇది వర్తించనుంది. ఈ అంశంపై ఇప్పటికే కంపెనీ బోర్డు, వర్క్ కౌన్సిల్ సభ్యుల మధ్య చర్చలు జరిగినట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా బీఎండబ్ల్యూ కంపెనీకి 150,000 మంది ఉద్యోగులు ఉన్నారు. ఎలక్ట్రిక్ కార్ల విక్రయాల లాభాల మార్జిన్లు తగ్గడం, అమెరికా టారిఫ్‌లు, చైనా నుంచి ఎదురవుతున్న పోటీ కారణంగానే బీఎండబ్ల్యూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.



**గుడ్ల ధరలు**

హైదరాబాద్ ₹ 5.40

వరంగల్ ₹ 5.42

**బంగారం ధరలు (10 గ్రాములు)**

హైదరాబాద్

₹ 1,54,236 (22 క్యారెట్లు)

₹ 1,67,180 (24 క్యారెట్లు)

**వెండి ధరలు (కేజీ)**

హైదరాబాద్

₹ 2,40,000

## 8 ఏళ్లు జీతం తీసుకోలేదు..

### ఇప్పుడేమో బిలియనీర్..!

**వాషింగ్టన్:**ఆధునిక సాంకేతిక ప్రపంచంలో 'బ్రెయిన్'గా పరిగణించే చిప్‌ల కోసం చైనా ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించాలనుకున్నారు ఝు యిమింగ్ అందుకోసం 2016లో కంపెనీని ప్రారంభించారు. శాంసంగ్, ఎస్‌కే హైనిక్స్, మైక్రాన్ వంటి సంస్థల సరసన నిలవాలని కలగన్నారు. ఇది నెరవేరాలంటే.. ఎంతో సహనం అవసరం.. పరిశోధన చేయాలి.. బిలియన్ డాలర్లు కావాలి. ఈక్రమంలో 8 ఏళ్లు వేతనం తీసుకోలేదు. అలాంటి కంపెనీపై ఇప్పుడు కాసుల వర్షం కురుస్తోంది. ఆ కంపెనీ భాగస్వామ్యం కోసం యాపిల్ సంస్థ ఎదురుచూస్తోంది..! ఝు యిమింగ్ 2016లో ప్రారంభించిన చాంగ్‌గ్జిన్ మెమోరీ టెక్నాలజీస్ కంపెనీ పేరు రెండ్రోజులుగా అంతర్జాతీయంగా మారుమోగుతోంది. ఆ సంస్థ షేర్లు షాంఘై స్టాక్ ఎక్స్ఛేంజీ లిస్టింగ్‌లో అదరగొట్టాయి. అరంగేట్రం చేసిన వెంటనే షేర్ ధర 500 శాతం వరకు ఎగబాకింది. తన దేశానికి చిప్ కొరత తీర్చేలా ప్రపంచస్థాయి కంపెనీలతో పోటీపడేలా చైనీస్ మెమోరీ చిప్ (ఆఖీంఓ)ను తయారు చేయాలన్నది నాడు యిమింగ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అచీటని స్థాపించడానికి ముందే ఆయనొక విజయవంతమైన వ్యాపారవేత్త. చింగ్‌వా యూనివర్సిటీ (చైనా ఎంఐటీగా పిలుస్తారు)లో భౌతికశాస్త్రాన్ని అభ్యసించారు. తర్వాత అమెరికాకు వెళ్లి ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ చేశారు.సిలికాన్ వ్యాలీలో తన వృత్తి జీవితాన్ని ప్రారంభించిన ఆయన.. తర్వాత చైనాకు తిరిగివచ్చి 2005లో ఫ్లాష్ మెమోరీ చిప్ తయారీ సంస్థ గిగా డివైజ్‌ను ఏర్పాటు చేశారు. దానిని విజయంతంగా ముందుకు నడిపించారు. కానీ, ఆయన ప్రయాణం అక్కడితో ఆగిపోలేదు. సెమీకండక్టర్ రంగంలో చైనా ప్రభుత్వం పెట్టుబడులను ప్రోత్సహిస్తున్న తరుణంలో ఆ అవకాశాన్ని అందిపుచ్చుకొని అచీటని స్థాపించారు. ఫ్యాబ్రికేషన్ ప్లాంట్ల నిర్మాణం, మెమోరీ చిప్‌ల అభివృద్ధి, తయారీని మెరుగుపర్చడం వంటి విభాగాలపైనే భారీగా డబ్బు వెచ్చించాల్సి వచ్చింది. ఆదాయం లేకుండా పోయింది. దాంతో సంస్థ లాభాల్లోకి వచ్చే వరకూ జీతం, బోనస్‌లు తీసుకోనని యిమింగ్ ప్రతిజ్ఞ చేసినట్లు సన్నిహితులు చెప్తుంటారు. సుదీర్ఘకాలం ఆయన చేసిన ప్రయత్నాలకు ఫలితం దక్కింది. ప్రస్తుతం ఆయన స్టోరీ చైనాలో ఒక విజయ గాథగా మారిపోయింది. తాజా లిస్టింగ్‌తో ఆ కంపెనీ విలువ 3.3 ట్రిలియన్ యువాన్లకు చేరింది. ట్రేడింగ్‌లో ఒక దశలో చైనాలోనే అత్యంత విలువైన సంస్థగా నిలిచింది. అదే సమయంలో ఝు వ్యక్తిగత సంపద 15 బిలియన్ డాలర్లు దాటింది.అలాగే సెమీకండక్టర్ మార్కెట్‌లో ఇప్పటికే ఉన్న సంస్థలకు సవాలు విసురుతోంది స్మార్ట్‌ఫోన్స్, ల్యాప్‌టాప్స్, సర్వర్స్, ఏఐ డేటా సెంటర్లలో వాడే మెమోరీ చిప్స్‌ను తయారు చేస్తోంది. ఏఐ సిస్టమ్స్‌లో ఉపయోగించే అధునాతన హై బ్యాండ్ విడ్త్ మెమోరీ చిప్స్ తయారీ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పుడు టెక్ దిగ్గజం యాపిల్ ఈ చైనా కంపెనీతో భాగస్వామ్యం కుదుర్చుకోవాలని చూస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. అయితే ఈ కథనాలపై




# బంగారు కొండ

## ఆర్‌బీఐ పసిడి నిల్వలు 880 టన్నులు

**న్యూఢిల్లీ:**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) వద్ద 880.52 టన్నుల బంగారు నిల్వలున్నాయి. 2025 మార్చి 31తో పోలిస్తే, 2026 మార్చి 31 నాటికి 0.94 టన్నుల పసిడి నిల్వలే పెరిగినట్లు కేంద్ర ఆర్థికశాఖ సహాయమంత్రి పంకజ్ చౌధ్రీ రాజ్యసభకు తెలిపారు. గత రెండేళ్లతో పోలిస్తే ఇదే కనిష్ఠ వృద్ధి అని తెలిపారు. విదేశీ మదుపర్లు లాభాలు స్వీకరించడంతో పాటు ఓవర్సీస్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ (ఓడీఐ) బయటకు వెళ్లడం వల్లే ఇటీవలి కాలంలో నికర విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) తగ్గాయని ప్రభుత్వం తెలిపింది. 2022-23లో నికర ఎఫ్‌డీఐలు 27.99 బిలియన్ డాలర్లుగా ఉండగా, 2025-26 నాటికి 6.95 బిలియన్ డాలర్ల (అప్పటి మారకపు విలువ ప్రకారం రూ.62,550 కోట్ల)కు పరిమితమయ్యాయని ఆర్థిక సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ తెలిపారు. 2023-24లో 10.13 బి.డాలర్లకు, 2024-25లో 960 మి.డాలర్లకు ఇవి చేరాయన్నారు. స్థూలంగా చూస్తే 2025-26లో 94.84 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు వచ్చాయి. 2024-25లో ఇవి 80.61 బి.డాలర్లుగా ఉన్నాయి. విదేశాల్లో తమ వ్యాపారాలను విస్తరించుకోవడానికి భారతీయ కంపెనీలకు వీలు కల్పిస్తూ 2022లో ఓడీఐ నిబంధనలను సరళీకరించడం వల్ల ఉపసంహరణలు పెరిగాయని ఆయన వివరించారు. డాలరుతో పోలిస్తే రూపాయి నెలవారీ సగటు మారకపు విలువ 2014 మేలో రూ.59.3గా, 2026 మే లో రూ.95.6గా ఉందని వివరించారు.కరెంట్, సేవింగ్స్ ఖాతాల్లో కనీస సగటు నిల్వ ఉంచడంలో విఫలమైన ఖాతాదారుల నుంచి 2025-26లో ప్రైవేట్ రంగ బ్యాంకులు ఏకంగా రూ.4,948.71 కోట్లు వసూలు చేశాయి. ఇదే సమయంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కూడా ఖాతాదారుల నుంచి ఈ రూపేణ రూ.2,137.92 కోట్లు వసూలు చేసినట్లు ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధ్రీ రాజ్యసభకు వెల్లడించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రూ.1,798.14 కోట్లు, యాక్సిస్ బ్యాంక్ రూ.1,081.33 కోట్లు వసూలు చేసి, తొలి రెండో స్థానాల్లో ఉన్నాయి.



**రూ.75,000 కోట్ల ఐటీసీ మోసం**

2025-26లో ఐటీసీను తప్పుడు పద్ధతిలో క్లెయిమ్ చేసుకోవడం ద్వారా రూ.75,000 కోట్ల మోసానికి పలువురు పాల్పడ్డారని మంత్రి తెలిపారు. 30,162 కేసులు నమోదుకాగా.. మహారాష్ట్ర, గుజరాత్‌లోనే అత్యధికంగా జరిగాయని వెల్లడించారు. దేశ వస్తు వాణిజ్య లోటును, వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థకు దిగుమతి అవసరాల ప్రతిబింబంగా చూడాలని తెలిపారు. ప్రతిపాదిత కస్టమ్స్ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్‌ను (సీఐసీ) ప్రారంభించే నిమిత్తం ఇంప్లిమెంటేషన్ ఏజెన్సీని ఎంపిక చేసే ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

## ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా యాపిల్

**వాషింగ్టన్:**ప్రపంచంలోనే అత్యంత విలువైన కంపెనీగా మళ్లీ యాపిల్ నిలిచింది. ఇతర బిగ్ టెక్ సంస్థలతో పోలిస్తే ఏఐ మౌలిక వసతులపై చాలా తక్కువ పెట్టుబడులు పెడుతున్నా, చిప్ తయారీ సంస్థ ఎన్‌విడియాను అధిగమించి మరీ అగ్రస్థానానికి చేరింది. కృత్రిమే మేధ(ఏఐ) బూమ్‌తో కొద్ది కాలంగా భారీగా పెరిగిన ఎన్‌విడియా షేర్లు సోమవారం 5% నష్టపోయాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ 4.77 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.456 లక్షల కోట్లు)కు పరిమితమైంది. అదే సమయంలో యాపిల్ షేర్లు రాణించడంతో సంస్థ మార్కెట్ విలువ 4.95 లక్షల కోట్ల డాలర్ల(దాదాపు రూ.475 లక్షల కోట్ల)కు చేరి, అగ్రస్థానానికి ఎదిగింది. ఈనెల 17న సైతం ఎన్‌విడియాను యాపిల్ కొద్దిసేపు అధిగమించినా, మళ్లీ వెనక్కివెళ్లింది. ఏడాది కాలంగా ఎన్‌విడియానే ప్రపంచంలో అత్యంత విలువైన కంపెనీగా కొనసాగుతూ వచ్చింది. ఏఐ నమూనాలకు అవసరమయ్యే గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్ల (జీపీయూల)కు భారీగా గిరాకీ రావడం కంపెనీకి కలిసివచ్చింది. 2025 అక్టోబరులో, తొలి సారిగా 5 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ విలువను అధిగమించిన మొదటి కంపెనీగానూ ఎన్‌విడియా అవతరించింది. ఇపుడేం జరుగుతోంది: ఏఐ మౌలిక ప్రాజెక్టుల వ్యయాలకు తగ్గ ప్రతిఫలంపై ఆందోళనలు పెరిగి, ఎన్‌విడియా షేర్లు ఒత్తిడిలోకి వెళ్లాయి. ఒహాయోలో ఓపెన్‌ఏఐ డేటా సెంటర్ ప్రాజెక్టుకు 250 బిలియన్ డాలర్ల ఫైనాన్షియల్ గ్యారెంటీపై ఎన్‌విడియా చర్చిస్తోందని వాల్‌స్ట్రీట్ జర్నల్ పేర్కొంది. ఏఐ విస్తరణకు సంబంధించి ఆర్థిక భారం పెరుగుతోందని ఇన్వెస్టర్లు ఆందోళన చెందుతున్నట్లూ తెలిపింది.

## దేవాదాయ శాఖలో మరోసారి పదోన్నతుల పండుగ

హైదరాబాద్,జూలై29(జనంసాక్షి): దేవాదాయశాఖ ఉద్యోగుల హక్కుల పరిరక్షణ, అర్చకుల సంక్షేమం, దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలుచేస్తున్నామని అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి శ్రీమతి కొండా సురేఖ గారు తెలిపారు. ఈ రోజు బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్(ఆడిటోరియం వేదికగా జరిగిన ఉద్యోగుల పదోన్నతుల కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వీరిలో 48 మంది ఉద్యోగులు గ్రేడ్ 3 ఈవోలుగా, ఇద్దరు గ్రేడ్ 2 ఈవోలుగా, ఒకరు గ్రేడ్ 1 ఈవోలుగా మంత్రి సురేఖ గారి చేతుల మీదుగా పదోన్నతుల ఉత్తర్వులను అందుకున్నారు. వీరితో పాటు అర్చక సంక్షేమ నిధి ద్వారా అర్హులైన 15 మంది అర్చకులకు (వారి కటుంబ సభ్యులు) పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీ, వివాహ రుణం మంజూరు ఉత్తర్వులను మంత్రి సురేఖ గారు అందించారు. కార్యక్రమంలో దేవాదాయశాఖ డైరక్టర్ హనుమంతరావు, రాష్ట్ర దేవాలయ పాలనా సంస్థ డైరక్టర్ చిలకపాటి విజయ రాఘవాచార్యులు, ఆర్‌జెసి రామకృష్ణారావు, డిప్యూటి కమిషనర్ వినోద్ రెడ్డి, అడిషనల్ కమిషనర్లు జ్యోతి, శ్రీనివాస్, ఈవోల సంఘం అధ్యక్షుడు నరేందర్, టెంపుల్ ఎంఎ÷-లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగారెడ్డి, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇవాళ గ్రేడ్ 3 ఈవోలుగా పదోన్నతులు అందుకున్నవారితో కలిపి, గతంలో గ్రేడ్ 1, గ్రేడ్ 2 కేటగిరీల్లోనూ పదోన్నతులు ఇవ్వడం ద్వారా మొత్తం 168 మంది ఉద్యోగులకు కార్యనిర్వహణాధికారులుగా పదోన్నతి కల్పించి, ఉద్యోగుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. సరిగ్గా పది రోజుల క్రితం రవీంద్రభారతి వేదికగా వేదపండితులు, అర్చకులు, పరిచారకులు, డోలు, సన్నాయి కళాకారులు తదితర 191 ధార్మిక నియామక ఉత్తర్వులు అందజేసిన విషయాన్ని మంత్రి సురేఖ గుర్తు చేశారు. తెలంగాణ ప్రజా ప్రభుత్వ నిబద్ధతకు ఇది నిదర్శనమని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. అర్చక సంక్షేమ నిధి కింద పదవీ విరమణ, మరణ గ్రాట్యుటీని రూ.8 లక్షల నుంచి రూ.12 లక్షలకు పెంచడంతో పాటు అంత్యక్రియల సహాయాన్ని రూ.20 వేల నుంచి రూ.30 వేలకు పెంచి అర్చక కుటుంబాలకు మరింత భరోసా కల్పించామని మంత్రి తెలిపారు. సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించామని, గోదావరి పుష్కరాలు (2027), కృష్ణ పుష్కరాలు (2028) కోసం ఇప్పటికే ప్రణాళికా బద్ధంగా కార్యాచరణను అమలు చేస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు.

## ఇథనాల్ వాడితే.. కొన్ని పరికరాలు మార్చాల్సి రావొచ్చు :గడ్కరీ



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ఈ20 పెట్రోల్ వినియోగించే (2016కు ముందు తయారైన) బీఎస్-3 వాహనాల్లో చిన్నపాటి రిపేర్లు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లు మార్చాల్సి రావచ్చని తెలిపింది. వాహన పనితీరు, మన్నిక, మైలేజీని అది అధిక స్థాయిలో ప్రభావితం చేయదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఐఓసీఎల్, ఐఐపీ- డెహ్రాడూన్, సియామ్, ఏఆర్ఏఐ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల్లో ఈ20 ఇంధనం వినియోగించే వాహనాల ఇంజిన్‌లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలిందన్నారు.ఈ20 అమలుకు ముందు విస్తృత స్థాయిలో ప్రయోగశాల పరీక్షలు, ఫీల్డ్ ట్రయల్స్, మన్నిక పరీక్షలు నిర్వహించినట్లు గడ్కరీ తెలిపారు. అంతా బాగుందని తెలిసిన తర్వాతే దశల వారీగా దేశవ్యాప్తంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ20 పెట్రోల్ వినియోగించే పాత వాహనాల్లోనూ (2016కు ముందు తయారైన) పనితీరు, ఇంజిన్ అరిగిపోవడం, స్టార్టబిలిటీ, లోహాలు, ప్లాస్టిక్ భాగాల అనుకూలత వంటి అంశాల్లో సమస్యలు కనిపించలేదని వివరించారు.

## టెక్ దిగ్గజాలను బెంబేలెత్తిస్తున్న చైనా ఏఐ

### అమెరికా చిప్ కంపెనీల షేర్ల పతనం
### పరోక్ష కంపెనీల్లో పెట్టుబడులు మేలు
### జెఫ్రీస్ స్ట్రాటజీ హెడ్ క్రిస్టోఫర్ ఉడ్

బీజింగ్:చైనా నుంచి వస్తున్న చౌక కృత్రిమ మేధ (ఏఐ) మోడళ్లు అమెరికా స్టాక్ మార్కెట్లలోని భారీ పెట్టుబడులను దెబ్బతీసే అవకాశం ఉందని ఆందోళనలు పెరుగుతున్నాయి. ఏఐ వ్యవస్థలకు కావాల్సిన మూలధనం కోసమే అమెరికా కంపెనీలు ఏడాది కాలంగా భారీగా అప్పులు చేస్తుండగా, ప్రతిఫలంపై సందేహాలు తలెత్తుతున్నాయి. ఈ ఏడాదిలో టెక్ సంస్థలు 194 బి.డాలర్ల (రూ.18.57 లక్షల కోట్లు) రుణాలను సేకరించగా, ఇంధన రంగ సంస్థలు 55 బి.డాలర్ల (రూ.5.26 లక్షల కోట్లు) అప్పులే చేశాయి. ఈ నేపథ్యంలో 'ఏఐ రంగంలో నేరుగా మూలధనం వెచ్చిస్తున్న కంపెనీల్లో బదులు, వాటివల్ల పరోక్షంగా లాభపడే కంపెనీల్లో పెట్టుబడులు పెట్టడం మంచిద'ని ఆర్థిక సేవల సంస్థ జెఫ్రీస్ గ్లోబల్ ఈక్విటీ స్ట్రాటజీ హెడ్ క్రిస్టోఫర్ ఉడ్ హెచ్చరించారు. ఇటీవల వరకు కంపెనీలు తమ ఉద్యోగులను ఏఐ మోడళ్లతో ప్రయోగాలు చేయమని ప్రోత్సహించేవని, ఇప్పుడు ఆ ఖర్చులు తగ్గించుకుంటున్నాయని వివరించారు. దీనివల్ల జూన్‌లో ఆంత్రోపిక్, ఓపెన్ ఏఐ వంటి ప్రముఖ ఏఐ కంపెనీల నెలవారీ ఆదాయ వృద్ధి ఏ స్థాయిలో తగ్గిందో గమనించాల్సి ఉందన్నారు.మార్కెట్లు గుర్తించడం లేదు కానీ..: ప్రపంచవ్యాప్తంగా చైనాకు చెందిన లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు (ఎల్ఎల్ఎం) బాగా ప్రాచుర్యం పొందుతున్నాయని ఉడ్ తెలిపారు. జులై 19తో ముగిసిన వారంలో చైనా టాప్ ఏఐ మోడళ్లు.. ఓపెన్ రూటర్ ప్లాట్‌ఫారాల్లో ఏకంగా 36.39 లక్షల కోట్ల టోకెన్లను ప్రాసెస్ చేశాయి. ఏప్రిల్ నెలాఖరులో ఈ సంఖ్య కేవలం 4.37 లక్షల కోట్లు మాత్రమే. అమెరికాకు చెందిన అగ్రశ్రేణి 9 ఏఐ మోడళ్లు అదే వారంలో 7.39 లక్షల కోట్ల టోకెన్లనే ప్రాసెస్ చేశాయి. టెక్నాలజీ రంగంలో చైనా, అమెరికాకు సమాన స్థాయికి చేరిందనే విషయాన్ని మార్కెట్లు ఇంకా గుర్తించలేదని ఉడ్ అభిప్రాయపడ్డారు. అమెరికా, దక్షిణకొరియాల్లో కంగారే: చైనాలోని షాంఘై ఎక్స్ఛేంజీలో నమోదైన సీఎక్స్ఎంటీ (ఛాంగ్‌షిన్ మెమొరీ టెక్నాలజీస్) షేరు అరంగేట్రంలోనే 500% దూసుకెళ్లింది. కంపెనీ మార్కెట్ విలువ 540 బి.డాలర్లు (రూ.51.30 లక్షల కోట్లు)గా నమోదైంది. ఫలితంగా మంగళవారం నాటి ట్రేడింగ్‌లో దక్షిణ కొరియా స్టాక్ మార్కెట్ సూచీ కోస్పి ఏకంగా 11% పతనమైనంది. ట్రేడింగ్ మధ్యలో షేర్ల విలువలు భారీగా పడిపోవడంతో, ట్రేడింగ్ లావాదేవీలను కాసేపు నిలిపివేయాల్సి వచ్చింది. ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శామ్‌సంగ్ ఎలక్ట్రానిక్స్ షేర్లు 13.4%, చిప్ తయారీ సంస్థ ఎస్కే హైనిక్స్ షేర్లు 14.7% కుప్పకూలాయి. అమెరికాలో శాన్‌డిస్క్ షేరు 12%, మైక్రాన్ టెక్నాలజీ షేరు 9%, ఏఎండీ 8.5%, అప్లైడ్ మెటీరియల్స్ షేరు 8% కుప్పకూలాయి.



## 'కోస్పి'కి ఏమైంది..

### నెలలో ఏకంగా 43 శాతం పతనమై..!

**సియోల్:**అటు చైనా నుంచి ఏఐ పోటీ.. ఇటు చిప్ కంపెనీల పతనంతో దక్షిణ కొరియా ప్రధాన స్టాక్ మార్కెట్ సూచీ 'కోస్పి బెంబేలెత్తుతోంది. గత రెండు రోజులుగా ఈ సూచీ భారీగా కుదేలవుతోంది. ఫలితంగా కేవలం నెల రోజుల వ్యవధిలోనే రికార్డు గరిష్ఠాల నుంచి ఏకంగా 43 శాతానికి పైగా పతనమైంది. దీంతో మదుపర్ల సంపద దాదాపు సగం వరకు ఆవిరైంది. మంగళవారం నాటి ట్రేడింగ్‌లో 11 శాతం దిగజారిన కోస్పి.. బుధవారం కూడా పతనమైంది. నేటి మార్కెట్ ఆరంభంలో ఒక దశలో దాదాపు 12 శాతం కుంగి 5,311.77 వద్దకు పడిపోయింది. షేర్ల విలువలు భారీగా పడిపోవడంతో.. ట్రేడింగ్ లావాదేవీలను 20 నిమిషాల పాటు నిలిపివేశారు. జూన్‌లో ఈ సూచీ రికార్డు స్థాయిలో 9,386 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది. అక్కడి నుంచి పోలిస్తే.. ప్రస్తుతం దీని విలువ 43శాతానికి పైగా తగ్గడం గమనార్హం. ఉదయం 11.30 గంటల సమయానికి కాస్త కోలుకున్న సూచీ 8 శాతం నష్టంతో 5,497 వద్ద ట్రేడ్ అవుతోంది.చైనా నుంచి వస్తున్న చౌక కృత్రిమ మేధ (ఏఐ) మోడళ్లు అమెరికా స్టాక్ మార్కెట్లలోని భారీ పెట్టుబడులను దెబ్బతీసే అవకాశం ఉందని జెఫ్రీస్ గ్లోబల్ ఈక్విటీ స్ట్రాటజీ సంస్థ అంచనా వేసింది.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 జూలై 2026

# ఎల్‌నినో కాదు.. ప్రభుత్వ వైఫల్యంతోనే కరువు

- రైతులను భయపెట్టడం మానేసి జూరాల జలాలు విడుదల చేయాలి
- 19 నియోజకవర్గాల సాగుకు నీరు అందుబాటులోనే ఉందన్న నిరంజన్ రెడ్డి
- పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్లక్ష్యం చేశారని విమర్శ
- సాగునీటిపై స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నేతల డిమాండ్



**వనపర్తి బ్యూరో, జూలై 29 (జనంసాక్షి):** రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితులకు ఎల్‌నినో ప్రభావం కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలు, నిర్లక్ష్య వైఖరే ప్రధాన కారణమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆరోపించారు. జూరాల ప్రాజెక్టుకు వస్తున్న వరద జలాలను వెంటనే సాగుకు విడుదల చేసి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్మకూరు మండల కేంద్రంలోని మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్ నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.

రాష్ట్రంలో వర్షాలు తక్కువగా ఉన్నాయంటూ రైతులను పంటలు వేయొద్దని భయపెట్టడం బాధ్యతారాహిత్యమని నిరంజన్ రెడ్డి విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందిస్తే గత ప్రభుత్వానికి పేరు వస్తుందనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం నీటి విడుదలను నిలిపివేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో నీటి కొరత ఉందనే భ్రమను ప్రభుత్వం సృష్టిస్తోందని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో కొంత వర్షాభావ పరిస్థితి ఉన్నప్పటికీ పశ్చిమ కనుమల్లో కురిసే వర్షాలతో కృష్ణా, తుంగభద్ర, భీమా నదులకు సమృద్ధిగా ప్రవాహాలు వస్తాయని పేర్కొన్నారు. తుంగభద్ర నుంచి శ్రీశైలానికి సుమారు 400 టీఎంసీల నీరు చేరే అవకాశం ఉందని, ప్రస్తుతం అందుబాటులో ఉన్న జలాలతో సాగు అవసరాలను సులభంగా తీర్చవచ్చని తెలిపారు.

జూరాల జలాలతో 19 నియోజకవర్గాల సాగునీటి అవసరాలు తీర్చవచ్చని, వచ్చే జూన్ వరకు మిషన్ భగీరథ తాగునీటి సరఫరా కు కూడా ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. ఆలమట్టి, నారాయణపుర ప్రాజెక్టులు ఇప్పటికే నిండిపోయాయని గుర్తు చేస్తూ రైతులు నీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి తేవొద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని రోజుకు రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేలా రూపొందించామని, 90 శాతం పనులు పూర్తయిన తర్వాత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు. జూరాల నుంచి ఈ సీజన్ మొత్తం కాలువలకు నీరు విడుదల చేయడంతో పాటు కేఎల్ఐలో మూడు పంపులను నిరంతరాయంగా నడపాలని డిమాండ్ చేశారు. పాలమూరుకు నీటికి మించిన అంశం మరొకటి లేదని, దీనిపై రాజకీయాలు చేయడం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో వరద పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించేవారని చెప్పారు. ప్రస్తుతం వరద వచ్చిన మూడు రోజుల తర్వాతే పంపులను ప్రారంభించడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి సీజన్‌లో రైతులు సాగునీటి కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. బీఆర్ఎస్ ఉద్యమం ప్రకటించగానే అధికారులు కాలువలకు నీరు విడుదల చేయడం ప్రభుత్వ వైఖరిని బహిర్గతం చేస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, పార్టీ అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గాయత్రి రవికుమార్, మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ వామన్ గౌడ్, పలుస రమేష్ గౌడ్, మాజీ జెడ్పీటీసీ విశ్వేశ్వర్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# ఉప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు మహర్దశ

- రూ.3.20 కోట్లతో ఆధునికీకరణ పనులకు ఆమోదం
- సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో నిధుల మంజూరు
- ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి అందుబాటులోకి అత్యాధునిక సౌకర్యాలు

**ఉప్పల్, జూలై 29 (జనంసాక్షి):** ఉప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు మహర్దశ పట్టనుంది. ప్రస్తుతం పరిమిత సౌకర్యాలతో కొనసాగుతున్న బస్‌స్టేషన్‌ను రూ.3.20 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో అభివృద్ధి చేయనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు విడుదలైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి కృషి ఫలితంగానే ఈ అభివృద్ధి పనులకు ఆమోదం లభించిందని పేర్కొన్నారు.

అభివృద్ధి పనుల్లో భాగంగా బస్‌స్టేషన్‌ను పూర్తిస్థాయిలో ఆధునికీకరించి ప్రయాణికులకు మెరుగైన వసతులు కల్పించనున్నారు. బస్సుల రాకపోకలు సులభంగా సాగేందుకు అదనపు డ్రైవ్‌వేలు, కొత్త ప్లాట్‌ఫారమ్‌లు ఏర్పాటు చేయనున్నారు.

బస్సుల నిలిపివేత, ప్రయాణికుల రాకపోకలను క్రమబద్ధీకరించేలా ప్రత్యేక ప్రణాళికను అమలు చేయనున్నారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించే చర్యలు కూడా చేపట్టనున్నారు. ప్రయాణికుల కోసం విశాలమైన నిరీక్షణ మందిరాలు, డిజిటల్ సమాచార బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ల కోసం ప్రత్యేక విశ్రాంతి గదులు, భోజనశాల వంటి సౌకర్యాలను కూడా ఏర్పాటు చేయనున్నారు. విధుల మధ్య సిబ్బంది విశ్రాంతి తీసుకునేలా అవసరమైన మౌలిక వసతులు కల్పించనున్నారు. బస్‌స్టేషన్ ప్రాంగణానికి కాంపౌండ్‌వాల్ నిర్మించి భద్రతను మరింత పటిష్ఠం చేయడంతో పాటు పరిసరాలను సుందరంగా తీర్చిదిద్దనున్నారు.

ఈ అభివృద్ధి పనులు పూర్తయితే ఉప్పల్ ఆర్టీసీ బస్‌స్టేషన్ ఆధునిక రూపును సంతరించుకుని, నియోజకవర్గ ప్రజలకు, ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన రవాణా కేంద్రంగా మారనుందని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. పెరుగుతున్న ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా చేపడుతున్న ఈ ఆధునికీకరణ పనులు ఉప్పల్ అభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా నిలవనున్నాయని వారు తెలిపారు.

# స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను పరిశీలించిన కమిషనర్లు



**శేరిలింగంపల్లి, జూలై 29 (జనంసాక్షి) :** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సిఎంసి) కమిషనర్ డాక్టర్ జి. సృజన సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ ఎఫ్‌డిడిఐ బాక్స్ డ్రెయిన్, మల్కం చెరువు, సిఓడి జంక్షన్ మరియు బాటా జంక్షన్ ప్రాంతాల్లో కొనసాగుతున్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్ పనులను బుధవారం సంయుక్తంగా పరిశీలించి, పనుల పురోగతి మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధిని సమీక్షించారు. ఈ తనిఖీలో సైబరాబాద్ ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్ ప్రీత్ సింగ్, శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్, డిప్యూటీ కమిషనర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ విభాగం మరియు పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం సి కమిషనర్ మాట్లాడుతూ ఎఫ్‌డిడిఐ బాక్స్ డ్రెయిన్ సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లో రెక్టాంగ్యులర్ డక్ట్ సెక్షన్లతో క్యాచ్ పిట్లు నిర్మించాలని ఆదేశించారు. సిఓడి జంక్షన్ వద్ద క్యాచ్ పిట్లపై ఎంఎస్ గ్రిల్స్ ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని ఎత్తి చూపారు. బాటా జంక్షన్ వద్ద బావార్చి రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ఆర్‌సిసి క్యాచ్ పిట్ కవర్ల స్థానంలో ఎంఎస్ గ్రిల్స్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని అధికారులకు స్పష్టం చేశారు. ఎంకె ఎటర్నల్ మాల్ నుండి బాటా నాలావరకు ఉన్న స్టార్మ్ వాటర్ డ్రెయిన్‌ను బాక్స్ కల్వర్ట్‌గా అభివృద్ధి చేయాలని, మెట్రో కారిడార్ వెంబడి ఉన్న ఓవర్‌హెడ్ విద్యుత్ కేబుళ్లను మెట్రో పిల్లర్లకు మార్చే అవకాశాన్ని పరిశీలించాలని సూచించారు. గుర్తించిన పనులను సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో వేగవంతంగా చేపట్టి, నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని కమిషనర్ సృజన అధికారులను ఆదేశించారు. పనుల అమలులో శాఖలమధ్య సమన్వయాన్ని కొనసాగిస్తూ, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని ఆయా విభాగాల అధికారులకు సూచించారు.

# భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉండాలి

- క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ
- ప్రజల భద్రతే ప్రథమ ప్రాధాన్యం
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వి. పాటిల్

**ముషీరాబాద్, జూలై 29 (జనం సాక్షి):** రాష్ట్రంలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు, ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్న నేపథ్యంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో పనిచేయాలని టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ మింట్ కాంపౌండ్ నుంచి సీఈలు, ఎస్ఈలు, డీఈలతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో వర్షాల సమయంలో విద్యుత్ సరఫరా, ప్రజల భద్రత, అత్యవసర పరిస్థితుల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా అన్ని స్థాయిల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని, ముఖ్యంగా రీజియన్ పరిధిలో అధికారులు, ఆపరేషన్స్, మెయింటెనెన్స్ సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఎక్కడైనా విద్యుత్ వ్యవస్థకు నష్టం వాటిల్లినా వెంటనే స్పందించి భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సాధ్యమైనంత త్వరగా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని ఆదేశించారు. విద్యుత్ లైన్లకు సమీపంలోని ప్రమాదకర చెట్లు, విరిగే అవకాశం ఉన్న కొమ్మలను ముందుగానే గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో తొలగించాలని సూచించారు. సబ్‌స్టేషన్లు, 33 కేవీ, 11 కేవీ ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, తీగలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని, విద్యుత్ స్తంభాలు వంగడం, తీగలు తెగిపడటం, ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద స్పార్కింగ్ వంటి పరిస్థితులు కనిపిస్తే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశం చారు. ప్రజలు వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని సీఎండీ విజ్ఞప్తి చేశారు. ప్రమాదకర పరిస్థితులు కనిపిస్తే స్వయంగా సరిచేసే ప్రయత్నం చేయకుండా వెంటనే 1912 కాల్ సెంటర్ లేదా 8712441912 వాట్సాప్ నంబర్ ద్వారా టీజీఎస్పీడీసీఎల్‌కు సమాచారం అందించాలని కోరారు. విద్యుత్ సేవలకు సంబంధించిన వివరాలు అధికారిక వెబ్‌సైట్ ద్వారా కూడా పొందవచ్చని తెలిపారు.

## ప్రీతి ముకుందన్‌కు ఐఎండిబి 'బ్రేక్‌అవుట్ స్టార్' స్టార్‌మీటర్ అవార్డు



**ఖైరతాబాద్, జూలై 29 (జనం సాక్షి):** బహుభాషా నటి ప్రీతి ముకుందన్ కు ప్రముఖ సినీ డేటాబేస్ ఐఎండిబి ప్రతిష్ఠాత్మక 'బ్రేక్అవుట్ స్టార్' స్టార్‌మీటర్ అవార్డును ప్రకటించి ంది. 2024లో కెరీర్ ప్రారం భించిన ఆమె, తమిళ చిత్రాలు బ్లస్ట్, ఇదయం మురళి విజయాలతో ఐఎండిబి పాపులర్ ఇండియన్ సెలెబ్రిటీస్ జాబితాలో టాప్-10లో నిలిచింది. త్వరలో విడుదల కానున్న తెలుగు చిత్రం ఏ మో ఏమో ఇది, అలాగే అశోక్ సెల్వన్తో ఓ తమిళ చిత్రంలోనూ ఆమె నటిస్తోంది. ఈ సందర్భంగా ప్రీతి ముకుందన్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తం గా ప్రేక్షకుల ఆదరణతో లభించిన ఈ గుర్తింపు తనకు ఎంతో ప్రత్యేకమని, మరింత మంచి పాత్రలు ఎం చుకుని ప్రేక్షకుల మన్ననలు పొందేందుకు ఇది ప్రేరణనిస్తుందని తెలిపారు. ఇంతకుముందు ఈ అవార్డు అందుకున్నవారిలో ఆకాశ్ మఖిజా, రమ ణ్‌దీప్ యాదవ్, అంబరీష్ వర్మ, అహాన్ పాండే, అనీత్ పద్దా, మోనికా పన్వర్, జహాన్ కపూర్, కని కుస్రుతి, శార్వరి, నితాంషి గోయల్, ఆదర్శ్ గౌరవ్, అయో ఎడె బిరి, మాయా హాక్, రేగే-జీన్ పేజ్ ఉన్నారు.

## వాగులో పడి మహిళ మృతి

**శంషాబాద్,జూలై29(జనంసాక్షి)** పిల్లోనిగూడ గ్రామంలో వాగులో పడి ఓ మహిళ మృతి చెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఈ ఘటనపై పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేశారు. మృతురాలు బుద్దమొల్ల అంజమ్మ (49)గా గుర్తించారు. ఎల్లమ్మ గుడికి కొబ్బరికాయ కొట్టేందుకు వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించారు. బుధవారం గ్రామంలోని వెంటేరు వాగు వద్ద ఆమె చెప్పులు, కొబ్బరికాయ, వాటర్ బాటిల్ కనిపించగా, వాగులో ఆమె మృతదేహం తేలియాడుతూ కనిపించింది. ప్రమాదవశాత్తు కాలు జారి వాగులో పడి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేయగా, శంషాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రాయితీ విత్తనాలతో లాభసాటి సాగు చేయాలి

- ఆరుతడి, స్వల్పకాలిక పంటలపై రైతులు దృష్టి పెట్టాలి
- వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు తప్పనిసరిగా పాటించాలి
- రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి
- విత్తన మేళాలో రైతులకు విత్తనాల పంపిణీ



**నవాబుపేట, జూలై 29 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం అనిశ్చితంగా ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా స్వల్పకాలిక, ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకుని శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు సాగు చేపడితే మెరుగైన దిగుబడులతో పాటు లాభాలు పొందవచ్చని పేర్కొన్నారు. నవాబుపేట మండల కేంద్రంలోని రైతు వేదికలో మూడు రోజులపాటు నిర్వహిస్తున్న విత్తన మేళా, రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా వ్యవసాయ అధికారి కవిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రైతులకు కంది, పెసర, మినుము, సజ్జ, మొక్కజొన్న, ఆముదం, పొద్దుతిరుగుడు తదితర పంటల నాణ్యమైన విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య మాట్లాడుతూ తక్కువ నీటి వినియోగంతో పండే పప్పుదినుసులు, నూనెగింజల పంటలు, కూరగాయల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని సూచించారు. నానో యూరియా, నానో డీఏపీ వినియోగంతో ప్రయోజనాలు పొందవచ్చని తెలిపారు. మార్కెట్లో నకిలీ విత్తనాలు, ఎరువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుర్తింపు పొందిన కేంద్రాల నుంచే విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని సూచించారు. జిల్లా వ్యవసాయ అధికారి కవిత మాట్లాడుతూ రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రసీదులను తప్పనిసరిగా భద్రపరచుకోవాలని సూచించారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న విత్తన మేళాలను వినియోగించుకుని శాస్త్రవేత్తలు సూచించిన పంటలను సాగు చేయాలని కోరారు.

మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ భూమిలో తేమ, స్థానిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని పంటలను ఎంపిక చేసుకుంటే నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. ఆరుతడి పంటల సాగుతో మెరుగైన ఆదాయం పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. అనంతరం అధికారులు ఎత్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన రైతు జైపాల్‌రెడ్డి ఎనిమిది ఎకరాల్లో సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ తోటను పరిశీలించారు. ఆయిల్‌పామ్‌తో పాటు గులాబీ సాగును కూడా పరిశీలించిన ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య, రైతుకు అవసరమైన సాంకేతిక సూచనలు అందించి పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమల అధికారి మహమ్మద్ సత్తార్, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ గోపాలకృష్ణమూర్తి, టీఆర్‌వీఎస్ జిల్లా కోఆర్డినేటర్ రాజేశ్వర్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ఏఈవోలు, ప్రజాప్రతినిధులు, ఫర్టిలైజర్ డీలర్లు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో కోట్‌పల్లి పశు వైద్యశాల

- మౌలిక వసతులు లేవు రైతులు, పశుపాలకుల అవస్థలు
- మోరిపై సిమెంట్ బెడ్ లేదు తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కరువు
- రోజుకు 20-25 పశువులకు చికిత్స, వ్యాక్సినేషన్ కొనసాగిస్తున్న సిబ్బంది



**కోట్‌పల్లి, జూలై 29 (జనంసాక్షి):** కోట్‌పల్లి మండల కేంద్రంలోని ప్రభుత్వ పశు వైద్యశాల శిథిలావస్థలో కొనసాగుతుండటంతో రైతులు, పశుపాలకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసుపత్రి ఆవరణలోకి పశువులను తీసుకురావడానికి మార్గమధ్యంలో మోరి అడ్డంగా ఉండటంతో పశువులను లోపలికి తీసుకెళ్లడం కష్టంగా మారింది. మోరిపై వెంటనే సిమెంట్ బెడ్ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. పశు వైద్యశాలలో తాగునీటి సదుపాయం, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో వైద్య సేవల నిర్వహణ కూడా ఇబ్బందికరంగా మారింది. ఇటీవల కొత్తగా పశు వైద్య సహాయకుడు విధుల్లో చేరి రెండు నెలలు పూర్తవుతున్నప్పటికీ, కనీస మౌలిక వసతులు లేకపోయినా సేవలను కొనసాగిస్తున్నారు. ప్రతిరోజూ సుమారు 20 నుంచి 25 పశువులు చికిత్స కోసం ఈ వైద్యశాలకు వస్తున్నాయి. వాటికి అవసరమైన వైద్య చికిత్సతో పాటు వివిధ అంటువ్యాధుల నివారణకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని కూడా సిబ్బంది క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. అయితే శిథిలావస్థలో ఉన్న భవనం, మౌలిక వసతుల కొరత కారణంగా వైద్య సేవల నాణ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని పశుపాలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పశుసంపద రైతులకు ప్రధాన ఆధారంగా ఉన్న నేపథ్యంలో కోట్‌పల్లి పశు వైద్యశాలను వెంటనే మరమ్మతులు చేయించి, మోరిపై సిమెంట్ బెడ్ నిర్మించడం, తాగునీరు, విద్యుత్ సౌకర్యాలు కల్పించడం, అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని స్థానిక రైతులు, పశుపాలకులు సంబంధిత శాఖ అధికారులను కోరుతున్నారు.

## రైతుల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

**ఫార్మాసిటీ, భూసేకరణ పనుల ఒత్తిడి వల్లే జాప్యం : యాచారం తహసీల్దార్ అయ్యప్ప**

**యాచారం, జులై 29(జనం సాక్షి) :** మండల పరిధిలోని రైతుల రెవెన్యూ సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని యాచారం తహసీల్దార్ అయ్యప్ప స్పష్టం చేశారు. బుధవారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో ప్రతిష్టాత్మక ఫార్మాసిటీ ప్రాజెక్టు, మొండిగౌరెల్లి భూసేకరణ, తక్కెళ్లపల్లి ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయని తెలిపారు. రెవెన్యూ సిబ్బందిపై తీవ్రమైన పని ఒత్తిడి పెరిగిందని, దీనివల్ల సాధారణ రెవెన్యూ సమస్యల పరిష్కారంలో కొంత జాప్యం జరిగిందని ఆయన వివరించారు. అయినప్పటికీ, రైతుల నుంచి వచ్చే దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విధులు నిర్వహిస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న రెవెన్యూ పనులన్నింటినీ త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.



# అలుగుపై రోడ్డు ఇలా.? ప్రయాణం ఎలా.?

- సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలి
- కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు ఆర్ నవీన్ కుమార్

**ధారూర్, జూలై 29 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా ధారూర్ మండలంలోని కోట్ పల్లి ప్రాజెక్టు అలుగుపై ఉన్న రహదారి అధ్వా న్నంగా మారడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కెవీపీఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు రాయల్ నవీన్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాగసము ందర్, వికారాబాద్,కోట్ పల్లి, తాండూర్ ప్రాంతాలను అనుసంధానించే కీలక రహదారి పూర్తిగా దెబ్బతినడంతో నిత్యం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. స్వల్ప వర్షం కురిసినా రహదారి బురదమయంగా మారి ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంద న్నారు. ద్విచక్ర వాహనదారులు తరచూ జారి పడుతున్నారని, అత్యవసర సేవల రాకపోకలకు కూడా ఆటంకం ఏర్పడుతోందని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధులు, సంబంధిత ఆర్.అండ్.బీ శాఖ అధికారులు వెంటనే స్పందించి కోటపల్లి ప్రాజెక్టు అలుగుపై రహదారిని అభివృద్ధి చేసి ప్రజల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపడతామని హెచ్చరించారు."రోడ్డు ఇలా ఉంటే ప్రజలు ప్రయాణం ఎలా చేయాలి?"అని ప్రశ్నిస్తూ,ఇప్పటివరకు అధికారు లు ఈ సమస్యను పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. వెంటనే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రజలకు సురక్షితమైన ప్రయాణ సౌకర్యం కల్పించాలని కోరారు.

# ఒక్క మార్కు తేడాకు అవమానం

**98.63% తెచ్చిన విద్యార్థి ఆత్మహత్య**

**"సార్ ప్రోత్సహించలేదు... ఆత్మగౌరవం దెబ్బతింది" - లేఖ రాసి తరుణ్ ఆత్మహత్య**






**జోగులాంబ గద్వాల, జూలై 29 (జనంసాక్షి) :**గద్వాల మండలం కొత్తపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన ఘటన విద్యా వ్యవస్థను కదిలించింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ 2వ సంవత్సరం చదువుతున్న తరుణ్18 ఇంట్లో ఉరేసుకుని మృతి చెందాడు. 98.63% తెచ్చినా అవమానం తట్టుకోలేక...తరుణ్ ఇంటర్ 1వ సంవత్సరంలో 440కి 434 మార్కులు సాధించి జిల్లాలో ప్రభుత్వ కళాశాలల్లో 2వ ర్యాంక్ తెచ్చాడు. తనతో పాటు చదువుతున్న మరో విద్యార్థికి 435 మార్కులు రావడంతో కేవలం ఒక్క మార్కు తేడాతో తొలి స్థానం చేజారింది. ఈ నేపథ్యంలో కళాశాలలోని శిరీష అనే లెక్చరర్ తనతో అవమానకరంగా మాట్లాడారని, పైగా చేయి కూడా చేసుకున్నారని తరుణ్ సూసైడ్ నోట్‌లో రాసుకున్నాడు. నన్ను ప్రోత్సహించాల్సిన టీచర్ ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీశారు. నా ఆత్మగౌరవం దెబ్బతింది" అని లేఖలో ఆవేదన వ్యక్తం చేశాడు. కుటుంబం, విద్యార్థి సంఘాల ఆగ్రహం. తరుణ్ మృతితో కుటుంబంలో విషాదం అలుముకుంది. బంధువులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. తరుణ్ రాసిన లేఖ, కళాశాలలో జరిగిన పరిణామాలు, ఇతర విద్యార్థులు-ఉపాధ్యాయుల వాంగ్మూలాలను పరిగణలోకి తీసుకుని నిష్పాక్షిక విచారణ జరిపి వాస్తవాలు బయటపెట్టాలని కోరుతున్నారు."విద్యార్థులను ప్రోత్సహించాల్సిన ఉపాధ్యాయుల మాటలే ఇలా ఉంటే, పిల్లల భవిష్యత్తు ఏంటి? విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి" అని విద్యార్థి సంఘ నాయకులు డిమాండ్ చేశారు. గద్వాల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సూసైడ్ నోట్ ను స్వాధీనం చేసుకుని, కళాశాల సిబ్బంది, విద్యార్థుల వాంగ్మూలాలు రికార్డు చేస్తున్నారు. తరుణ్ ఆత్మహత్య ఘటనపై విచారణ జరిపి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థి సంఘాలు.

**పేట ప్రభుత్వ ఆసుపత్రిలో.. రెండు క్లిష్టమైన**

# శస్త్రచికిత్సలు విజయవంతం



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 29(జనం సాక్షి):** నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో మెడలో సిస్టిక్ హైగ్రోమాతో బాధపడుతు న్న హనుమంతు(33 )కు,అలాగే లాలాజల గ్రంథి కణితితో బాధపడుతున్న పాపమ్మ (60)కు వైద్యులు విజయవంతంగా శస్త్రచి కిత్సలు నిర్వహించారు.ప్రభుత్వ వైద్య కళాశాల, నారాయణపేట ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్ మార్గదర్శకత్వంలో,హైదరాబాద్ నుండి వచ్చిన హెడ్ అండ్ నెక్ క్యాన్సర్ స్పెషలిస్ట్ డాక్టర్ అచ్యుత్ సహకారంతో,చెవి, ముక్కు, గొంతు విభాగ నిపుణులు డాక్టర్ వి.దీపిన్ కుమార్, డాక్టర్ సి. అమృత్ జనరల్ సర్జరీ విభాగానికి చెందిన డాక్టర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో వైద్య బృందం ఈ క్లిష్టమైన శస్త్రచికిత్స లను విజయవంతంగా నిర్వహించింది.వైద్యుల నైపుణ్యం, సమిష్టి కృషి నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటు లో ఉన్న మెరుగైన వైద్య సదుపాయాల సహకారం తో రెండు శస్త్రచికిత్సలు విజయవంతంగా పూర్త య్యాయి.ప్రస్తుతం హను మంతు, పాపమ్మల ఆరోగ్య పరిస్థితులు నిలకడగా ఉన్నాయని వైద్యులు తెలిపారు.నారాయణపేట ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు నాణ్యమైన, ఆధు నిక వైద్య సేవలు అందుబా టులో ఉన్నాయని, ఇలాం టి క్లిష్టమైన శస్త్రచికిత్సల ను కూడా విజయవంతంగా నిర్వహిస్తున్నామని వైద్య బృందం పేర్కొంది.ఈ విజయవంతమైన శస్త్రచి కిత్సల్లో పాల్గొన్న వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర ఆసుపత్రి సిబ్బందిని ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సంపత్ కుమార్ సింగ్ అభినందించారు.

# ఆగస్టు నాటికి విద్యార్థులకు కొత్త యూనిఫారాలు


- ఒక్కో విద్యార్థికి రెండు జతల దుస్తుల పంపిణీకి ప్రభుత్వం ఏర్పాట్లు
- యూనిఫారాల కుట్టులో నిమగ్నమైన డ్వాక్రా మహిళలు
- మహిళా సంఘాలకు ఉపాధి.. ఒక్కో జత కుట్టుకు రూ.75 చెల్లింపు
- జిల్లాలో 93,151 మంది విద్యార్థులకు యూనిఫారాల పంపిణీ లక్ష్యం



**వికారాబాద్ బ్యూరో, జూలై 29 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఆగస్టు నెలలో కొత్త యూనిఫారాలు అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు వేగవంతం చేసింది. జిల్లాలోని ప్రతి విద్యార్థికి రెండు జతల చొప్పున యూనిఫారాలు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకుని డ్వాక్రా మహిళల ద్వారా యుద్ధప్రాతిపదికన దుస్తుల కుట్టు పనులు కొనసాగుతున్నాయి. వికారాబాద్ జిల్లాలోని 1,062 ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 93,151 మంది విద్యార్థులకు ఆగస్టు 15 నాటికి రెండు జతల యూనిఫారాలు అందించేందుకు జిల్లా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఈ కార్యక్రమాన్ని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో 20 మండల సమాఖ్యల ద్వారా అమలు చేస్తున్నారు. పొదుపు సంఘాలకు చెందిన మహిళలు కుట్టు కేంద్రాల్లో యూనిఫారాల తయారీలో నిమగ్నమయ్యారు.
మహిళా సంఘాలకు ఉపాధి కల్పించడమే లక్ష్యంగా యూనిఫారాల తయారీ బాధ్యతను ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు అప్పగించింది. జిల్లాలో వందలాది మంది మహిళలు కుట్టు మిషన్లపై దుస్తులను సిద్ధం చేస్తున్నారు. యూనిఫారాల తయారీకి అవసరమైన వస్త్రాలను ఇప్పటికే మండల సమాఖ్యల ద్వారా మహిళలకు అందజేశారు.
ఈ విద్యాసంవత్సరం నుంచి యూనిఫారాల రంగులో మార్పు చేశారు. బాలురకు నీలం రంగు ప్యాంటు, లేత నీలం రంగు చొక్కా, చిన్నారులకు నిక్కర్-షర్టు, బాలికలకు చూడిదార్, పైజామాతో పాటు కోటు అందించనున్నారు. ఆదర్శ పాఠశాలలు, జెడ్పీహెచ్ఎస్‌లు, యూపీఎస్‌లు, సీపీఎస్‌లలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ ఈ యూనిఫారాలు అందజేయనున్నారు. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థినులకు ఇప్పటికే యూనిఫారాలు సరఫరా చేసినట్లు అధికారులు తెలిపారు. మోమిన్‌పేట్ మండల సమాఖ్య ఏపీఎం మధుకర్ మాట్లాడుతూ, ఒక్కో జత యూనిఫారం కుట్టుకు ప్రభుత్వం రూ.75 చెల్లిస్తోందన్నారు. బహిరంగ మార్కెట్‌లో ఇదే పనికి రూ.500 నుంచి రూ.700 వరకు కూలి లభిస్తున్నప్పటికీ, ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా మహిళలు బాధ్యతగా పని చేస్తున్నారని తెలిపారు.
గతంలో విద్యాసంవత్సరం ప్రారంభానికే యూనిఫారాలు అందించగా, ఈసారి రంగు మార్పు, ఇతర పరిపాలనా కారణాలతో పంపిణీలో ఆలస్యం జరిగిందన్నారు. అయినప్పటికీ ఆగస్టు 15 నాటికి విద్యార్థులందరికీ కొత్త యూనిఫారాలు అందించి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో కొత్త దుస్తులతో పాల్గొనేలా చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వెల్లడించారు.




- పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో వెలుగుచూసిన నకిలీ ఎరువుల బాగోతం
- 176 బస్తాలు స్వాధీనం.. శాంపిళ్లు పరీక్షలకు పంపిన వ్యవసాయ శాఖ
- మధ్యవర్తులు, స్థానిక నాయకుల పాత్రపై దర్యాప్తు ముమ్మరం



# నకిలీ డీఏపీతో రైతులకు టోకరా

## ఉప్పు, బూడిద కలిపిన ఎరువులతో లక్షల దందా

**వికారాబాద్ బ్యూరో/పరిగి/తాండూరు, జూలై 29 (జనంసాక్షి):**



వికారాబాద్ జిల్లాలో నకిలీ డీఏపీ ఎరువుల వ్యవహారం వెలుగులోకి రావడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. బ్రాండెడ్ కంపెనీ పేరుతో నకిలీ 'భారత్ డీఏపీ' బస్తాలను విక్రయిస్తూ అమాయక రైతులను మోసం చేసిన ముఠా వ్యవహారం బయటపడింది. ఉప్పు, బూడిదతో పాటు కొన్ని రసాయనాలు కలిపి తయారు చేసిన నకిలీ ఎరువులను మార్కెట్లోకి తెచ్చి లక్షల రూపాయలు దండుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది.
ప్రాథమిక సమాచారం ప్రకారం కర్ణాటక సరిహద్దు ప్రాంతం నుంచి జిల్లాలోకి అక్రమంగా నకిలీ డీఏపీ తరలించి, మధ్యవర్తులు, స్థానిక పరిచయాల ద్వారా రైతులకు విక్రయించినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. పరిగి నియోజకవర్గంలోని మంచన్‌పల్లి, బస్సురెడ్డిపల్లి, లక్నాపూర్, చిగురాళ్లపల్లి గ్రామాలతో పాటు తాండూరు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో ఈ నకిలీ ఎరువులు విక్రయించినట్లు గుర్తించారు.
ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాల తర్వాత రైతులు పొలాల్లో వేసిన డీఏపీ ఎరువు కరగకపోవడంతో అనుమానం వచ్చి అధికారులకు సమాచారం అందించారు. దీంతో వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు, పోలీసులు సంయుక్తంగా విచారణ చేపట్టారు. రైతులను మోసం చేసిన మధ్యవర్తులను గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతున్నప్పటికీ, స్థానికుల ప్రమేయం ఉండడంతో పలువురు రైతులు పేర్లు వెల్లడించేందుకు ముందుకు రావడం లేదని సమాచారం.

### నకిలీ భారత్ డిఏపి స్వాధీనం చేసుకున్నాం... శాంపిల్స్ ల్యాబ్‌కు పంపించాం

**- పూడూర్ ఏవో లావణ్య**

పూడూర్ మండల వ్యవసాయ అధికారి (ఏవో) లావణ్య మాట్లాడుతూ, మంచన్‌పల్లి గ్రామంలో ఆరుగురు రైతుల వద్ద నుంచి 176 నకిలీ డీఏపీ బస్తాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఒరిజినల్ డీఏపీ బస్తాలను పోలి ఉండే విధంగా బ్రాండెడ్ కంపెనీ పేరు, బార్‌కోడ్, తయారీ వివరాలు ముద్రించి విక్రయించినట్లు గుర్తించామని చెప్పారు. బస్తాలపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో కూడా ముద్రించారని తెలిపారు.
నకిలీ డీఏపీ శాంపిళ్లను పరీక్షల కోసం ప్రయోగశాలకు పంపించామని, ఐదు రోజుల్లో నివేదిక వచ్చే అవకాశం ఉందన్నారు. ఇతర జిల్లాల నుంచి సేకరించిన సమాచారం మేరకు ఈ నకిలీ ఎరువుల తయారీలో ఉప్పు, బూడిదతో పాటు కొన్ని రసాయనాలను వినియోగించినట్లు అనుమానిస్తున్నామని చెప్పారు. రైతుల చేతులకు బొబ్బలు రావడానికి అదే కారణమై ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. ఈ వ్యవహారంపై చనుగోముల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఏవో లావణ్య తెలిపారు. అమాయక రైతులకు నకిలీ ఎరువులు విక్రయించిన ఇద్దరు వ్యక్తులను ఇప్పటికే గుర్తించి పోలీసులకు సమాచారం అందించామని చెప్పారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని, ముఠాకు సహకరించిన వారందరినీ గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. తక్కువ ధరకు ఎరువులు, విత్తనాలు అందిస్తామని ఎవరైనా ప్రలోభపెడితే రైతులు నమ్మవద్దని, తప్పనిసరిగా వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని ఏవో లావణ్య విజ్ఞప్తి చేశారు.

# తెలుగు సాహిత్యానికి సినారె విశిష్ట సేవలు

- బిఆర్ఎస్ ఆధ్వర్యంలో డా.సి.నారాయణరెడ్డి జయంతి వేడుకలు
- డిస్కబ్ చైర్మన్ కొండూరి రవీందర్రావు, ఎంసీఎస్ చైర్ పర్సన్ జిందం కళ




**సిరిసిల్ల టౌన్ జూలై 29 (జనంసాక్షి) :** జ్ఞానపీఠ అవార్డు గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డి మహోన్నతమైన వ్యక్తి అని, ఆయన అనేక కావ్య గ్రంథాల్ని రచించి, సినీ వినీలా కాశంలో విహరించి, అనేక వేల సినీ గీతాలు అందించిన మహనీయుడని టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్రావు మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళాచక్రపాణి లు కొనియాడారు. బుధవారం జిల్లా బి, ఆర్, ఎస్ పార్టీ కార్యాలయంలో సి, నారాయణరెడ్డి 95వ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాన్ని సినీ చలనచిత్ర రంగాన్ని తమ కవిత్వంతో గజళ్ళతో, సినీ గీతాలతో విశిష్ట శిఖరాలకు తీసుకెళ్లారని అన్నారు. అంతే కాకుండా ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ గా, ఉపకులపతిగా సేవలు అందించడమే కాకుండా రాజ్యసభ సభ్యుడుగా విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. తెలుగు సాహిత్యాన్ని ప్రపంచానికి నలుమూలల తీసుకువెళ్లిన సినారే సిరిసిల్ల జిల్లాకు చెందినవారు కావడం గర్వించదగిన విషయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో బి,ఆర్,ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు జిందం చక్రపాణి. వైస్ చైర్మన్ దార్ల సందీప్, మున్సిపల్ కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్టర్ అదుపు తప్పి వ్యవసాయ రైతు మృతి

**జమ్మికుంట జులై 29 (జనం సాక్షి):** జమ్మికుంట పట్టణానికి చెందిన ఆరుకాల (భీంపల్లి) కుమారస్వామి వయస్సు 50 అనే రైతు ట్రాక్టర్ అదుపుతప్పి వ్యవసాయ బోల్తా పడగా కుమారస్వామి అక్కడికక్కడే చెందాడు. వివరాల్లోకి వెళితే జమ్మికుంట పట్టణం లోని 7వ వార్డు దుర్గా కాలనీకి చెందిన రైతు అరుకాల (భీంపల్లి)కుమారస్వామి బుధవారం సొంత ట్రాక్టర్‌తో వ్యవసాయ పనుల నిమిత్తం తన స్వగ్రామమైన భీంపల్లికి వెళ్లి పనులు ముగించుకొని తిరిగి వస్తుండగా అంకుశాపూర్, కన్నూర్ గ్రామాల మధ్య ప్రమాదవశాత్తు ట్రాక్టర్ అదుపు తప్పి వ్యవసాయ పొలంలో బోల్తా పడగా ట్రాక్టర్ కింద చిక్కుకున్న కుమారస్వామి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదాన్ని గమనించిన స్థానిక రైతులు, గ్రామస్థులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టినా అప్పటికే కుమారస్వామి మృతి చెందినట్లు గుర్తించారు. ఇతనికి భార్య ఇద్దరు కూతుళ్లు ఒక కుమారుడు ఉన్నారు.ఈ వార్త తెలిసి కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా, గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# మండల సర్వసభ్య సమావేశం

**మల్యాల జూలై 29 (జనం సాక్షి) :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచులు, మండల స్తాయి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావంతో మండలంలో తీసుకోవలసిన ముందస్తు చర్యలు జాగ్రత్తలు,ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజా ప్రతినిధులు అధికారులు అప్రమత్తంగా ఉండాలని,మండలంలోని తాగునీరు,విద్యుత్ సరఫరా,మరియు పారిశుద్ధ్య పనులు,కొత్త పథకాల అమలు,రోడ్లు మరియు భవనాల నిర్మాణాలు.వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,భూగర్భ జలాల పెంపు,పంటల సాగు వివిధ అంశాలపై చర్చించి తీసుకోవలసిన జాగ్రత్తల చర్యల గురించి తెలిపారు. కార్యక్రమంలో డిఆర్డిఓ,ఎంపీడీవో స్వాతి, ఎమ్మార్వో శ్రీనివాస్ అధికారులు మండలంలోని వివిధ గ్రామాల సర్పంచులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ పోరాట ఫలితంగా వరద కాలువలోకి నీటిని విడుదల

- తలవంచి నీటిని విడుదల చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్

గంగాధర జూలై 29(జనంసాక్షి):వరద కాలువలోకి నీటిని విడుదల చేయాలని కోరుతూ గత పదిహేను రోజులుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేసిన పోరాటంతో తలవంచిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎట్టకేలకు గాయత్రి పంపు హౌస్ నుంచి వరద కాలువలోకి నీటిని విడుదల చేసిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవి శంకర్ అన్నారు.బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరద కాలువలోకి నీటిని విడుదల చేయాలని గత పదిహేను రోజులుగా బిఆర్ఎస్ పార్టీ పోరాటం చేస్తూ మా రక్తం తీసుకో మాకు నీళ్ళు ఇవ్వండి అంటూ రక్తదానం చేసాము వరద కాలువలో వంట వార్పు చేసి రోడ్లపై బైఠాయించి ధర్నాలతో పోరాటం చేస్తే తప్ప ఈ కాంగ్రెస్ నీళ్ల విడుదల చేయలేదన్నారు.కన్నెపల్లి నుండి పంపింగ్ ద్వారా వరద కాలువలోకి నీటిని విడుదల అవకాశం ఉన్న నీటిని విడుదల చేయకుండా కాళేశ్వరం కూలిందని అబద్ధపు మాటలతో ఇన్నిరోజులు నీటిని విడుదల చేయకుండా రైతులకు ప్రభుత్వం నష్టం చేసిందన్నారు కాళేశ్వరం కూలిపోయిందని అబద్ధ ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు నీటిని ఎలా విడుదల చేసిందో చెప్పాలన్నారు.ఇప్పటికైనా అబద్ధ ప్రచారం మానుకొని రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం పని చేయాలని అన్నారు.

# నకిలీ పీహెచ్‌డీలపై చర్యలు తీసుకోవాలి

### తెలంగాణ క్వాలిఫైడ్ ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల అసోసియేషన్ నాయకుల డిమాండ్




**ముషీరాబాద్, జూలై 29 (జనం సాక్షి):** పలు విశ్వవిద్యాలయాల నుండి చాలామంది ఉపాధ్యాయులు నకిలీ పీహెచ్‌డీ డిగ్రీలు సరైన ధ్రువీకరణ లేకుండా అర్హతలను ఆమోదించి పొందిన ఈ సందేహాస్పదమైన సర్టిఫికెట్ల ద్వారా అభ్యర్థులు తప్పుడు ప్రయోజనాలు పొందారనే ఆరోపణలపై విచారణ జరిపి, చర్యలు తీసుకోవాలని తెలంగాణ క్వాలిఫైడ్ ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డా. టి.ఎస్ ప్రవీణ్ కుమార్, డా.బి.బాలయ్యలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్, ఇందిరా పార్క్ ధర్నా చౌక్ వద్ద తెలంగాణ క్వాలిఫైడ్ ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో విరుద్ధంగా జరిగిన ప్రమోషన్ల ను నిలిపివేయాలని, నాటి నిబంధనల ప్రకారం మాత్రమే సీనియారిటీ నిర్ణయించాలని పేర్కొంటూ ధర్మ పోరాట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ ప్రమోషన్లు వెంటనే రద్దుచేసి,చట్ట విరుద్ధ సీనియారిటీ వెంటనే సరి చేయాలన్నారు. సరికాని అర్హతలు వెంటనే తిరస్కరించి అసమర్థ అధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తాము కేవలం ప్రమోషన్ల కోసం కాకుండా మెరిట్‌ను కాపాడడం, భవిష్యత్ తరాలకు న్యాయమైన విద్యావ్యవస్థను అందించడం కోసం ఈ నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ సిహెచ్ రాజు, జాయింట్ సెక్రెటరీ ఆర్.హెచ్. ఆర్థర్, తదితరులు పాల్గొన్నారు.

# అకాల వర్షాలపై అప్రమత్తం.. 52 ప్రమాద ప్రాంతాల గుర్తింపు

- లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువుల వద్ద ప్రత్యేక నిఘా
- అత్యవసర పరిస్థితులకు అన్ని శాఖలు సిద్ధంగా ఉండాలి : కలెక్టర్ దీపక్ తివారి
- జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ 24 గంటలు అందుబాటులో : ఎస్పీ స్నేహ మెహర
- ఎస్ఐఆర్ ప్రక్రియ 78 శాతం పూర్తి.. ఒక్క ఓటరు కూడా మిస్ కాకూడదు



**వికారాబాద్ బ్యూరో, జూలై 29 (జనంసాక్షి):** అకాల వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆదేశించారు. భారీ వర్షాల వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి ఎంపీడీవోలు, తహసీల్దార్లు, రెవెన్యూ, పోలీస్, పంచాయతీరాజ్, నీటిపారుదల, వైద్యం, విద్యుత్, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన జూమ్ సమావేశంలో పరిస్థితిని సమీక్షించారు. లోతట్టు ప్రాంతాలు, వాగులు, చెరువులు, కాలువల పరిసర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని కలెక్టర్ సూచించారు. భారీ వర్షాల సమయంలో కల్వర్టులు మునిగిపోవడం, రహదారులపై నీరు చేరడం, పాత భవనాలు, చెట్లు కూలే ప్రమాదాలు ఉన్నందున అధికారులు వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అవసరమైన యంత్రాంగం, సిబ్బంది, సహాయక బృందాలను అందుబాటులో ఉంచి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. ప్రతి మండలంలో వాగులు, చెరువులు, ప్రమాదకర ప్రాంతాలను గ్రామపంచాయతీ వారీగా మ్యాపింగ్ చేసి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ప్రజలు కూడా వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాలు, వరద ప్రవాహాలు ఉన్న ప్రాంతాలకు అవసరం లేకుండా వెళ్లవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహర మాట్లాడుతూ జిల్లాలో 52 లోతట్టు ప్రమాద ప్రాంతాలను గుర్తించినట్లు తెలిపారు. వాగులు, బ్రిడ్జిలు, కల్వర్టుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజలను అటువైపు వెళ్లకుండా మండల స్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల కోసం జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్‌ను 24 గంటలు పనిచేసేలా ఏర్పాటు చేశామని, అత్యవసర సమాచారం కోసం 8712670056 నంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై సమీక్షించిన కలెక్టర్, జిల్లాలో 78 శాతం నమోదు పూర్తయిందని తెలిపారు. గ్రామపంచాయతీ స్థాయిలో సర్పంచులు, ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఒకే వ్యక్తికి రెండు ఓట్లు ఉండడం, మరణించిన వారి పేర్లు తొలగించకుండా ఉండడం వంటి పొరపాట్లు జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటాచారి, ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూర్, అదనపు ఎస్పీ రాజేష్ మీనా, డీఆర్వో స్వర్ణలత, ఆర్డీవో వాసు చంద్రతో పాటు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సొంత అల్లుడు, మనుమడే సూత్రధారులు

## భగత్‌నగర్ డెకాయిటీ కేసు ఛేదించిన పోలీసులు.. ముగ్గురు నిందితుల అరెస్ట్

- రూ.2.09 లక్షల నగదు, బంగారం, వెండి స్వాధీనం
- కుటుంబ పరిచయాన్నే ఆసరాగా చేసుకుని పక్కా పథకంతో దోపిడీ
- పరారీలో ప్రధాన నిందితులు.. గాలిస్తున్న ప్రత్యేక బృందాలు
- కేసును ఛేదించిన పోలీసు బృందాన్ని అభినందించిన సీపీ గౌస్ ఆలం



**కరీంనగర్ బ్యూరో, జూలై 29 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో ఇటీవల సంచలనం సృష్టించిన ఇంటి డెకాయిటీ కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం వెల్లడించారు. ఈ దోపిడీకి బాధితుడి సొంత అల్లుడు, మనుమడే సూత్రధారులుగా దర్యాప్తులో తేలిందని తెలిపారు. సీపీ తెలిపిన వివరాల ప్రకారం.. భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ ఇంట్లో అర్ధరాత్రి సమయంలో డమ్మీ పిస్టళ్లు, కత్తులతో చొరబడిన దుండగులు కుటుంబ సభ్యులను బెదిరించి, చేతులు, కాళ్లు కట్టేసి నగదు, బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. ఫిర్యాదు అందుకున్న వెంటనే ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి ఘటనాస్థలం, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించాయి. దోపిడీ అనంతరం నిందితులు దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై హుజురాబాద్ వైపు వెళ్లి, పెద్ద పాపయ్యపల్లి సమీపంలో వాటిని వదిలి వెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాలతో నిందితులు మీరట్‌కు చెందినవారని పోలీసులు నిర్ధారించారు. దర్యాప్తులో భాగంగా మీరట్‌కు వెళ్లిన ప్రత్యేక బృందాలు స్థానిక పోలీసుల సహకారంతో గాలింపు చేపట్టి, రైల్వే స్టేషన్ వద్ద తప్పించుకునే ప్రయత్నంలో ఉన్న ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నాయి. అరెస్టైన వారిలో సల్మాన్ అలియాస్ భూరే అలియాస్ యాదవ్ (22), సల్మాన్ అలియాస్ విమాన్ (22), మొహమ్మద్ హసీన్ (19) ఉన్నారు. వారి వద్ద నుంచి రూ.2,09,000 నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.
దర్యాప్తులో బాధితుడి సొంత అల్లుడు రజావుద్దీన్ (ఏ1), మనుమడు అజీమ్ రజా (ఏ2) ఈ డెకాయిటీకి ప్రధాన సూత్రధారులుగా గుర్తించినట్లు సీపీ తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా కొంతకాలం బాధితుడి ఇంట్లోనే ఉన్న రజావుద్దీన్‌కు ఇంట్లోని నగదు, ఆభరణాలపై పూర్తి సమాచారం ఉండడంతో, తన కుమారుడు అజీమ్ రజా, మీరట్‌కు చెందిన మరో ముగ్గురితో కలిసి దోపిడీకి పథకం రచించినట్లు విచారణలో వెల్లడైందన్నారు. ఈ నెల 20న మీరట్ నుంచి రామగుండం చేరుకున్న నిందితులు, 21వ తేదీ అర్ధరాత్రి డమ్మీ పిస్టళ్లు, కత్తులతో ఇంట్లోకి చొరబడి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. అరెస్టైన ముగ్గురు నిందితులను ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ప్రధాన నిందితులు రజావుద్దీన్, అజీమ్ రజాతో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలు గాలింపు కొనసాగిస్తున్నాయని సీపీ గౌస్ ఆలం తెలిపారు. కేసును అత్యంత వేగంగా ఛేదించి నిందితులను గుర్తించిన పోలీసు బృందాన్ని ఆయన అభినందించారు.

# గురుపౌర్ణమి వేళ ఘనంగా కొండగట్టు గిరిప్రదక్షిణ

- రైతుల సంక్షేమం, సమృద్ధి వర్షాల కోసం ప్రత్యేక పూజలు
- లోకకళ్యాణం కోసమే గిరిప్రదక్షిణ నిర్వహించామని మంత్రి పొన్నం ప్రభాకర్
- కొండగట్టు క్షేత్రాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**మల్యాల, జూలై 29 (జనం సాక్షి) :** గురుపౌర్ణమి సందర్భంగా ప్రజల సంక్షేమం, సమృద్ధిగా వర్షాలు కురవాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డా. మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో బుధవారం 43వ కొండగట్టు గిరిప్రదక్షిణ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అంజన్న భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉదయం నుంచి కురుస్తున్న భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా భక్తులు గిరిప్రదక్షిణ పూర్తి చేసి అనంతరం శ్రీ కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజా సంక్షేమం, లోకకళ్యాణం కోసం ప్రభుత్వం ప్రముఖ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని కొండగట్టు అంజన్నను ప్రార్థించినట్లు తెలిపారు. ఇది రాజకీయ కార్యక్రమం కాదని, సకలజనుల శ్రేయస్సు కోసం నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమమని స్పష్టం చేశారు. జిల్లా అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేస్తామని పేర్కొన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. కొండగట్టు క్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎమ్మెల్యే డా. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, రైతుల కష్టాలు తొలగి రాష్ట్రంలో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలనే ఆధ్యాత్మిక సంకల్పంతో గిరిప్రదక్షిణ చేపట్టామని చెప్పారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. భారీ వర్షంలోనూ పాల్గొన్న భక్తులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, హుజూరాబాద్ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఒడితల ప్రణవ్ బాబు, మాజీ సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, కరీంనగర్ నగర కాంగ్రెస్ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు, సర్పంచులు, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సహకార సంఘాలు, మార్కెట్ కమిటీల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
30 జూలై 2026

# జోరుగా వానలు.. పొంగిన వాగులు



## రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో దంచికొట్టిన వాన







**తుఫాను ప్రభావంతో మంగళవారం రాత్రి నుండి బుధవారం రాత్రి వరకు పలు జిల్లాల్లో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మొన్నటివరకు వర్షాల కోసం ఎదురుచూసిన రైతాంగానికి తాజా వానలతో ఆశలు చిగురిస్తుండగా.. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కొన్నిచోట్ల వంతెనలు, రహదారులు తెగిపోయి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. ప్రధానంగా వరంగల్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల్లో కురిసిన వర్షాలతో జనజీవనం స్తంభించిపోయింది. పెద్దవాగు ఉప్పొంగడంతో కాటారం-మేడారం మార్గంలో రాకపోకలు పూర్తిగా బంద్ అయ్యాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణ కూడా జలమయమైంది. ఈదురు గాలులకు మహదేవపూర్, మల్హర్ మండలాల్లో భారీ వృక్షాలు కూలి విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలంలోని చమన్ పెల్లి గూడెం గ్రామానికి చెందిన పారు బాయి (45) ఎరువచింతల్ గ్రామ బల్లి వాగు దాటుతూ మృతి చెందింది. చామనపల్లి గూడెం నుండి పెన్షన్ తీసుకునేందుకు ఎర్ర చింతల్ గ్రామానికి వచ్చి తిరుగు ప్రయాణంలో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలిపారు.**

– విలేకరుల యంత్రాంగం, జూలై 29 (జనంసాక్షి) :

- ఉప్పొంగిన వాగులూ వంకలు.. ప్రాజెక్టులల్లోకి వరద
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- నిర్మల్ జిల్లాలో వాగుదాటుతూ మహిళ మృతి
- వరద ఉధృతికి కొట్టుకుపోయిన రహదారులు, వంతెనలు
- మోరంచ వాగు పరిసరాల్లో ప్రజలకు అధికారుల హెచ్చరికలు

ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు వరదనీరు వచ్చి చేరుతుండటంతో మోరంచవాగు ఉధృతి పెరుగుతోంది. వర్షపాతం మరింత ఎక్కువ నమోదయ్యే అవకాశం ఉన్నందున వాగు పరివాహక ప్రాంత ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. వాగులు, వంకలు దాటేందుకు ఎవరూ ప్రయత్నిం చవద్దని కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఆవరణ జలమయమైంది. ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఓపీ విభాగం, వార్డులు, ఇతర విభాగాలకు వెళ్లేందుకు రోగులు నీటిలోనే నడవాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు, అత్యవసర చికిత్స కోసం వచ్చే రోగులు ఇబ్బందులు పడుతున్నారు.

### అనేక గ్రామాలకు నిలిచిన రాకపోకలు

నిర్మల్ జిల్లా కడెం మండలం ధర్మాజీపేట్ గ్రామపంచాయతీ పరిధిలోని కుర్రగూడ, పాత రేవుజిపేట్ గ్రామాల మధ్య తాత్కాలికంగా నిర్మించుకున్న అప్రోచ్ వంతెన భారీ వర్షాల దాటికి కొట్టుకుపోవడంతో రెండు గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మంగళవారం రోజున రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతి పెరగడంతో గ్రామస్తులు తాత్కాలికంగా ఏర్పాటు చేసుకున్న వంతెన కూడా కొట్టుకుపోవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. మూడేళ్ల క్రితం వరదల్లో అసలు వంతెన దెబ్బతినడంతో గ్రామస్తులే తాత్కాలిక అప్రోచ్ వంతెన ఏర్పాటు చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. తాజాగా అది కూడా కొట్టుకుపోవడంతో కుర్రగూడ, పాత రేవుజిపేట్ గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గిరిజన గ్రామాలకు శాశ్వత పరిష్కారంగా వెంటనే కొత్త వంతెన నిర్మించి రాకపోకలు పునరుద్ధరించాలని, గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ప్రభుత్వ అధికారులను, నాయకులకు విజ్ఞప్తి చేస్తున్నారు. మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలంలోని నక్కలపల్లి గ్రామం వద్ద లోతు వాగులో వరద నీరు చేరి ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నాలుగు గ్రామాలకు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నక్కలపల్లి, బద్దంపల్లి, బ్రాహ్మణపల్లి, చామనపల్లి గ్రామాలకు వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ గ్రామాలలోని ప్రజలకు ఏ చిన్న అవసరం వచ్చినా లోతు వాగు వాగు దాటి కోటపల్లి మండల కేంద్రానికి లేదా చెన్నూరు మండల కేంద్రానికి రావాల్సి ఉంటుంది. నిర్మల్ జిల్లా లక్ష్మణ చందా మండలంలోని ధర్మారం – సోన్ మధ్యలో రోడ్డు మంగళవారం రాత్రి కురిసిన వర్ష వరద నీరు తీవ్రమై రోడ్డు కొట్టుకుపోయింది. వంతెన రోడ్డు మార్గాన్ని తాత్కాలికంగా మూసివేసి వాహనాల రాకపోకలను నిలిపివేశామని, అక్కడ ఇద్దరు కానిస్టేబుళ్లను విధుల్లో నియమించి వాహనదారులను ప్రత్యామ్నాయ మార్గాల వైపు మళ్లిస్తున్నామని పోలీసులు తెలిపారు. మహా ముత్తారం మండలంలోని నిమ్మగూడెం, పెగడపల్లి మధ్యలో ఉన్న పెద్ద వాగు (మేడారం హైవే రూట్) నో లెవల్ వంతెన మీదికి వెళ్లి వర్షపు నీరు భారీగా ప్రవహిస్తుంది. గ్రామపంచాయతీ ట్రాక్టర్లు అడ్డంగా ఉంచారు. పెద్దపల్లి జిల్లా కమాన్ పూర్ మండలం మండలంలోని పేరపల్లి – రొంపికుంట గ్రామాల మధ్య ప్రధాన రహదారిలో కల్వర్ట్ వద్ద రాకపోకలకు ఇబ్బందిగా మారింది.

### కూలిన వృక్షాలు.. ధ్వంసమైన ఇండ్లు

మహదేవపూర్ మండలంలో కురుస్తున్న అకాల వర్షాలు, ఈదురు గాలుల ప్రభావంతో ఓ భారీ వృక్షం విరిగి నేలకులింది. రేకులతో నిర్మించుకున్న వెల్డింగ్ షాపు పూర్తిగా ధ్వంసమైంది. దానికి అనుకుని ఉన్న నివాసగృహం ముందు అమర్చిన రేకుల షెడ్డు కూడా పూర్తిగా దెబ్బతింది. మల్హర్ మండలంలోని తాడిచెర్ల గ్రామంలోనూ భారీ వృక్షం నేలకూలింది. చెట్టు కూలడంతో విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. కేశవపూర్–పెగడపల్లి మధ్య పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో కాటారం–మేడారం మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. బోర్లగూడెం, పెగడపల్లి, కనుకునూరు, పాతరేగులగూడెం, మేడారం గ్రామాలకు రవాణా పూర్తిగా స్తంభించింది. ప్రమాదాలు నివారించేందుకు అధికారులు వాగు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. మహాముత్తారం మండలం నిమ్మగూడెం, పెగడపల్లి మధ్య ఉన్న పెద్ద వాగులో నీటి ప్రవాహం ప్రమాదకర స్థాయికి చేరడంతో నిమ్మగూడెం గ్రామపంచాయతీ అధికారులు ట్రాక్టర్‌ను అడ్డుగా పెట్టి వాహనాల రాకపోకలు నిలిపివేశారు. మహాదేవపూర్ మండలంలోని అన్నారం, చంద్రుపల్లి గ్రామాల మధ్య ఉన్న లోలెవెల్ వంతెనపై వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. చంద్రుపల్లి, కాళేశ్వరం, మద్దులపల్లి వెళ్లే బాటసారులు, వాహనదారులు ప్రయాణించవద్దని అన్నారం గ్రామపంచాయతీ సర్పంచ్, ఉపసర్పంచ్ హెచ్చరికలు జారీ చేశారు. మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ, అంబటిపల్లి గోదావరి పరివాహక ప్రాంతం ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రమాద అధికారులు హెచ్చరికలు జారీ చేసి, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. కాటారం గ్రామపంచాయతీ పరిధిలోని ఎర్రగుంటపల్లిలో శ్రీరాముల మల్లయ్య ఇల్లు నేలమట్టమయింది. కాటారం మండలం ఎర్రగుంటపల్లిలో శ్రీరాముల మల్లయ్య ఇంటి గోడ భారీ వర్షానికి కూలిపోయింది. కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని నారాయణపూర్ గ్రామంలో జెడ రాజయ్య అనే వ్యక్తి ఇల్లు గోడలు పైకప్పు నాని బుధవారం కూలిపోయింది.

# ఆప్మెల్‌లో 'సోలార్' వెలుగు

- 300 కిలోవాట్ల సౌర విద్యుత్ ప్లాంట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి
- సీసీ, ఆర్‌సీసీ రోడ్ల ప్రారంభం
- సోలార్‌తో ఏటా రూ.24 లక్షల విద్యుత్ ఖర్చు ఆదా





హైదరాబాద్ (జనంసాక్షి) : విజయవాడలో ఉన్న సింగరేణి అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్ (ఆంధ్రప్రదేశ్ హెవీ మిషనరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్) స్వర్ణోత్సవాల సందర్భంగా ప్లాంట్ లో ఏర్పాటు చేసిన 300 కిలోవాట్ల సోలార్ ప్లాంట్ ను సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి బుధవారం హైదరాబాద్ సింగరేణి భవన్ నుంచి వర్చువల్ గా ప్రారంభించారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ప్లాంటులో కొత్తగా నిర్మించిన సీసీ రోడ్లు, ఆర్ సి రోడ్లను కూడా ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ ఎ.రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి, ఇంధన శాఖామాత్యులు శ్రీ భట్టి విక్రమార్క మార్గనిర్దేశంలో సింగరేణితోపాటు అనుబంధ సంస్థ అయిన ఆప్మెల్ ను బహుముఖంగా విస్తరించే ప్రణాళికతో ముందుకు వెళున్నట్లు తెలిపారు. 50 ఏళ్ల ఆప్మెల్ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రూ.63.13 కోట్ల టర్నోవర్, రికార్డు స్థాయిలో రూ.23.33 కోట్ల నికర లాభాలను ఆర్జించడంపై ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. గత ఏడాది రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆప్మెల్‌ను సందర్శించిన సమయంలో ఇచ్చిన దిశానిర్దేశం, స్ఫూర్తితో సాధించిన విజయంగా అభివర్ణించారు. అలాగే ప్లాంట్‌ను సందర్శించిన సమయంలో ప్లాంట్ లో సౌకర్యాల మెరుగుదలకు హామీ ఇచ్చారని ,ఆయన ఆదేశాల పైన ప్లాంట్ ఆవరణలో సిసి, ఆర్సిసి రోడ్లు నిర్మించడం జరిగిందన్నారు. సెప్టెంబరు 1, 1976 లో ప్రారంభమైన ఆప్మెల్ సంస్థ ఈ ఏడాది స్వర్ణోత్సవ సంవత్సరంలోకి అడుగుపెట్టిన నేపథ్యంలో ప్రస్తుతం ప్లాంటులో తయారు చేస్తున్న యంత్ర పరికరాలు, విడిభాగాలతో పాటు రానున్న రోజుల్లో వివిధ పరిశ్రమల ఆధునిక అవసరాలను పరిగణనలోనికి తీసుకొని వ్యాపార విస్తరణ చర్యలు చేపట్టాలన్నారు. ఆప్మెల్ అభివృద్ధికి, ముఖ్యంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకోవడానికి, తద్వారా మరింత ఉన్నత స్థాయికి ఎదగడానికి సింగరేణి సంస్థ ఎప్పుడు సహకరిస్తూనే ఉంటుందన్నారు.

### సోలార్ ప్లాంట్ ఏర్పాటుతో విద్యుత్ ఖర్చులలో భారీ ఆదా

ఆప్మెల్ ప్లాంటు విద్యుత్ మరియు కాలనీ అవసరాలు కలిపి ప్రతీ ఏడాది 60 లక్షల రూపాయలు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ప్రస్తుతం రూ.1.24 కోట్లతో ఏర్పాటు చేసిన ఈ సోలార్ ప్లాంట్ తో ఏడాదికి 24 లక్షల రూపాయలు ఆదా అవుతుంది. ఐదేళ్లలో పెట్టుబడి మొత్తాన్ని రాబట్టుకోవచ్చు. అలాగే పర్యావరణ హిత చర్యలకు ప్రోత్సాహం అందించినట్లు అవుతుంది. ఆప్మెల్ ఛైర్మన్ శ్రీ ఎన్‌వికె శ్రీనివాస్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థ అభివృద్ధికి చేపట్టబోయే ప్రణాళికలను వివరించారు. సింగరేణి, కోల్ ఇండియా, ఎన్ఎండీసీ సంస్థల నుంచి లభించిన ఆర్డర్లను సకాలంలో పూర్తి చేశామని వెల్లడించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు ఎల్వీ సూర్యనారాయణ, కె.వెంకటేశ్వర్లు, గౌతమ్ పోట్రు, ఎం.తిరుమలరావు, ఈడీ(కోల్ మూవ్‌మెంట్) బి.వెంకన్న, జనరల్ మేనేజర్ (కోఆర్డినేషన్, మార్కెటింగ్) టి.శ్రీనివాస్ పాల్గొన్నారు. విజయవాడ ఆప్మెల్ నుంచి ఎండి ఎర్రన్న ఇంకా ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# జూరాల వరదతో రైతుల కళ్లలో ఆనందం



**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జులై 29 (జనం సాక్షి) :** ఆకాశం నుంచి కురిసే వర్షం కోసం, కాలువలో పారే నీటి కోసం, గత ఏడాదిగా కళ్లు కాయలు కాచేలా ఎదురుచూసిన రైతుల ముఖాల్లో ఆనందం కనిపిస్తుంది. ఎగువన మహారాష్ట్ర, కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కృష్ణా, గోదావరి బేసిన్లోని ప్రధాన ప్రాజెక్టులకు వరద పోటెత్తుతోంది. దీంతో అధికారులు జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేస్తుండగా, శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ప్రాజెక్టుల్లోకి భారీగా నీరు చేరుతోంది.

కృష్ణా నదిపై గేట్‌వేగా ఉన్న జూరాల ప్రాజెక్టుకు ఎగువ ఆల్మట్టి, నారాయణపూర్ నుంచి భారీ వరద వస్తోంది.ప్రస్తుతం జూరాలకు 21000క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతోంది.అవుట్‌ఫ్లో 2200 క్యూసెక్కులుగా ఉంది. ప్రస్తుతం శ్రీశైలంలో ఆశాజనకంగా నీటి నిలువ లేదు.

గోదావరి బేసిన్‌లోని ఎస్ఆర్ఎస్పీకి స్థానిక వర్షాలతో పాటు ఎగువ నుంచి కూడా వరద వస్తోంది. అయితే తాజా సమాచారం ప్రకారం నిజాంసాగర్‌కు కర్ణాటకలోని మంజీరా క్యాచ్‌మెంట్ నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో ప్రస్తుతం 350 క్యూసెక్కులు మాత్రమే స్థానికంగా వస్తున్నాయని, స్టోరేజ్ 3.5 టీఎంసీగా ఉందని సమాచారం. సీడబ్ల్యూసీ హెచ్చరిక ప్రకారం వచ్చే 5 రోజులు కృష్ణా, భీమా బేసిన్‌లో భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ఇన్‌ఫ్లోలు మరింత పెరిగే అవకాశం ఉంది. జూరాల, ఎస్ఆర్ఎస్పీ, నిజాంసాగర్ ప్రాజెక్టుల దిగువన ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. విద్యుత్ ఉత్పత్తికి జూరాల నుండి 27000 క్యూసెక్కులు ఉత్పత్తికి వదులుతున్నారు. ఖరీఫ్ సీజన్ ఆలస్యంగా మొదలైన నేపథ్యంలో జూరాల నుంచి శ్రీశైలానికి వరద రావడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.ఎగువన కురుస్తున్న వర్షాలతో జూరాల ఫుల్ అవుతోంది. అధికారులు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నదని అంటున్నారు.

# అత్యుత్తమ డిజిటల్ పౌరసేవల వేదికగా మీ-సేవ

- డిజిటల్ సేవల విస్తృతి, ప్రమాణాలు పెంచాలి
- అధికారులతో ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు




**హైదరాబాద్, జూలై29 (జనంసాక్షి) :** ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభతరంగా, వేగవంతంగా, పారదర్శకంగా అందించేందుకు మీ–సేవ వ్యవస్థను దేశంలోనే అత్యుత్తమ డిజిటల్ పౌర సేవల వేదికగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సంబంధిత అధికారులను ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీ–సేవ విభాగం పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో శాఖ అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాలు, ఈ–గవర్నెన్స్ ప్రాజెక్టులు, డిజిటల్ సేవల పురోగతిని సిఎస్ సమీక్షించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆగస్టు 15 నాటికి మీ–సేవ ద్వారా అందించే సేవల పరిధిని మరింత విస్తరించాలని అధికారులను ఆదేశించారు. ప్రస్తుతం 33 ప్రభుత్వ శాఖలకు సంబంధించిన అనేక సేవలు మీ–సేవ ద్వారా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని సేవలను ఈ వేదికలో చేర్చేందుకు కార్యాచరణ చేపట్టాలని సూచించారు. ప్రస్తుత ఆధునిక సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సు డేటా ఆధారిత పరిష్కారాలను మీ–సేవ వ్యవస్థతో అనుసంధానించి, ఈ–గవర్నెన్స్ సేవలను ప్రజల ముంగిటకు మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే విధంగా ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు. పౌరులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వీలైనన్ని ఎక్కువ సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు నాణ్యమైన, పారదర్శకమైన, సమయానుకూలమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ప్రధాన కార్యదర్శి, మీ–సేవను దేశంలోనే ఆదర్శవంతమైన పౌర సేవల వేదికగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సమావేశంలో ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ అనుదీప్ దూరిశెట్టి, మీ–సేవ డైరెక్టర్ రవికిరణ్‌తో పాటు సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వామ్మో సర్కారు బడి..!
# ప్లాస్టిక్ కవరే పైకప్పు

- పెచ్చులూడిన భవనంలో ప్రాణాలను పణంగా పెట్టి పాఠాలు
- భారీ వర్షాలతో భయం గుప్పెట్లో విద్యార్థులు.. అధికారులు తక్షణం స్పందించాలని గ్రామస్తుల డిమాండ్







రంగారెడ్డి బ్యూరో (జనంసాక్షి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ విద్యాభివృద్ధికి కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నామని చెబుతున్నా, క్షేత్రస్థాయిలో మాత్రం ప్రభుత్వ పాఠశాలల దుస్థితి ఆందోళన కలిగిస్తోంది. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండలం లాలాపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పరిస్థితి దీనికి నిదర్శనంగా నిలిచింది. శిథిలావస్థకు చేరుకున్న భవనంలో చదువుకోవాల్సి వస్తుండటంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు నిత్యం భయాందోళనల మధ్య కాలం గడుపుతున్నారు. పాఠశాల భవనం పైకప్పు పూర్తిగా దెబ్బతిని పెచ్చులు ఊడిపడుతుండటంతో వర్షపు నీరు తరచూ తరగతి గదుల్లోకి చేరుతోంది. దీంతో ఉపాధ్యాయులే భవనం పైకప్పుపైకి ఎక్కి ప్లాస్టిక్ కవర్లు కప్పి, వర్షపు నీరు లోపలికి రాకుం డా తాత్కాలిక ఏర్పాట్లు చేసి విద్యా బోధన కొనసాగిస్తున్నారు. ఎప్పుడు భవనం కూలిపో తుందోననే భయంతో 26 మంది విద్యార్థులు చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

గతంలోనూ పైకప్పు పెచ్చులు ఊడి విద్యార్థులు, ఉపాధ్యాయులపై పడిన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. అయినప్పటికీ సంబంధిత అధికారులు శాశ్వత చర్యలు తీసుకోకపోవడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ప్రమాదం మరింత పెరిగిందని, ఎలాంటి అవాంఛనీయ ఘటన జరగక ముందే విద్యాశాఖ అధికారులు స్పందించి నూతన పాఠశాల భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370